మాన్యుస్క్రిప్ట్ గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 307 పేజీలు: 12 వెల: 6.50

# పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్య

## ● అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు ● అన్ని హాస్టళ్లు రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం ● టీచర్లందరికీ ప్రపంచస్థాయి శిక్షణ ● జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్: సిఎం చంద్రబాబు



**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆయన బీసీ,ఎస్సీ,ఎస్టీ ఇతర సంక్షేమశాఖల అధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు.పలువురు ఉన్నతాధికారులతో వర్చువల్‌గాను మాట్లాడారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థితులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బిసి బాలికల పాఠశాలను రూ.2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికివందనం పథకంనుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు.

అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలుతీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. అత్యాధునిక విద్యను తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని ఆ దిశగా టీచర్లలో నైపుణ్యాలు పెంపొందించేందుకు విదేశాల్లో శిక్షణఇస్తున్నామని సిఎం అన్నారు. దశలవారీగా టీచర్లందరికీ ప్రపంచస్థాయి విద్యపై శిక్షణ ఇస్తామని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులను అనేక వేధింపులకు గురిచేశారని కాని కూటమి ప్రభుత్వం టీచర్లను గౌరవించడం ప్రథమ కర్తవ్యంగా పెట్టుకుందని వివరించారు. టీచర్లను గౌరవించడంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గతంలో విద్యా >>2



ఆదివారం డల్లాస్‌లో నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

# ప్రవాసాంధ్రులకు అండగా ఉంటా

## మీ మద్దతుతోనే కూటమి సూపర్ హిట్

## 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

## డల్లాస్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేష్

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి పక్షంలో అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం, మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా డల్లాస్ లోని కర్టిస్ కల్ వెల్ సెంటర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా హరిహర >>2



ఆదివారం జల్లిపల్లి గ్రామవద్ద పిఎబిఆర్ కుడి కాలువకు గండి పడి నీరు పంట పొలాల్లోకి వెళుతున్న దృశ్యం

# పిఎబిఆర్ కుడికాలువకు భారీ గండి

## 20 నుంచి 30 మీటర్ల మేర కోతకు గురైన కాలువ 2లో

## నీట మునిగిన వరి, వేరుశెనగ, కంది, మిరప పొలాలు

# రూ. 610 కోట్ల రిఫండ్

## 95% విమాన సర్వీసుల పునరుద్ధరణ

## కుదుటపడుతున్న ఇండిగో



**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంపై కేంద్ర పౌర విమానయాన శాఖ కఠిన చర్యలు కార్యరూపంలోకి వచ్చాయి. రద్దయిన లేదా తీవ్రంగా ఆలస్యమైన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు చెల్లించాల్సిన రిఫండ్‌లను ఆదివారం రాత్రి 8 గంటలలోపు పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ ప్రకారం ఇండిగో యాజమాన్యం ఇప్పటివరకు సుమారు రూ. 610 కోట్లను ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. విమానాల రద్దు కారణంగా తమ ప్రయాణాలను రీషెడ్యూల్ చేసుకునే వారి నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రయాణికులకు తక్షణమే సహాయం అందించేందుకు, రిఫండ్, రీబుకింగ్ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడిం >>2

## రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చిరుధాన్యాలు 2లో

## ఆలయంలో ఇటు చేతివాటం అమ్మవారి ఆభరణాలు, చీరెలు తస్కరణ 2లో

## 'వందేమాతరం'పై నేడు లోక్‌సభలో చర్చ 9లో





ఆదివారం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు భేటీ దృశ్యం

# మధ్యప్రదేశ్‌లో సిఎం ఎదుట 10మంది మావోయిస్టుల లొంగుబాటు

**భోపాల్, డిసెంబరు 7:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బాలాఘాట్ జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కన్హా- భోరందియో(కెబి) డివిజన్‌కు చెందిన నలుగురు మహిళలతో సహా 10 మంది మావోయిస్టులు సిఎం ఎదుట తమ ఆయుధాలు సమర్పించి లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో స్పెషల్ ఎంజోన్ కమిటీ సభ్యుడు, మోస్ట్‌వాంటెడ్ కమాండర్ సురేందర్ అలియాస్ కబీర్ కూడా ఉన్నారు. ఇటీవల ఓ మహిళా మావోయిస్టు నేత లొంగిపోయిన నెల రోజుల్లోనే ఇంతమంది ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి లొంగిపోవడం ఇదే ప్రథమం. 2023 ఆగస్టులో తీసుకొచ్చిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం నూతన పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ సహాయ, సహకారాలు అందిస్తుందని సిఎం మోహన్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పేరిట దాదాపు రూ.77 లక్షల మేర రివార్డు ఉందని బాలాఘాట్ రేంజ్ ఐజీ తెలిపారు. సురేందర్ అలియాస్ కబీర్ తన వద్ద ఎకె-47 రైఫిల్, వంద రౌండ్ల తూటాలు, రాకేష్ హోడి ఎకె47, 37 రౌండ్ల తూటాలు, లాలిసింగ్ ఐఎన్ఎస్ఎఎస్ రైఫిల్, 40 రౌండ్ల తూటాలు, శిల్పా, నవీన్, జయశీలా ఎస్ఎల్ఆర్, 22 రౌండ్లు, విక్రమ్ రైఫిల్, 7 రౌండ్లు, జరినా రైఫిల్, 10 రౌండ్లు, సమర్ డిటోనేటర్లు, ఐదు యూనిట్ల తదితర ఆయుధాలు పోలీసులకు అందజేసి లొంగిపోయారని ఐజి వివరించారు.



పిఎబిఆర్ కుడికాలువకు గండిపడటంతో నీట మునిగిన పంట పొలాలు

# పిఎబిఆర్ కుడికాలువకు భారీ గండి

**ఉరవకొండ, డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం జల్లిపల్లి గ్రామంవద్ద పిఎబిఆర్ కుడి కాలువకు 4.20 కిలో మీటరువద్ద భారీ గండి పడింది. ఆదివారం తెల్లవారు జామున దాదాపు 2 గంటల సమయంలో కాలువ 20 మీటర్ల మేర తెగిపోవడంతో పక్కనేగల దాదాపు 40 ఎకరాల్లో పంట పొలాల్లోని పంటలు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోగా, మరిన్ని పొలాలు నీట మునిగాయి. ఫలితంగా దాదాపు కోటి రూపాయలు మేర రైతులకు ఆస్తినష్టం సంభవించింది. ఇదివరకే ఒకటి రెండు సార్లు గండిపడిన చోటే మరొకమారు గండి పడటం విశేషంగా చెప్పాలి. వివరాల్లోకి వెళితే... కూడేరు మండలంలోని 42 చెరువులను నింపడానికిగాను పిఎబిఆర్ కుడి కాలువకు దాదాపు వారం రోజుల క్రితం నుండి నీటిని విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే కాలుకు నీటిని విడుదల చేసే గేటు తప్పుపట్టి పోవడంతో దాని నిర్వహణ కష్టతరంగా మారినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కాలువకు భారీ గండి పడింది. దీంతో కాలువ దాదాపు 20 మీటర్ల మేర కోతకు గురై నీరు మొత్తం కాలువ పక్కనగల బోర్లు, బావుల కింద సాగులోవున్న వరి, వేరుశెనగ, కంది, కొంత మేర మిరప పంట పొలాలను ముంచెత్తింది. ఇదివరకే 20 ఎకరాల్లో వరి పంట కోతలు జరుగగా ఆ పంట మొత్తం కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. నీటి ఉద్ధృతికి పంట భూములు రెండు, మూడు మీటర్ల మేర కోతకు గురై పొలాల్లోకి బంకమట్టి, రాళ్లు గుండ్లు చేరాయి. అంతే కాకుండా బోర్లు మునిగిపోగా పైపులు కొట్టుకుపోయి బావులు పూడిపోయాయి. చేతికందిన పంట నోటి కందకుండా పోయిందని దీంతో దాదాపు కోటి రూపాయల మేర పంట నష్టం జరిగిందని బాధిత రైతులు నరేష్, రామాంజినేయులు, లాలెప్ప, చిన్న ఎర్రిస్వామి, అనీల్ తదితరులు చెబుతున్నారు. కోతకు గురైన పంట పొలాలను బాగు చేసుకోవడానికి కూడా భారీగా మళ్లీ పెట్టుబడి పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పుడు గండిపడిన చోటే గత ఏడాది కాలువకు గండిపడినా అధికారులు సరైన రీతిలో గండి పూడ్చివేత చేపట్టలేదని కేవలం ఇసుక బస్తాలు అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారని చెబుతున్నారు. నాడే శాశ్విత ప్రాతిపదిక కాలువకు గండి పూడ్చి ఉంటే నేడు మరొకమారు గండి పడేది కాదని అంటున్నారు.

**గండిను పరిశీలించిన తహాశీల్దార్:**

కాగా గండి పడిన ప్రదేశాన్ని కూడేరు మండల ఇంచార్జ్ తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా సిబ్బందితో కలిసి పరిశీలించారు. గండి పడటంతో పంటలకు జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. గండి పూడ్చివేతపై సంబంధితశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఘటనపై సమగ్ర సమాచారంతో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

**పిఎబిఆర్ కుడి కాలువ గండి పూడ్చేందుకు తక్షణం చర్యలు చేపట్టండి: మంత్రి పయ్యావుల కేశవ్**

గండిని పూడ్చివేయడానికి అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. పిఎబిఆర్ కుడి కాలువకు పడిన గండి విషయం తెలిసిన వెంటనే ఆయన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గండిని పూడ్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని, గండి పడిన ప్రాంతంవద్ద శాండ్ బ్యాగులు ఏర్పాటు చేని నీరు వృథాగా పోకుండా చూడాలని ఆదేశించారు. నీరు వృథా కాకుండా ఉండేందుకు 0.40 కిలో మీటరువద్ద ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా నీటిని పెన్నా నదిలోకి మళ్లించి ఎంపిఆర్ డ్యాంకు నీరు చేరేలా చర్యలు చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం, క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు,విశాఖలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడుదారుల సదస్సు తదితరాల అనంతర పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. పెట్టుబడుల దిశగా రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, విద్యారంగం, వైద్యం తదితరంశాల్లో మౌలిక విషయాలు, సమస్యాలు గురించి ఆయన గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. జిల్లాల పునర్విభజనంశంపై, రాష్ట్రమంతటా సమానంతర ప్రాంతీయాభివృద్ధిని గురించి వివరించారు. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో జాతీయ,ప్రాంతీయంశాలపైనా ముచ్చటించారు. ఇందుకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన కీలక సమాచారాన్ని అనుసరించి సిఎం చంద్రబాబు నిన్న లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. సిఎం చంద్రబాబుమర్యాద పూర్వకంగా గవర్నర్‌తో సమావేశమయ్యారని సిఎంఒ వర్గాల సమాచారం.

# పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్య

>> వ్యవస్థను అస్తవ్యస్తంచేశారు ఇప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైనవిధానంతో ముందుకెళ్తోందని తెలిపారు. కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకొస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర నినాదంతో ముందుకెళ్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. ఉద్యోగాలు వేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరతారని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెస్రూట కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అలానే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకొస్తే ప్రభుత్వం దేస్తామని వెల్లడించారు. పిల్లల వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని సిఎం కొనియాడారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమిట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖలో 29 సంస్కరణలు తీసుకొచ్చామని రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు తెస్తామని సిఎం అన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు. సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసేబాధ్యత తీసుకోవాలని అధికారులకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనాఉంటే వెంటనే విడుదల చేయాల న్నారు. అలాగే హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సిఎం సూచించారు. ముస్లిం రాష్ట్రంలో వక్ఫ్ బ్రాండ్ అవుట్ జరిగింది... అయితే ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెలుసుకునేందుకు మదింపు జరగాలన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆర్థిక ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సిఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్‌లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సాహం చాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. ఆర్థికాభ్యున్నతికి సమన్వయం చేసేలా. ఉండాలన్నారు. అందరికి సంక్షేమ ఫలాలందజేశాం... అధికార యంత్రాంగం చూడాలన్నారు., సంతృప్తి పరచాలని సిఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బిసి లకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బిసి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్ షాపు నిర్వహించాలని సూచించారు.

# రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చిరుధాన్యాలు

**విజయవాడ,డిసెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక పౌరసరఫరాల శాఖ దుకాణాలద్వారా తృణధాన్యాలను ఉచితంగా అందించ దనున్నది., ప్రజల ఆరోగ్యం, మారుతున్న ఆహార అలవాట్లను దృష్టిలో పెట్టుకుని పేద ప్రజలకు పోషక విలువలు కలిగిన తృణ ధాన్యాలను ఉచితంగానే సరఫరా చేస్తోంది. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డుదారులకు రాగులు, రాగిపిండిని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసింది. ఇప్పుడు మళ్లీ టిడిపికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ సరుకుల్లో తృణ ధాన్యాలను అందించాలని నిర్ణయించింది. రేషన్‌దుకాణాల ద్వారా ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో జొన్నల పంపిణీని ప్రారంభించింది. ప్రతి మనిషికి ఐదు కేజీల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ రేషన్‌లో కొంతమేర బియ్యానికి బదులుగా రెండుగాని మూడు కేజీలవరకు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ప్రతి నెలా 20కేజీల రేషన్ బియ్యం తీసుకునే కుటుంబం.. ఇప్పుడు రెండు కేజీల రాగులు మాత్రమేకావాలనుకుంటే..ఆ మేరకు బియ్యాన్ని మినహాయించుకుని మిగిలిన 18కేజీల బియ్యాన్ని, రెండు కేజీల రాగులను అందిస్తారు. జాతీయ ఆహార భద్రత పథకంలోభాగంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రంలో పీడీఎస్ అవసరాలకు సరిపడా రాగులు,జొన్నలను కేటాయించేది. ఇప్పుడు కేంద్రం కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే టెండరు ప్రక్రియ ద్వారా సేకరించి ఉచితంగా సరఫరా చేస్తోంది.

# రూ. 610 కోట్లు రిఫండ్

>> చింది. ప్రభుత్వ జోక్యంతో ఇండిగో పనితీరు క్రమంగా మెరుగుపడుతోందని, విమానాల షెడ్యూల్స్ సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. శుక్రవారం 706 విమానాలు నడపగా, శనివారానికి ఆ సంఖ్య 1,565కు పెరిగింది. ఆదివారం 1,650కి చేరుకున్నాయని వెల్లడించింది. ఇతర దేశీయ విమానయాన సంస్థల కార్యకలాపాలు సజావుగా పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని తెలిపింది. ఇండిగో విమానాల రద్దుతో పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని టికెట్ ధరలు అమాంతం పెరగడంతో, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ధరలపై పరిమితి విధించింది. ఈ చర్యతో ప్రభావిత మార్గాల్లో ఛార్జీలు అదుపులోకి వచ్చాయని పేర్కొంది. అదేవిధంగా, ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి అందజేయాలని ఆదేశించగా, శనివారం నాటికి 3,000 బ్యాగులను ఇండిగో డెలివరీ చేసింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ప్రధాన విమానాశ్రయాల్లో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని, కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్లు ధృవీకరించారు. ప్రభుత్వ వేగవంతమైన చర్యలతో దేశవ్యాప్తంగా విమానయాన కార్యకలాపాలువేగంగా స్థిరపడుతున్నాయని, పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రిత్వశాఖ హామీ ఇచ్చింది. దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు తీవ్ర గందరగోళంలో పడ్డాయి. పెద్ద ఎత్తున విమానాలు ఆలస్యం కావడం, కొన్ని సర్వీసులు రద్దుకావడంతో వేలాదిమంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభంపై తక్షణమే స్పందించిన ఇండిగో యాజమాన్యం, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఒక ఉన్నత స్థాయి సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ప్రస్తుత సంక్షోభం, దాని తీవ్రతపై యాజమాన్య బృందం బోర్డు సభ్యులకు సమగ్రంగా వివరించింది. అనంతరం బోర్డు సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై, వేగంగా మారుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, సర్వీసులను సాధారణ స్థితికి తీసుకురావడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొంది.

# అండగా ఉంటా

>> పీఠం వేదపండితులు మంత్రి లోకేష్‌కు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ.... ఈ సమావేశానికి విచ్చేసిన నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, జనసేన, బిజెపి కార్యకర్తలకు నా హృదయపూర్వక నమస్కారాలు. నేను అమెరికాలో నాలుగేళ్లు అండర్ గ్రాడ్యుయేషన్ చేశాను, రెండేళ్లు వాషింగ్టన్ డీసీలోని వరల్డ్ బ్యాంక్‌లో పనిచేశాను. మరో రెండేళ్లు స్టాన్ ఫోర్డ్‌లో ఎంబీయే చేశాను. ఈ దేశంలో సుమారు తొమ్మిదేళ్లు ఉన్నాను. కానీ ఎప్పుడూ జరగని సంఘటన ఈ రోజు జరిగింది. నేను ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు వస్తుండగా ఆరుగురు పోలీసులు వచ్చారు. వారు నన్ను ఇక్కడ ఆగండి అని చెప్పారు. బయట చాలా రద్దీగా ఉంది, మీరు బయటకు వెళ్లేందుకు పర్మిషన్ లేదు అని చెప్పారు. డల్లాస్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచి ఈ రోజు ఈ కార్యక్రమం వరకు నాకు ఇంతపెద్ద ఘనస్వాగతం పలికిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇక్కడ చాలామంది నాకు ప్రతిపక్షం రోజుల నుంచి పరిచయం ఉన్నవారు ఉన్నారు. వారిని చూసినప్పుడు ఆ రోజులు గుర్తుకువస్తున్నాయి. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుని కాపాడే బాధ్యత మీ లోకేష్ తీసుకుంటాడు. చంద్రబాబు గారిని 53 రోజులు పాటు అక్రమంగా బంధించినప్పుడు అమెరికాలోని ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున బయటకు వచ్చి మాకు అండగా నిలిచారు. డల్లాస్‌లో ఏకంగా మూడు కార్యక్రమాలు నిర్వహించారు. మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారు. ఈ రాజకీయాలు మనకు అవసరమా ఆనాడు బ్రాహ్మణి అడిగారు. అమెరికాలో, హైదరాబాద్‌లోని స్టేడియంలో నిర్వహించిన గ్రాటిట్యూడ్ కార్యక్రమానికి సుమారు 45వేల మంది వచ్చి మాకు అండగా నిలబడ్డారు. ధైర్యం ఇచ్చారు. ఈ వేదికపై నిల్చొని మాట్లాడుతున్నానంటే మీరు అండగా నిలవడం వల్లే అన్నారు, దేశంలో అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉన్నాయి. ఒక్క ఎపిలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. కేంద్రంలో ప్రధాని మోడీ గారి నాయకత్వం, ఎపిలో చంద్రబాబు గారి నాయకత్వం, మరో వైపు నాకు అన్నసమానమైన పవనన్న నాయకత్వంతో మనం ముందుకు వెళ్తున్నాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. అనంతపురం జిల్లాను ఆటోమోటివ్ హబ్‌గా చేశాం, కర్నూలులో పెద్దఎత్తున రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం, అనేక సిమెంట్ ఫ్యాక్టరీలు తీసుకువస్తున్నాం. చిత్తూరు, కడపకు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, నెల్లూరు జిల్లాకు డైవర్సిఫైడ్ మాన్యుఫ్యాక్చరింగ్, సోలార్ సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకువచ్చాం. ప్రకాశంను సిబిజి హబ్‌గా తయారుచేస్తున్నాం. కృష్ణా, గుంటూరులో రాజధానితో పాటు క్వాంటమ్ కంప్యూటర్ తీసుకువస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. రిఫైనరీలు, అనేక మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకువస్తున్నాం. ఉత్తరాంధ్రకు వచ్చేసరికి ఐటీ, ఫార్మా, మెడికల్ డివైసెస్ మాన్యుఫ్యాక్చరింగ్ తో పాటు ఆర్సెల్లర్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ను కూటమి ప్రభుత్వం తీసుకువస్తోంది.20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఆ రోజే నిర్ణయించుకున్నా. మేం తిరగని దేశాలు లేవు. గత 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 16 లక్షల మందిగి ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అవన్నీ వచ్చే మూడు నెలల్లో గ్రౌండ్ చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

**ఈ మీటింగ్ చూసిన తర్వాత టీమ్ 11కి నిద్ర పట్టదు..**

ఈ మీటింగ్ చూసిన తర్వాత టీమ్ 11కి నిద్ర పట్టదు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ గారు. సంక్షేమాన్ని భారతదేశానికి పరిచయం చేసినవ్యక్తి అన్న ఎన్టీఆర్. గతంలోమనల్ని మదరాసీలు అనేవారు. మదరాసీలు కాదు.. తెలుగువాళ్లం ఉన్నామని దేశానికి చాటిచెప్పిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్ గారు. అభివృద్ధి చేసి ఎన్నికల్లో గెలవవచ్చని నిరూపించిన వ్యక్తి చంద్రబాబు గారు. ఐటీ చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు గారు చెబితే.. కంప్యూటర్లు అన్నం పెడతాయా అని ఆనాటి ప్రతిపక్ష నేతలు ఎగతాళి చేశారు. ఇప్పుడు మిమ్మల్నందరినీ అడుగుతున్నా.. కంప్యూటర్ అన్నం పెడుతోందా అని. హైదరాబాద్‌కు పెద్దఎత్తున ఐటి కంపెనీలు తీసుకువస్తే విమర్శించారు. మీరొక్కసారి హైటెక్ సిటీకి వెళితే.. గుర్తుపట్టలేని పరిస్థితి.

**చంద్రబాబునాయుడు గారు దార్శనిక నాయకుడు..**

చంద్రబాబు ఐటీని పరిచయం చేసిన తర్వాత ఈ రోజు బెంగళూరుకు హైదరాబాద్ పోటీ ఇస్తోంది. చంద్రబాబు వయసు 75ఏళ్లు. 20 ఏళ్ల కుర్రాడిలా పరిగెడుతున్నారు. గతంలో ఐటీ, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ. ఆయన ముందు చూపు ఉన్న నాయకుడు. తెలుగుజాతికే అది ఒక అదృష్టం. దేశంలో ఏ పార్టీ ప్రకటించని విధంగ కార్యకర్తే మా అధినేత అని ప్రకటించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. నాయకులు శాశ్వతంకాదు.. కార్యకర్తలే టిడిపికి బలం. అధికారంతో సంబంధం లేదు. అన్నగారిని చూసినా, ఆ పసుపు జెండా చూసినా మనకు ఎక్కడలేని ఎమోషన్. కూటమిలో విడాకులు ఉండవు, మిస్ ఫైర్‌లు ఉండవు, క్రాస్ ఫైర్‌లు ఉండవు.. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్, ఒడిశాలో ఒకే ప్రభుత్వం ఉండటం వల్ల అభివృద్ధి జరిగింది. ఎన్డీయే కూటమి రాబోయే పదేళ్లు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంది. కలలకు రెక్కలు పేరుతో వచ్చే ఏడాది నుంచి విదేశాల్లో చదువుకునే వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఎపి ఎన్ఆర్టీ మీకు అండగా నిలుబడుతోంది. విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టం వచ్చినా ఎపి ఎన్ఆర్టీ మీకు అండగా ఉంటుంది.

**జాబ్ క్రియేటర్స్‌గా తయారు కావాలి..**

ఇక్కడ ఉన్న అందరూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. చదువుకుని మంచి ఉద్యోగాల కోసం ఇంత దూరంవచ్చాం. ఒక్కో కుటుంబానికి దేవుడు ఒక్కో పరీక్ష పెడతాడు. 2019లో నేను మంగళగిరిలో పోటీచేసి ఓడిపోయాను. కానీ అధైర్యపడలేదు. కసితో పనిచేసి 91వేల మెజార్టీతో విజయం సాధించాను. చిన్న ఎదురుదెబ్బ తగిలిందని బాధపడటం,ఆత్మహత్యలకు పాల్పడటం సరైన మార్గం కాదు. మన తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. అద్భుతంగా పెంచారు. వారి గురించికూడా ఆలోచించాలి. అందుకే అండగా నిలబడతాం. కేవలం జాబ్ సీకర్స్‌గా మాత్రమేకాకుండా జాబ్‌క్రియేటర్స్‌గా మనంతయారుకావాల్సిన అవ సరంఉంది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కూడా మీకు అండగా నిలబడు తుంది. అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఒకరికొకరు అండగా నిలవాలి. అప్పుడే మనం అనుకున్నది సాధించగలుగుతాం. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. మేంఎలాంటి కక్షసాధింపులకు పాల్పడటంలేదు. నా తల్లిని అవమానించిన వారిని వదిలిపెట్టను. మీ తల్లిని అవమానించినా వదిలిపెట్టను. మా అమ్మ ఏనాడూ రాజకీయాల్లోకి రాలేదు. వారి నాన్న గారు ముఖ్యమంత్రి, భర్త ముఖ్యమంత్రి. కానీ ఒక్క పోస్టింగ్ కానీ, కాంట్రాక్ట్‌లో కానీ ఏనాడూ ఇన్ వాల్వ్ కాలేదు. అలాంటి తల్లిని శాసనసభ సాక్షిగా అవమానిస్తే వదిలిపెట్టే ప్రసక్తే ఉండదు. మీకుఎలాంటి డౌట్‌వద్దు. వారుఅవమానించారని మనం అవమానించ కూడదు. స్త్రీలను గౌరవించాలని మంత్రి నారా లోకేష్ అన్నారు.

## వారం - వర్జ్యం

08-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
చవితి సా.4.10
పుష్యమి రా.2.56, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.25-5.02
దు.మ.12.33-1.08, 2) మ.3.27-3.22
శుభసమయం : ఉ.10.00-11.00,
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఇవి ఆర్థికంగా లభించక పోయినా మానసిక తృప్తి నిస్తాయి.

**వృషభం:** దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ధనలాభం.

**మిథునం:** నిరాశ, నిస్పృహల మధ్యకాలం వెళ్లదీస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.దూర ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం:** జీవిత భాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనసౌఖ్యం.ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

**సింహం:** సన్నిహితులతో స్వల్ప అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి. ఉద్యోగులకు బదిలీలు.

**కన్య:** తియ్యని మాటలతో మోసగించే వ్యక్తులు తారస పడతారు. అప్రమత్తతో ఉండండి. జీవిత భాగస్వామితో స్పర్ధలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోండి.

**తుల :** అనుకున్నదే తడువుగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ధన లాభం.

**వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం.గృహం కొనుగోలు యత్నాలు చేస్తారు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో కలసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బంది కలిగిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. శుభ కార్యాలలో పాల్గొంటారు. ధనలాభం.

**కుంభం:** దైవబలం ఉంటే అసాధ్యం లేదని నమ్మి భగవంతునిపై భారం వేస్తారు. ఉద్యోగ యత్నాలు.వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఇఒ చేతివాటం

## అమ్మవారి ఆభరణాలు, చీరెలు తస్కరణ

## పట్టుకున్న భక్తులు, గ్రామస్తులు, పోలీసులకు అప్పగింత

**కదిరి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** అమ్మవారి ఆభరణాలను కాపాడాల్సిన దేవాలయ ఈవోనే.. అదే ఆభరణాలపై కన్నేసి దొంగతనానికి దిగితే... ఆ దేవత భక్తులు ఎలా వదిలేస్తారు చెప్పండి. అదే ఘటన జరిగింది శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గంగమ్మ గుడి వద్ద. ఆలయానికి రక్షణగా ఉండాల్సిన కార్యనిర్వాహక అధికారియే ఆలయం వద్దకు ఆటోలో వచ్చి చోరీకి పాల్పడి.. అడ్డంగా దొరికిపోయాడు. అసలేం జరిగిందంటే.. ఎర్రదొడ్డి గంగమ్మ గుడి ఇఒ మురళీకృష్ణ.. ఆలయంలోని అమ్మవారికి సంబంధించిన 5 కిలోల వెండి ఆభరణాలు, చీరలు సహా ఇతర విలువైన వస్తువులు చాకచక్యంగా తస్కరించి చేతివాటంప్రదర్శించాడు. ఎవరూ లేరనుకుని దోచుకున్న సామగ్రితో తప్పించుకునేందుకు సిద్ధమయ్యాడు. గమనించిన భక్తులు,స్థానికులు.. అడ్డంగా అతణ్ని పట్టుకున్నారు. అనంతరం.. పోలీసులకు సమాచారం అందించారు. పట్టుబడిన మురళీకృష్ణ సహా అతడి కుటుంబ సభ్యులను ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి.. మొత్తం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులను తీవ్రంగా విమర్శిస్తూ వెంటనే ఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సిఎం సీరియస్.. ఆలయాల్లో తప్పులు చేస్తే కఠిన చర్యలని హెచ్చరిక

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యసాయి జిల్లా కదిరి రూరల్ పరిధిలో గంగమ్మ గుడిలో ఆలయ ఈవోనే చోరీచేసిన ఘటనపై ప్రభుత్వం చర్యలుచేపట్టింది. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇఒ మురళీకృష్ణను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. గుడిలో 5 కిలోల వెండి ఆభరాణలు, చీరలు సహా ఇతర విలువైన వస్తువులను అదే దేవాలయం ఇఒ మురళీ కృష్ణ చోరి చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికి పోయాడు. ఆలయ ఇఒనే చోరికి పాల్పడిన ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.

ఈ ఘటనకు పాల్పడిన ఇఒ మురళీ కృష్ణను సస్పెండ్ చేయాల్సిందిగా దేవదాయ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇఒ మురళి కృష్ణను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే చోరికి ప్రయత్నించిన ఇఒ మురళీ కృష్ణపై కేసు నమోదు చేయాలని సిఎం ఆదేశించారు. స్థానిక దేవాదాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు..ప్రాథమిక విచారణలో చోరీ నిర్ధారణ కావడంతో అతన్ని అరెస్ట్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా వ్యవహరించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై కేసు నమోదు

**వెంకటాచలం (నెల్లూరు), డిసెంబరు 7, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై వెంకటాచలం పోలీస్ స్టేషన్లో కేసు నమోదుచేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చవటపాలెం సహకార సంస్థ చైర్మన్ రాధాకృష్ణ నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘటనపై పోలీసు కేసునమోదు

## విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తాం: రిజిస్ట్రార్ ఆర్‌కె శుక్లా

**తిరుపతి,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణకుమార్ విద్యార్థినిపట్ల ప్రవర్తించిన తీరుపై తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజినీకాంత్‌శుక్లా ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు183/2025 కేసు నమోదైందని ఎస్పీ కార్యాలయం తెలిపింది. దీనిపై విచారణకు తిరుపతి డిఎస్పీ భక్తవత్సలంను దర్యాప్తు అధికారిగా, ఇద్దరు మహిళ ఎస్ఐలను సహాయ అధికారులుగా నియమించారు. తిరుపతి జిల్లా పోలీసులు ఈ కేసును పూర్తిస్థాయిలో విచారణచేసి దర్యాప్తు పూర్తయ్యాక సంబంధిత నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. యుజిసి నిబంధనలననుసరించి (ఐసిసి) ఫిర్యాదులపై అంతర్గత విచారణ కమిటీ నియమించబడిందని,ఈ కమిటీ అంతర్గత విచారణ చేపట్టి నివేదికను విశ్వవిద్యాలయంకు అందజేయనుంది. విశ్వవిద్యాలయం ఎప్పుడూ విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని శుక్లాతెలిపారు. కాగా విద్యార్థిని పట్ల లైంగికవేధింపులకు పాల్పడిన అతనిని సస్పెన్షన్ చేసినట్లు, విద్యార్థి గర్భందాల్చిన మాట అవాస్తవమని రిజిస్ట్రార్ ప్రకటనలో తెలిపారు.

8-12Pg3exHMNWJQE 3_8-12Pg3exHMNWJQE.qxd 07/Dec/25 11:44 PM Page 1



# కోర్టు ధిక్కార కేసు..'సుప్రీం'ను ఆశ్రయించనున్న ఏయు మాజీ విసి

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు దిక్కార కేసులో సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్ళాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ ఉపసంచాలకులు ప్రసాదరెడ్డి ఆశ్రయించనున్నారు. న్యాయవాదుల సమాచారాన్ని అనుసరించి ఆయన హైకోర్టు అప్పీల్‌కు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదుల సహకారంతో ప్రయత్నిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి (వీసీ) ప్రసాదరెడ్డిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టుధిక్కరణ కేసులో ఆయనకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులు అంటే ప్రసాదరెడ్డికి లెక్కలేదని, విచారణ సందర్భంగా సొంత తెలివితేటలు వాడుతూ, మొండి వైఖరి అవలంభించారని తీవ్రంగా ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలను వరుసగా ఉల్లంఘించారని, ఇలాంటి వ్యవహార శైలి న్యాయ పరిపాలనకు తీవ్ర నష్టమని తెలిపింది. కోర్టు ఆదేశాలు అంటే ఆయనకు గౌరవం తక్కువ అని వెల్లడించింది. వీసీ బాధ్యతల నుంచి వైదొలిగేంత వరకు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని పేర్కొంది. కొత్త వీసీ వచ్చాక కోర్టు ఉత్తర్వులను అమలు చేశారని తెలిపింది. ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపితే న్యాయవ్యవస్థకు నష్టమని వ్యాఖ్యానించింది. జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించాక ప్రసాదరెడ్డి తరఫు న్యాయవాది అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును సస్పెండ్ చేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ 6 వారాలు సస్పెండ్ చేశారు. అప్పీల్ దాఖలు చేయకపోయినా, దాఖలు చేసిన అప్పీల్లో స్టే రాకపోయినా ఈనెల 22న సాయంత్రం 5 గంటలలోపు హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఏయూ సైన్స్, టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో భోదనా సిబ్బందిగా నూకన్నదొర 2006 జులైలో నియమితులు అయ్యారు. ఆ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒప్పందం పద్ధతి పై కొనసాగారు. 17 ఏళ్ల పాటు సేవలు అందించారు. నూకన్నదొరను విధుల నుంచి తొలగిస్తూ ఏయూ వీసీ 2022 నవంబర్ 18న ఉత్తర్వులు ఇచ్చారు. 2022 మే నుంచి చెల్లించాల్సిన జీతం బకాయిలను నిలిపేశారు. తనను విధుల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ నూకన్నదొర 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. 2023 మార్చి 7న విచారణ జరిపిన న్యాయమూర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పిటిషనర్‌ను కొనసాగించాలని నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అప్పటి వీసీ ప్రసాదరెడ్డిపై నూకన్నదొర హైకోర్టులో కోర్టుధిక్కరణ కేసు దాఖలు చేశారు. ఇటీవల ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి ఉద్దేశపూర్వకంగా ప్రసాదరెడ్డి కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని తేల్చారు. జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఈ ఏడాది నవంబర్ 20న తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఒకసారి కోర్టు ఉత్తర్వులు ఇచ్చాక దానిని యథాతథంగా అమలు చేయడమే అధికారుల విధి అని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చని, అంతే తప్ప కోర్టు ఉత్తర్వులకు విభిన్న అర్థం చెప్పడానికి వీల్లేదన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవా? కాదా? అనే విషయాన్ని కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తేల్చలేరని, ఆ ఉత్తర్వులకు కట్టుబడి వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ పరిణామాల నడుమ ప్రసాదరెడ్డి సుప్రీం కోర్టుకు అప్పీల్ దాఖలు చేస్తున్నారు.



## ఫార్మా, ఐటీకి హబ్‌గా ఏపీ

### రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఫార్మా, ఐటీకి హబ్‌గా ఏపీ మారబోతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాల కోఆర్డినేషన్‌కు ఒక వార్ రూమ్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో పీవీఎన్ మాధవ్ మాట్లాడాతూ .వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాలకు మొదటి రోజున మధ్యప్రదేశ్ సీఎం మోహన్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించామని తెలిపారు. వాజ్‌పేయి స్మృతివనం నిర్మిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి పాలనకు వాజ్‌పేయి ఒక నిదర్శనంగా ఉంటారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధికి వాజ్‌పేయి ఆద్యుడని వ్యాఖ్యానించారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భగా ఆయన విగ్రహాలను ఏపీ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఏపీ పురోగతి చెందడానికి, దేశంలోనే ప్రథమ స్థానానికి రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. రాయలసీమను ఒక పవర్ హౌస్‌గా అభివృద్ధి చేయనున్నారని చెప్పుకొచ్చారు. టెలికాం అత్యంత చౌకగా ఉండటానికి కారణం వాజ్‌పేయి అని తెలిపారు. ఈ నెల 11వ తేదీన ధర్మవరంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## 13యేళ్లు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు తగ్గించకుంటే రవాణా బంద్

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం 13 ఏళ్ళు దాటిన వాహనాలకు టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను పెంచుతూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ నిలిపివేయాలని ఏపీ లారీ యాజమానుల సంఘం డిమాండ్ చేసింది. లేదంటే ఈ నెల9 తేది అర్ధరాత్రి నుంచి రైల్వే షెడ్లు, షిప్ యార్డుల్లో గూడ్స్ రవాణా నిలిపివేయాలని నిర్ణయించింది. 13 ఏళ్ళు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు కేంద్రం భారీగానే పెంచిందని లారీ యాజమానుల సంఘం నాయకులు వెల్లడించారు. పాత వాహనాలపై టెస్టింగ్, ఫిట్‌నెస్ ఛార్జీలు ఇంత అధిక మొత్తంలో పెంచడం సరికాదన్నారు. ఈ నోటిఫికేషన్ నిలిపివేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సీఎం వెంటనే ఈ విషయంలో తక్షణం ఒక నిర్ణయం రెండు రోజుల్లో తీసుకోవాలని, లేని పక్షంలో గూడ్స్ వాహనాలకు వీఎల్‌టీడీలు అవసరం లేదన్నారు. మాపై భారం పడకుండా కేంద్రం, రాష్ట్రం చూడాలన్నారు. ఈ విషయం సీఎం సానుకూల రీతిలో స్పందిస్తారని భావిస్తున్నట్లు లారీ యాజమాన్య సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేసారు.

# మూడు కోట్లతో భీమవరం, ఆచంటలో డయాలసిస్ సెంటర్లు

### నిర్మాణ పనులను ప్రారంభించిన కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ

### త్వరలో నాలుగు కోట్లతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకి




డయాలసిస్ కేంద్ర శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

**పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 7:** పశ్చిమ వాసుల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవతో భీమవరం, ఆచంటలలో అత్యాధునిక ప్రభుత్వ డయాలసిస్ విభాగాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ జిల్లాలో భీమవరం విద్య, వైద్య రంగాల్లో ముందున్నప్పటికీ ప్రభుత్వ రంగంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకోలేక పేషెంట్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమస్య తన దృష్టికి వచ్చిందని, అందుకే అత్యవసర వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ ఆరు నెలల్లో అందుబాటులోకి రానుందని, అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన 10 బెడ్‌లను డయాలసిస్ రోగులకు ఉచిత చికిత్స కోసం అందుబాటులోకి వస్తాయని కేంద్రమంత్రి ప్రకటించారు.

అవసరాన్ని బట్టి అదనపు బెడ్‌లను కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని డయాలసిస్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తాడేపల్లిగూడెం డయాలసిస్ సెంటర్‌లో అదనపు బెడ్ల కోసం 2 కోట్లు, ఆచంట డయాలసిస్ సెంటర్ కోసం 1 కోటి, అత్తిలిలో డయాలసిస్ మిషన్లకు 75 లక్షలు సి ఎస్ ఆర్ నిధులను సమకూర్చినట్లు శ్రీనివాస వర్మ తెలిపారు. త్వరలో 4 కోట్ల రూపాయల వ్యయంతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భీమవరం ఎమ్మెల్యే, పి.ఎ.సి. చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి తాను కూడా పవన్ కళ్యాణ్ పేరు మీద సెంటర్ నిర్మిద్దామని భావిస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ రెండు కోట్ల సి.ఎస్.ఆర్ నిధులతో అత్యాధునిక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగరాణి, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ పి. సూర్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, బి.జె.పి. జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి, బి.జె.పి. జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, బండి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పరకామణి కేసు రాజీలో సూత్రధారులు టిటిడి పెద్దలేనా?

**తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలు లెక్కించే పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీ కేసు, తదనంతరం లోక్‌అదాలత్‌లో రాజీజరగడం వంటి కీలక పరిణామాల వెనుక గత టిటిడి పెద్దలు ఉన్నారనే బలమైన ఆరోపణలు ఇప్పుడు గుప్పుమంటున్నాయి. ఇందుకు శనివారం ముద్దాయి రవికుమార్ స్వయంగా ఈ కేసుపై నోరువిప్పి మహాపాపం చేశానని, పెద్దతప్పేనని వీడియో విడుదల చేయడం సంచలనంగా మారింది. ఇప్పటివరకు అన్ని కోణాల్లో అందరినీ విచారణ చేసిన సిఐడి పూర్తిస్థాయిలో దర్యాప్తు వివరాలను హైకోర్టు ధర్మాసనంకు సమర్పించింది. ఈ నివేదికల్లో ఎలాంటి వివరాలు ఇచ్చారనేది అందరిలోనూ ఆందోళనకరమైన అంశం. సిఐడి అధికారులు దర్యాప్తుచేపట్టిన 26రోజుల వరకు అటు రవికుమార్‌గానీ ఇటు కొందరు రాజకీయనేతలు వ్యాఖ్యలు చేయలేదు. కేసు చివరిదశకు చేరుకోవడంతో ఇప్పుడు ఏం జరగనుందనే ఆందోళనతో స్వయం వ్యాఖ్యలు ఎవరికీ నష్టం కలిగిస్తాయనేది మాత్రం చర్చమొదలైంది. పరకామణీలో చోరీ జరగడం తదనంతరం చోటుచేసుకున్న పూర్తి పరిణామాలపై మాజీ టిటిడి పెద్దలతోబాటు టిటిడి మాజీ ఉన్నతాధికారిని, కొందరు పోలీస్ అధికారులను విచారణ చేశారు. ఈ తతంగం మొత్తం గత పెద్దల ఆదేశాలతోనే జరిగిందనేది టిటిడి వర్గాల్లో వాదనలు. రవికుమార్‌కు సంబంధించిన ఆస్తులు, వాటి అంచనాలు వంటి విషయాలను సిఐడి రాబట్టింది. 72వేల రూపాయలు విలువైన దేవుని సొమ్మునుచోరీ చేస్తే 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వ రస్వామికివిరాళంగా స్వీకరించడం ఆషామాషీకాదనేది ఇప్పుడు చర్చకు దారితీసింది. మరీ ఈ కేసులో తదుపరి హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ఏంజరగనుందనేది ఉత్కంఠగా మారింది.

# అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి

### విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని



**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)తో కలిసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తరఫున అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామని విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివానాథ్(చిన్ని)స్పష్టం చేశారు. ఆదివారం విజయవాడలో యోనెక్స్ సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్‌తోపాటు శాప్ చైర్మన్ రవినాయుడు, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పి. అంకమ్మ చౌదరి ఆవిష్కరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. యువతలో స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో ఇలాంటి నేషనల్ లెవల్ గేమ్స్ కాంపిటేషన్స్ మరెన్నో జరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో నలుమూలల క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. ఏసీఏ తరపున మంగళగిరి క్రికెట్ స్టేడియంతో పాటు, ఇంకొన్ని స్టేడియాల్లో అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా బాడీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించటంలో సీఎం చంద్రబాబు ముందుంటారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. బ్యాడ్మింటన్ అంటే తెలుగు వారు అనే గుర్తింపు రావటానికి కారణం సీఎం చంద్రబాబు నాయుడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విజయవాడలో డిసెంబర్ 22 నుంచి 28 వరకు యోనెక్స్ సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ జరుగుతుందని శాప్ చైర్మన్ రవినాయుడు వివరించారు.

# సంగీతం సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదం

### విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నజీర్




కృష్ణవేణి సంగీత నీరాజనం ముగింపు కార్యక్రమంలో గవర్నర్ నజీర్‌ను సత్కరిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సంగీతం మనోవికాసానికి దోహదం చేస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. మానవీయ సంబంధాలను బలపరుస్తుందన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల, ప్రకృతిలో మనతో పాటు ఇతర భాగస్వాములపై మక్కువ పెంచుతుంది. భారతీయ సంగీతం విశ్వవిఖ్యాతమన్నారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీతాలు ప్రపంచం దృష్టినికి ఆకర్షించాయన్నారు. శ్రమజీవుల్లో నూతన ఉత్తేజాన్ని సంగీతం కలిగిస్తుందన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం జరిగిన రెండురోజుల కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమ ముగింపు సభలో రాష్ట్ర గవర్నర్ గౌరవ సయ్యద్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న సంస్కృతులకు, అభిరుచులకు ప్రతీకగా నిలిచే సంగీత సమ్మేళనం విజయవాడలో జరగడం అభినందనీయ మన్నారు. కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే మాట్లా డుతూ రెండు రోజులపాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతోమంది ప్రముఖ కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలకు ప్రజల నుంచి ఎంతో సహకారం లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఐదు ఈవెంట్‌లను నిర్వహించగా అందులో మైసూర్‌లో రెండు, విజయవాడలో జరుగుతున్న ఈ కార్యక్రమం మూడవది అన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సంగీత నాటక అకాడమీ, స్థానిక సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. గత సంవత్సరంలో సుమారు ఒక కోటిమంది విదేశీయులు భారతదేశాన్ని సందర్శించటం వల్ల 2.93లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కృష్ణవేణి సంగీత నిరంజనం కార్యక్ర మానికి కేరళ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుండి కళాకారులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారన్నారు. కేంద్ర పర్యాటక శాఖ సంచాలకులు (సౌత్) ఆర్. వెంకటేశన్ మాట్లాడుతూ కృష్ణవేణి సంగీత నిరంజనం యొక్క మూడవ ఎడిషన్ ముగింపు కార్యక్ర మానికి స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో టూరిజం శాఖ నిబద్ధతను ప్రతిబింబించడమే కాక, మన సాంప్రదాయ సంస్కృతి విలువను గుర్తించడానికి కళాకారులు, సంస్థలు మరియు యువతను కూడా ప్రోత్సహిస్తుందన్నారు. జాతీయ సాంస్కృతిక మైలురాయిగా దీని గుర్తింపును బలోపేతంచేసింది. పవిత్రమైన కృష్ణా నది, కనకదుర్గాదేవి దివ్య ఉనికితో ఆశీర్వదించబడిన విజయవాడ నగరం కేవలం ఈ ఉత్సవానికి ఆతిథ్యం ఇవ్వ డమే కాదు, ఇది ఈ నగరానికి గుండె చప్పుడు అని అన్నారు. ఈ నగర చరిత్ర, ఆధ్యాత్మికత, శక్తి, కళాత్మక వారసత్వం ఇలాంటి ఉత్సవాల వేడుకకు పరిపూర్ణ కేంద్రంగా మార్చాయన్నారు. సంగీతం, నృత్యం, కథాకథనం, హస్తకళలు ఇవన్నీ సంస్కృతి యొక్క జీవన స్వరాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా, సంగీత ఉత్సవాలు గమ్యస్థాన బ్రాం డింగ్, పర్యాటక అభివృద్ధిలో ఒక పరివర్తనాత్మక పాత్ర పోషిస్తాయని, జీవనోపాధిని సృష్టించి, సాంస్కృతికజ్ఞాపకశక్తిని రూపొందిస్తా యన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇల క్కియ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం పర్యాట కంగా ఎంతో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గవర్నర్ గౌరవ సయ్యద్ అబ్దుల్ నజీర్ రావడం దీనికి మరింత గుర్తింపును ఇస్తుందన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద నామస్మరణలతో ఆపదమొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలిస్తున్నారు. ఆదివారం ఉదయం ఎన్ఆర్ఐ భక్తుడు శివప్రసాద్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు10,01,116 రూపాయలు విరాళాల డిడిని ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. దాతతోబాటు ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమలరావు, టిటిడి బోర్డు సభ్యుడు సదాశివరావు పాల్గొన్నారు.

## అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలి: మాజీమంత్రి పేర్నినాని



**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాచీన కాలం నుండి పదకవితాపితామహుడు తాళ్ళపాక అన్నమయ్యనడచి తిరుమలకు వచ్చిన అన్నమయ్య మార్గాన్ని మూసివేయడం మంచిదికాదని, భక్తుల మనోభావాలతో ముడిపడిన విషయమని మాజీమంత్రి ,వైసిపి నేత పేర్నినాని అన్నారు. ఎందరో మహానుభావులు నడచివచ్చిన మార్గంలో ఇప్పటికీ భక్తులు భక్తితో, పవిత్రంగా కాలినడకన తిరుమలకు వస్తున్నారన్నారు. కోడూరు, కుక్కలదొడ్డి నుండి వుండే ఈ అటవీప్రాంతంలోని అన్నమయ్య కాలిబాటను టిటిడి అధికారులు అభివృద్ధిచేసి, భక్తులకుఅసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన పేర్నినాని కుటుంబసభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో అనుభూతి



**తిరుమల,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఏపి ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేర్వేరుగా ఆదివారం ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్ర సాదాలు అందజేశారు. అన్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు



**తిరుమల,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని దేవుని ప్రార్థించినట్లు రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికా రులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నాం




**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం ఆర్టీసి ఎండి సిహెచ్ ద్వారకాతిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శిం చుకోవడం సంతోషమని తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. శ్రీవారి ఆశీ స్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిం చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శ నం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.


## 'గోవిందకోటి'పై మరింత విస్తృత ప్రచారం

### కోటినామాలు రాస్తే విఐపి బ్రేక్ దర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధర్మాన్ని చిన్నతనంనుండే యువతలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెంపొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. రామకోటి తరహాలో 25ఏళ్ళలోపు యువత "గోవిందకోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు కూడా మంచినిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని అమలుచేస్తూ అప్పట్లోనే టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత 2024 మేలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టిటిడి నూతన ట్రస్టుబోర్డు ఏర్పాటుతో కొద్దిరోజులు ఈ విషయంపై తర్జనభర్జనలు పడ్డారు. చివరకు హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి" రాయడం వల్ల యువతలో భక్తిభావం పెంపొందింపజేసేందుకు అవకాశం కల్పించేలా ఉంటుందని భావించారు. 25ఏళ్ళ లోపు యువత "గోవిందకోటి"రాస్తే వారి కుటుంబస భ్యు లకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. 10,01,116 సార్లు గోవిందనామాలు రాసిన భక్తు లకుస్వామి వారి దర్శనం కల్పించేలా చూస్తున్నారు.





## ఘాట్‌లో హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించండి

### టిటిడికి ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి

**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనదారులైన టిటిడి ఉద్యోగులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, అన్నదానం డిప్యూటీ ఇఒ రాజేంద్ర ఇతరులను కలసి ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మీ సూచనలు అవసరమనికోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ ఇఒలు ఉద్యోగులు, సిబ్బందికి సూచనలు చేస్తామని తెలిపారు.

## లైంగిక వేధింపు కేసులో జోక్యం చేసుకోండి

### కేంద్ర ప్రభుత్వానికి వైఎస్సార్సీ ఎంపీ గురుమూర్తి లేఖ

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్ దారుణ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తిరుపతి ఎంపీ ఎం. గురుమూర్తి ఆరోపించారు. ఇంకా బ్లాక్ మెయిల్ కూడా చేస్తున్నారని, అదే విషయాన్ని ఆమె లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేసిందని వెల్లడించారు.

అత్యంత దారుణమైన ఈ కేసులో వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఆయన, కేంద్ర విద్యా శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు, జాతీయ మహిళా కమిషన్, జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్, జాతీయ మానవ హక్కుల సంఘానికి లేఖలు రాశారు.

వార్త

మీరు నిజాయితీగా ఉండండి. ఈ ప్రపంచంలోని జనాభా నుంచి ఒక దుర్మార్గుడి సంఖ్య తగ్గిందన్న భావన మీకు కలుగుతుంది.

-థామస్ కార్లయిల్


# వ్యవస్థపై అవగాహన తప్పనిసరి!

**గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సూపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు,విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను, నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం, పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి.**

బైరబోయిన వెంకటేశ్వర్లు

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సమరం ఊపందుకుంది. ఐనవారి మధ్య జరిగే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇటీవల పంచాయితీ ఎన్నికల్లో లక్షలు వెచ్చించి వేలం వేసి ఏకగ్రీవం అవడం, అమెరికా నుండి వచ్చి సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడం, ఒకే పంచాయితీలో తల్లి బిడ్డలు, అన్న చెల్లెలు, అత్త, కోడళ్లు పోటీ పడడం, పదవీకాలంలో ఎక్కువ ఆస్తులు సంపాదించినట్లైతే అవి పంచాయితీకే అని బాండ్ పేపర్ రాయడం, ఉన్నత ఉద్యోగాలకు రాజీనామా చేసి పంచాయితీ పోటీల్లో పాల్గొనడం వంటి సంఘటనలు చూస్తున్నాం. పదవిమీద వ్యామొహమో, రాజకీయ రంగంలో తొలిఅడుగులు వేయాలనే ఆసక్తేమో కానీ పంచాయితీ ఎన్నికల పరంపర రసవత్తరంగా సాగుతుంది. కానీ అభ్యర్థులు పోటీపడడమే కాకుండా పంచాయితీరాజ్ వ్యవస్థపై, విధులు, నిధులపై సమగ్ర అవగాహన ఉంటేనే గెలిచాక పాలన సుగమం అవుతుందనేది గమనించాలి. అలాగే అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ప్రజలకు కూడా పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సూపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను,నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం,పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి. కేంద్రం గ్రామ పంచాయతీలకు పథకాల ద్వారా జమ అయిన ఖర్చులలో పారదర్శక ప్రదర్శించడా నికి ప్రవేశపెట్టిన ఇ గ్రామ్ స్వరాజ్ పోర్టల్, మేరి పంచ యాత్ యాప్‌లపై ప్రజల్లో

గ్రామ పంచాయితీ నిధుల విషయానికొస్తే గ్రామపంచాయితీలకు నిధులు ప్రధానంగా గ్రామ పంచాయితీ పన్నుల, ఇతర భవనాలు, మార్కెట్ యార్డు, సంతలు అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే స్వీయ ఆదాయం. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులనుండి వస్తాయి. 15వ ఆర్థిక సంఘం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2021-22నుండి 2025-26 వరకు ప్రతి సంవత్సరం రెండు విడుతలుగా (మొదటి విడుత జూన్‌లో, రెండవ విడత అక్టోబర్‌లో) పంచాయితీలకు నిధులను విడుదల చేస్తుంది. వీటిలో 85 శాతం గ్రామాలకు,10 శాతం మండల పంచాయితీలకు,5



శాతం జిల్లా పంచాయితీలకు వాడుకుంటారు. అందులో జీతభత్యాలు గాక 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాల నిర్వహణకు అన్ టైడ్ ఫండ్ రూపంలో అందితే, అత్యవసర అవసరాలకు త్రాగునీటి సరఫరాకు, పారిశుధ్య నిర్వహణకు టైడ్‌ఫండ్ రూపంలో విడుదల చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం15వ ఆర్థిక సంఘం 2021-22నుండి 2025-26 కాలానికి 7201 కోట్లను తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తే అందులో ఈ ఆర్థిక సంవత్సరానికి 2025-26కుగాను 1477కోట్లుగా కేటాయించింది. రాష్ట్రప్రభుత్వం వార్షిక బడ్జెట్లో నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు అవసరాలకనుగుణంగా విడుదల చేస్తుంది. వీటితో పాటు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ జీవన మిషన్, మహాత్మ గాంధీ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్, నేషనల్ హెల్త్ మిషన్, ప్రధాన మంత్రి గ్రామీణ్ అవాస్ యోజన వంటి పథకాలతో కొన్ని నిధులు అందుతున్నాయి. భారత ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ, జాతీయ పంచాయితీ అవార్డులను ఉత్తమ గ్రామాలకు ప్రతి సంవత్సరం ప్రధానం చేస్తుంది.ఇది సూచించిన ముఖ్యమైన అంశాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే గ్రామపంచాయితీలకు ర్యాంకింగ్ ఇస్తుంది. ఇందులో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవన విధానం, ఆరోగ్యకర గ్రామ పంచాయితీ , పిల్లల హక్కులు, విద్య, వైద్యం మహిళల రక్షణ, సాధికారత, త్రాగునీటి పారిశుధ్య నిర్వహణ, స్థిరమైన మౌలిక సదుపాయాలు కల్పన, గ్రామ పంచాయితీల సామాజిక సురక్షిత, ప్రజలకు అందించే సుపరిపాలన అనే 9 అంశాలను ప్రామాణికంగా తీసుకుంటూ మెరుగైన ప్రగతిని సాధించిన గ్రామ పంచాయతీలకు జాతీయ పంచాయతీ అవార్డులను ఇస్తారు. పైన పేర్కొన్న అంశాలలో ప్రతి అంశంలో ప్రథమ స్థానంలో నిలిచిన 3 గ్రామ పంచాయతీలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్స తత్ వికాస్ పురస్కార్ను అందిస్తుంది. పై 9 అంశాలలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన 3 గ్రామ పంచాయితీలకు, 3 మండల పంచాయితీలకు,3 జిల్లా పంచాయితీలకు నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌ను అందిస్తుంది. ఇవేకాక కొన్ని ప్రత్యేక విభాగాలలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి వాడకం, ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ పునరుత్పాదక ఇంధన వనరులను వాడి గ్రామాన్ని కర్బన రహితంగా చేయడంలో కృషి చేసిన గ్రామాలకు క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డు, సొంత వనరులతో గ్రామ ఆదాయాన్ని పెంచే గ్రామ పంచాయితీలకు ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో సంస్థాగత సహకారం అందించే గ్రామ పంచాయితీలకు గ్రామ్ పంచాయత్ క్షమతా నిర్మాన్ సర్వోత్తమ్ సంతాన్ పురస్కార్ అవార్డులు ప్రతి సంవత్సరం జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం రోజున ప్రధాన చేస్తారు. 2025 సంవత్సరం జాతీయ ప్రత్యేక అవార్డుల విభాగంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలం 'మల్' గ్రామపంచాయతీ 67 లక్షలు వారాంతం జరిగే పశువుల సంత నిర్వహణ ద్వారా,3.75లక్షలు షాపింగ్‌కాంప్లెక్స్ అద్దెల ద్వారా, విద్యుదీకరణ, పారిశుధ్య పన్నుల ద్వారా మొత్తంగా 3200 జనాభాకు తలసరి ఆదాయంగా సుమారు 2954 రూపాయలు స్వీయ ఆదాయాన్ని సమకూర్చి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తూ ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు 2025కు ఎంపికైంది. ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో గెలుపు కోసం పోటీ పడిన్నట్టుగానే గెలిచిన తరువాత తమ పంచాయితీలను ఉత్తమంగా తీర్చిదిద్ది దేశంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంలో పోటీ పడాలి. ప్రజలు కూడా డబ్బు, మందు వంటి తాత్కాలిక ప్రయోజనాలకు ఆకర్షణ కాకుండా ఐదు సంవత్సరాలు గ్రామ భవిష్యత్తుకు విధులు సక్రమంగా నిర్వర్తించే, నిధులను సమర్థంగా ఉపయోగించే, గ్రామ సమస్యలపై పోరాడే అర్హత గల నాయకత్వాన్ని ఎన్నుకోవాలనే ఆలోచన చేయాలి. అప్పుడే దేశానికి సంపూర్ణ గ్రామీణ స్వరాజ్యం దక్కుతుంది. •

# పొగాకుకు కళ్లెం

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికైనా, భయంకరమైన అనారోగ్యకర అలవాట్లను అదుపులో పెట్టేందుకైనా పన్నులు భారమో, జరిమానాల విధింపులతోనో కళ్లెం వేయడం సాధ్యమౌతుందని నమ్ముతుంటాం. ఎటూ కక్కలేక మింగలేక అలవాట్లకు దూరంగా ఉంటారని భావిస్తుంటాము. నిన్న మొన్నటి వరకు ఒక పక్క పొగాకు త్రాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదంటూనే, పొగాకును విరివిగా పండించే ప్రాంతాల్లోని రైతుల ఉత్పత్తుల రవాణాకు అన్ని సౌకర్యాలను సమకూర్చిపెట్టడం ప్రభుత్వాలకు ఆనవాయితీగా మారింది. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో దేశంలో కేన్సర్,గుండె, ఊపిరితిత్తుల రోగాల కారణంగా ఏటా 1.35 మిలియన్ మంది మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పొగాకు పండించే రైతులను ప్రత్యేకించి నిరుత్సాహపరచకుండా, అలాఅని ప్రత్యేక ప్రోత్సాహకాలు లేకుండా రైతులు వారంతటవారే ఇతర పంటలకు మారేపరిస్థితి తీసుకురావాలన్నది ప్రభుత్వఆలోచన. ఇలా పొగాకు సాగులో ప్రభుత్వాలు ఎటూ పాలుపోని పరిస్థితులో సతమతమౌతుంటాయి. ఆ నేపథ్యమే 2018 నుంచి 2022 మధ్య 112లక్షల ఎకరాలకుపైగాభూమిలో పొగాకు సాగు నుండి రైతులు ఇతర పంటలకు మారేలా చేసింది. అందులో భాగంగానే కర్ర విరగకుండా, పాము చావకుండా అన్న ధోరణిలో ప్రభుత్వం పన్ను విధానాల రూపకల్పన చేస్తూ వస్తోంది. కారణాలు ఏవైనా ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రజల అనారోగ్యానికి హేతువయ్యే పొగాకు ఉత్పత్తులు పెరగకుండా చూడగలుగుతోంది. దేశంలో పొగాకుపై 60 లక్షల మంది రైతులు రెండు కోట్ల మంది కూలీలు ఆధారపడుతుంటారు. కానీ తాజాగా కేంద్రప్రభుత్వం పొగాకు సంబంధిత ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధిస్తూ సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2020-25ను మూజువాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదించింది. సిగరెట్లు, చుట్టలు,హుక్కా, జర్దా నమిలే పొగాకుపై ప్రస్తుతమున్న జిఎస్టీ 28 శాతంతో పాటు పలు విధాలైన సెస్సు ఉంది. ముడి పొగాకుపై 60-70 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించేందుకు రంగం సిద్ధమైంది. ఈ సెస్సు సిగరెట్లు, చుట్టలపై 25 శాతం వరకు ఉంటుంది. కాదంటే ప్రతి వెయ్యి చుట్టలకు రూ. 5వేలు చొప్పున డ్యూటీ చెల్లించాలి. ఫిల్టర్ సిగరెట్లకు ప్రతి వెయ్యికి రూ.2700 నుంచి 11వేల వరకు సుంకం విధించమన్నారు. నమిలే పొగాకుకు మాత్రం కిలోకి 100 రూపాయలుగా నిర్ణయించారు. పరిహార సెస్సుకు ఈ పెంచిన సుంకాలకూ ముడిపెట్టారు.పరిహార సెస్సు పూర్తయ్యాకనే కొత్త సెస్సు మొదలవుతుంది. కోవిడ్ సమయంలో తగ్గిపోయిన ఆదాయ భర్తీకి రాష్ట్రాలు తీసుకున్న రుణాలు తీరిపోయాక పరిహార సెస్సుకు బదులుగా కొత్త విధానంలో సెస్సు వసూలు తప్పదు.తమకు వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని రాష్ట్రాలతో పంచుకుంటామని లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన వివరణ ఇది. గరిష్టంగా 40 శాతం చొప్పున జిఎస్టీ విధానం కొనసాగుతుంది. పొగాకు మీద హెచ్చుపన్నుల ద్వారా పొగాకు వాడకం తగ్గించగలిగితే ఒక విధంగా మంచిదే. పరిహార సెస్సు కాలపరిమితి పూర్తయినందున కొత్త సెస్సులు వడ్డించారా? లేదా పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గించడం ద్వారా జనానికి ఆరోగ్యకర అలవాట్లు వస్తాయని పొగ తాగకుండా చూడాలన్న దృక్పథంతోనే మరో రూపంలో ఈ సెస్సును భర్తీ చేశారన్నది సుస్పష్టం. ఏదిఏమైనా పొగాకు విరివిగా పండించే ప్రాంతాల్లోని లోక్‌సభ సభ్యులు పన్నుల్లో మార్పులు చేసేటప్పుడు రైతుల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. అదే సమయంలో ప్రజారోగ్యం కోసం తీసుకునే నిర్ణయాలను రైతులు సుముఖత వ్యక్తం చేశారని భరోసా ఇవ్వడం విశేషం. పొగాకు సాగును పూర్తిగా రద్దు చేయలేని పరిస్థితుల్లో తగ్గించడానికే ప్రభుత్వాలు కృషి చేస్తుంటాయి. తాజాగా వేసిన సుంకంకూడా ఆ కోవలోకే వస్తుంది. దాంతో ఇక ఆ పన్ను వసూలు చేయాల్సిన ఆవశ్యకత కేంద్రానికి లేకపోయింది.అలా అని ఆ పన్ను వసూలు ఆపేస్తే పొగాకు ఉత్పత్తుల ధరలు బాగా తగ్గిపోతాయి. ఇలాంటి పరిస్థితులు సదరు పన్ను తగ్గితే పొగాకు ఉత్పత్తుల అధిక వినియోగానికి దారి తీస్తుంది. ఒకపక్క పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరం అంటూనే ఆ ఉత్పత్తులకు ధర తగ్గే పరిస్థితి కల్పిస్తే వినియోగదారుల సంఖ్య పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలోనే తగ్గిన సుంకాన్ని మరో రూపంలో పెంచేందుకు కేంద్రం ఉపక్రమించింది. ఇది సెస్సుకాదని, కేవలం ఎక్సైజ్ సుంకమేనని అది కూడా పొగాకు ఉత్పత్తుల ధరల పెంపు వలన వినియోగం ఎప్పటిలానే ఉంటుందని ఆర్థిక మంత్రి అభిప్రాయం. అందుకే ఈ ప్రతిపాదన జరిగింది. ఒకపక్క పొగాకు రైతుకు ప్రోత్సాహం మరోపక్క వినియోగదారుని ఆరోగ్యరక్షణ వీటి విషయంలో సమతుల్యత పాటించడానికే ఈ పన్ను విధానం నిర్ణయింపబడింది.కొత్తగా వేసిన పన్ను బీడీల ధరను పెంచుతుంది. దానివలన వినియోగం తగ్గి పరోక్షంగా దేశంలోని లక్షలాది మంది బీడీ కార్మికులు ఉపాధి కోల్పోతారని ఎంపీలు ఆవేదన వెలిబుచ్చారు. జాతీయ వ్యవసాయ అభివృద్ధి పథకం కింద పంట వైవిధ్యకరణ కార్యక్రమం కింద 2015 నుండి దేశంలోని పది రాష్ట్రాలు పొగాకు పండించి ఉత్పత్తి చేస్తున్నాయి. పాన్ మసాలా తయారీ యూనిట్‌లపై కూడా సెస్ విధించారు. ఈ విధంగా వసూలు అయ్యే మొత్తం జాతీయ భద్రత కోసమే వినియోగించేందుకు నిర్ణయం.

> సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.
>
> సిసి కోల్టన్



> ఇతరులకు సంతోషాన్ని కలిగించకుండా సంతోషాన్ని పొందే అధికారం, ధనాన్ని ఉత్పత్తి చేయకుండా ధనాన్ని వాడుకునే అధికారం మనకు లేవు.
>
> జార్జిబెర్నార్డ్ షా



# ప్రజావాక్కు



### పదో తరగతి పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు మార్చి 16నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేశారు. ఆ ప్రాప్తి మేరకు ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు, ప్రణాళిక బద్ధంగా పాఠాలు చెప్పడంపరీక్షలు నిర్వహించడం జరపనున్నారు. పాఠశాల పని దినాల్లో పదవ తరగతి టైం టేబుల్ ఈ 100 రోజులు ప్రణాళికల్లో కంప్లీట్‌గా మార్చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గంటా 50 నిమిషాలు ఒక సబ్జెక్టు చొప్పున నాలుగు సబ్జెక్టులు ఒక రోజులో జరుగుతాయి. మిగతా మూడు సబ్జెక్టులు ఆ రోజులో ఉండవు. అన్ని సబ్జెక్టులు ప్రతిరోజు ప్రతి విద్యార్థి చదవడం జరగడం లేదు. మిగతా తరగతులు అయిన 6 నుండి 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు టైం టేబుల్ అస్తవ్యస్తం అవుతుంది.

- వీరగంట భాస్కర్ రావు, విజయవాడ

### మరీ ఇంత దిగజారిపోవాలా!

రోడ్డు మీదపోతున్న వ్యక్తి ఒకడు ఆహారం కోసం చెత్తకుప్పదగ్గరకు వెళ్తున్న కుక్కను చూసి జాలిపడతాడు దాని ముందు ఓ రొట్టె ముక్కను పడేస్తాడు. మరుక్షణం ఎక్కడి నుంచో మూడు నాలుగు కుక్కలు పరిగెత్తుకువసాయి. ఆ రొట్టె ముక్క కోసం ఎగబడతాయి. దాని కోసం నోటి వాటి మధ్యకొట్లాట మొదలవుతుంది. చివరకి వాటిలో ఉన్న ఒక బలమైన కుక్క ఆ రొట్టె ముక్కను నోట కరుచుకుని పోతుంది. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలసందర్భంలో మూడుపార్టీల వారుఇలానే ప్రవర్తించారు. ఉన్న ఒక్క సీటుకోసం విశ్వప్రయత్నం చేశారు.

- రాశి, హైదరాబాద్

### ఓటు చాలా విలువైనది

బిఆర్ఎస్ కారు రెండు సంవత్సరాల నుంచి బయటకి రాక మూలనపడి ఉంది. దాని భాగాలన్నీ తుప్పుపట్టిపోయాయి. ఆ కారు ఇప్పట్లో ఇక ముందుకు కదలదు. అలాంటి కారుకి ఓటు వేస్తే అభివృద్ధి ముందుకి కదలదు. వేసిన ఓటు వేస్ట్ అయిపోతుంది. కనుక ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేయాలి.

-మిథునం, హైదరాబాద్

### క్వాంటి టెక్ ప్రపంచానికి నూతన ద్వారం

హైదరాబాద్‌ను క్వాంటమ్ సిటీగా అభివృద్ధి చేసి ప్రపంచ నాయకత్వం వైపు నడిపించాలన్న ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సంకల్పంతెలంగాణ టెక్నాలజీ రంగానికి కొత్త ఊపును తెస్తోంది. ప్రపంచం క్వాంటమ్ కంప్యూటింగ్, అగ్రశ్రేణి సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రాసెసింగ్ వంటి అధునాతన రంగాల్లో విప్లవాత్మక మార్పులను చూస్తున్న ఈ సమయంలో, హైదరాబాదును ఆ దిశగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దృష్టి ఎంతో దూరదృష్టి కలిగిన నిర్ణయం. ఇప్పటికే హైటెక్ సిటీ, బయోటెక్ పార్కులు, స్టార్టప్ కేంద్రాలతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్, అత్యాధునిక పరిశోధనలకు అనువైన మౌలిక వసతులు, నైపుణ్యంకలిగిన మానవ వనరులు కలిగిన నగరం. ఈ నేపథ్యంలో క్వాంటమ్ టెక్నాలజీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు, ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యాలు,పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడం కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రాష్ట్ర గీతంగా ఆమోదించాలి

తెలంగాణా రాష్ట్రం అందెశ్రీ అందించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ఆమోదించి అమలు పరచింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఒక గీతాన్ని ఓ మంచి కవి చేత రాయించాలి లేదా దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అనేక దేశభక్తి గీతాలు రాసారు. అందులో ఒక దానిని రాష్ట్రానికి అనుకూలంగా ఉండేలా చిన్న చిన్న మార్పులు చేర్పులు చేసి గీతాన్ని శ్రీ చాగంటి కోటేశ్వర రావుగారికి గాని లేక గరికిపాటి వారికి గాని చూపించి అవుననిపిస్తే బాగుంటుంది. రాష్ట్రప్రభుత్వంఆలోచన చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వృద్ధ నేతలు తప్పుకోవాలి

అపారమైన తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు గల యువత మన దేశంలో ఎంతో మంది ఉన్నారని వీరంతా రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్రపోషించాలని అత్యున్నత పదవులను అధిష్టించాలని మాటల్లోను ఉపన్యాసాల్లోను సెలవిస్తున్నారే కానీ చేతలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయి. ఎవరి వయసుకి తగిన పనులు వారు చేస్తేనే బాగుంటుంది. యువతకు కూడాఅవకాశం కల్పించేలా వృద్ధనేతలు ఆలోచించాలి. యువతను ప్రోత్సహించేలా ఉపన్యాసాలు ఇవ్వాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పిల్లలపై సాంకేతిక ఉపకరణాల ప్రభావం

డాక్టర్ వి.వి.ఎస్.వి నరసింహం

మా నవ జన్మను ప్రసాదించిన తల్లిదండ్రులు నిత్యంపూజ్యనీయులు. ప్రతీ వ్యక్తికి తల్లిదండ్రులే దైవ స్వరూపాలు. మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ మన ప్రగతికి పరితపిస్తూ, అవిశ్రాంతంగా పనిచేస్తుంటారు. మన అభ్యున్నతి కోసం వారు తమ సమయాన్ని, శ్రమను ధారపోస్తారు. పిల్లలు సంతోషం కోసం ఎన్నో త్యాగాలు చేయడం వారికి పరిపాటి. వారు కోరుకునేది కేవలం మన అభ్యున్నతి మాత్రమే. ప్రతీ వ్యక్తి ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. నేటి తరం సాంకేతికంగా ముందుకెళుతోంది. అదే సమయంలో మారుతున్న సమాజ పోకడలు, సాంకేతిక విస్తృతి పెను సవాళ్లను విసురుతోంది. నిర్మల మనస్సుతో సమాజంలోకి అడుగుపెడుతున్న బుడతలు తమకు తెలియకుండానే విషవలయంలో చిక్కుకుంటున్నారు. మంచి, చెడులను తెలుసుకునే వయస్సులోనే చెడువైపు ఆకర్షితులైపోతున్నారు. కుటుంబాలు చిక్కిపోవడం, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు కూడా దీనికి కారణంగా మారుతున్నాయి. వారు తగినంత సమయం చిన్నారులకు కేటాయించలేని పరిస్థితులు, వృత్తిపరమైన ఇబ్బందులు వారిని కొంత సంకట స్థితిలోకి నెట్టేస్తున్నాయి. అదే సమయంలో చిన్నారులు టెలివిజన్‌లు, సెల్‌ఫోన్‌లకు అలవాటు పడి, మెల్లగా బానిసలుగా మారిపోతున్నారు. ఆట పాటలకు స్థలం లేకపోవడం, స్నేహితుల సంఖ్య తగ్గిపోవడంతో వీరు తమకు తెలియకుండానే ఎలక్ట్రానిక్ వస్తువుల వలయంలో చిక్కిపోతున్నారు. అదే సమయంలో ఇంటర్నెట్ వినియోగం పెరగడం, ప్రతీ ఇంటిలో స్మార్ట్ ఉపకరణాలు పెరగడం కొంత మేలు చేస్తున్నా తెలియకుండానే ఎంతో విషాన్ని చిన్నారులలో నింపేస్తున్నాయి. కుటుంబంతో సంబంధం లేనంతగా చిన్నారులు వీడియో గేమ్‌లకు అలవాటు పడటం ఇటీవల అధికంగా కనిపిస్తోంది. ఇటువంటి వ్యక్తులలో మానవ సంబంధాలు పూర్తిగా మందగించడం, వివరీత ధోరణులు, క్రోధ ప్రవృత్తి పెరిగిపోతున్నాయి. మరొకవైపు చిన్నారులు తమకు తెలియకుండానే తమ వయసుకు మించిన, చూడకూడని అంశాల



ను చూడటం, తెలుసుకోవడం జరుగుతోంది. వీటిలో వారి ప్రమేయం లేకుండానే సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వీడియోలు, రీల్స్‌రూపంలో వారిని ఈ విష ప్రపంచంలోకి లాగేస్తున్నాయి. నెమ్మదిగా ఆవి తమ కంటెట్ డోస్‌ని పెంచుతూ వారిని పూర్తిగా వీటికి బానిసలుగా మార్చుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లో తాము చూసిన విషయాలు బయట చేయాలనే తపన, ఆలోచనలు చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీరు ప్రపంచాన్ని పూర్తిగా తెలుసుకునే సమయంలో వారు తెలియకుండా చెడు మార్గంలోఅడుగులు వేగంగా వేసేస్తున్నారు. వీరిని నిరంతరం గమనించి, మార్గ నిర్దేశం చేయాల్సిన తల్లిదండ్రులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నావెనక్కి తీసుకురాలేని నష్టం నేటితరం చిన్నారుల విషయంలో జరిగిపోతోంది. ప్రాథమిక పాఠశాలస్థాయి విద్యార్థులలో సైతం ఇటీవల ఇటువంటి అడల్ట్ కంటెట్‌కి సంబంధించిన అంశాలను వీక్షించడం, తరచూ వాటిని చూడటం పరిపాటిగా మారిపోతోంది. ఇదివారి మానసిక పరిస్థితిని ప్రభావితం చేయడం, విద్యలో దృష్టి సారించలేక పోవడం వంటి విపరీత చర్యలకు కారణంగా మారిపోతోంది. చిన్నారులను నిరంతరం గమనిస్తూ వారి సమస్యలను వింటూ, వారికి సూచనలు అందించే పెద్దతరం ఎంతోఅవసరం. అటువంటి పెద్ద తరం మన ఇంటిలో లేనప్పుడు తల్లతండ్రులే తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా నడచుకోవాలి. భార్యభర్తలిద్దరూ నిత్యం తమపిల్లలతో కొంత సమయంగడపడం, వారి ఆలోచనలు,ఆకాంక్షలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అదే సమయంలో వారు చెడు ఆలోచనలు, ధోరణులదిశగా అడుగులు వేయకుండావారికి సున్నితంగా మార్గ నిర్దేశం చేయాలి. అప్పటికే వారు చెడుమార్గంలో అడుగులు వేసినా పెద్ద మనసుతో అర్థంచేసుకుని, వారిని సక్రమ మార్గంలో నడిపించాలి.చిన్నారులు సైతం ఒక చిన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పగలిగే పనులను మాత్రమే వారుచేయాలి. తల్లిదండ్రులకు చెప్పుకోలేని పనులు ఎప్పుడూ వారుచేయరాదు. ఏదైనా పని చేయాలనిపిస్తే ముందుగా తల్లిదండ్రులకు ఆ విషయంచెప్పి వారి సలహా, సూచనలు తీసుకోవాలి. అప్పుడు ఎటువంటి నష్టం జరగదు. ఏం జరుగుతుందిలే అనే నిర్లక్ష్య ధోరణితో తల్లిదండ్రులకు చెప్పకుండా పరిపక్వత లేని వయసులో మనసు కు నచ్చినది చేసేద్దామని అడుగేస్తే...భవిష్యత్తును చేజేతులా అంధకారంలో నెట్టేసినట్టే. •

# ప్రైవేటు టీచర్ల బాధలు పట్టించుకోరా?

గోరంట్ల శివరామకృష్ణ

గురువును దైవంగా భావించే సమాజం మనది. విద్యార్థులకు అక్షర భిక్షను పెట్టి వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా మలచే పవిత్రమైన ఉపాధ్యాయులంటే అందుకే అందరికీ ఎనలేని గౌరవం. తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల కంటే 38శాతం ఎక్కువటీచర్లు ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్నారు.అనధికారిక లెక్కల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో సుమారు 3లక్షలమంది పైగా ప్రైవేట్ టీచర్లు ఉన్నట్లు తెలుస్తోంది.వీరిలో 60శాతంమంది కనీస ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలకు నోచుకోకుండా బతుకు బండిని నెట్టుకొస్తున్నారంటే నమ్మాల్సిందే. టీచర్ గ్రాడ్యుయేట్ ఎన్నికలు తప్ప మిగిలిన ఏ సందర్భంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, ఏపీ, తెలంగాణలోని ప్రస్తుత ప్రభుత్వాలైనా తమ సమస్యల మీద దృష్టి పెట్టాలని వారంతా కోరుతున్నారు. వినటానికి కాస్త ఇబ్బందిగా ఉన్నా ప్రైవేటు టీచర్ల జీవితాలు ఈ రోజు వెట్టిచాకిరి బానిసలకంటే దౌర్భాగ్యంగా ఉన్నాయి. గత పదేళ్లలో ప్రైవేటు స్కూళ్ల మీద రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టు కోల్పోయింది. వీధికొక స్కూలు వస్తున్నా, వాటిలో అనుమతులున్నవెన్నో తెలియని పరిస్థితి. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేసే ఈ స్కూళ్లలో రోజంతా నిలబడి పనిచేసే గొంతుపోయేలా పాఠాలు చెప్పే టీచర్లలో సగం మందికి ఉపాధి హామీ కూలీకి దక్కే వేతనం దక్కటం లేదు. వీరిలో చాలామంది ఏళ్ల తరబడి టీచరు నోటిఫికేషన్లు లేక, వయసు దాటిపోయి, సమీపంలోని ప్రైవేటు స్కూల్స్‌లో పని చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారు కొందరైతే.. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవంతో రాజీపడుతూ బతికేవారు మరికొందరు. ప్రైవేటు స్కూళ్లలో టీచర్లకు మార్చి నెల వచ్చిందంటే నరకం గుర్తుకు వస్తుంది. స్కూలు సమయం తర్వాత వీరు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఒప్పించి, అడ్మిషన్లు చేయించాలి. మేనేజ్‌మెంట్ వారు చెప్పినన్ని అడ్మిషన్లు చేయని టీచర్లకు వచ్చే ఏడాది ఉద్యోగం లేనట్లే. ఎలాగూ ఏప్రిల్, మే వేతనాలు ఇవ్వరు గనుక.. మరో మార్గం లేక టీచర్లు ఇంటింటికీ తిరగాల్సి వస్తోంది. ఒంటిపూట బడుల రోజుల్లో ఎర్రటి ఎండల్లో వీరిని అడ్మిషన్ల కోసం పంపే మేనేజ్‌మెంట్లు వీరి వేతన పెంపుదగ్గరకు వచ్చేసరికి



మీ తరగతిలో పిల్లలకు మంచి మార్కులు రాలేదు అంటూ గొణగటం మామూలే. మన సమాజంలో ఏ సంఘం లేకుండా.. ఎవరికి వారే అన్నట్లు పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ఉన్నారంటే అది ప్రైవేటు టీచర్లే. కాబట్టి తమ సమస్యలపై వీరు కలిసి కట్టుగా పోరాటం చేయలేకపోతున్నారు. ప్రయివేటు టీచర్స్ ఎవరైనా సంఘం పెట్టినట్టు తెలిసినా, తమ పాఠశాలలో పని చేసే టీచర్లు అందులో చేరినా వారి ఉద్యోగాన్ని తొలగించటమే కాకుండా, వారికిమరే ప్రైవేటుస్కూల్లో ఉద్యోగం రాకుండా యాజమాన్యాలు చేయటం ఇక్కడచాలా కామన్‌గా జరిగే వ్యవహారం. కనుక పోరుబాట పట్టి కుటుంబాన్ని పస్తులుంచలేక వీరంతా ఏసంఘంలోనూ చేరేందుకు ముందుకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌లో నెలకు ఒక సెలవు కంటే ఎక్కువ పెడితే వేతనం కట్ చేయటం కామన్. నెలలో వచ్చే 4 ఆదివారాలు పోనూ ఒక సెలవు మాత్రమే ఉండే ఈ స్కూళ్లలో అంతకంటే ఎక్కువ సెలవులు పెరిగితే శాలరీకోసిపారేస్తారు. చాలా స్కూళ్లలో ఆదివారానికి ముందు, తర్వాతి రోజు సెలవుపెడితే.. రెండు రోజుల జీతం కట్. అనారోగ్యం గానీ అత్యవసరంగా సెలవు కోరితే ఇచ్చే అవకాశం బహు తక్కువ. గ్రామం, మండలం స్థాయిలో ఉన్న ప్రైవేటు స్కూళ్లలో రోజుకు 9 గంటలపాటు పనిచేసే టీచర్లలో సగం మంది వేతనాలు రూ. 9 నుంచి 12 వేల మధ్యనే ఉన్నాయి. ఇక పదో తరగతి పిల్లలకు బోధించే టీచర్లు రాత్రి 8 గంటల వరకు బడిలో ఉండాల్సిందే. దీనికి అదనంగా చెల్లించేది ఏమీ ఉండదు. స్కూలు యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర 12 నెలల ఫీజులు వసూలు చేస్తారు. కానీ టీచర్లకు మాత్రం పది నెలలకే జీతం అందుతుంది. ఏప్రిల్, మే నెలలకూ వేతనం ఇచ్చే స్కూళ్లమొత్తం తెలంగాణలో కేవలం 5శాతం మాత్రమేనంటే నమ్మాల్సిందే. తెలంగాణలోని వందలో 20 శాతం స్కూళ్లలో టీచర్లకి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా లేవు. వీరికి నేరుగా వేతనాన్ని నగదు రూపంలో అందిస్తున్నారు. దీనివల్ల వీరికి ప్రభుత్వ పరంగా అందే వైద్యసదుపాయం, మెటర్నిటీ లీవ్ వంటివి ఏమీ అందవు. ఇక కరోనా సమయంలో ప్రైవేటు టీచర్లు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. గత పదేళ్లలోప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు మరింతగా ప్రైవేటు టీచర్ల కష్టాన్ని దోచుకుంటున్నాయి. కళ్లముందు ఇంత జరుగుతున్నా,విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు.ఎమ్మెల్సీ ఎన్నికల వేళ తప్ప రాజకీయ పార్టీలు ప్రైవేటు టీచర్ల సమస్యల్ని ప్రస్తావించకపోవటం దురదృష్టకరం. ఇకనైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు తగినచర్యలు తీసుకుని, ప్రైవేటుస్కూళ్ల యాజమాన్యాలను కట్టడి చేయటంతోబాటు ఇక్కడ పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. •

## బొల్లిముంత జాతీయస్థాయి జీవితకాల పురస్కారాన్ని అందుకున్న సినీ నటుడు బ్రహ్మానందం

తెనాలి టౌన్, డిసెంబర్7(ప్రభాతవార్త): బొల్లిముంత శివరామకృష్ణ జాతీయ స్థాయి జీవితకాల సాఫల్య పురస్కారాన్ని సుప్రసిద్ధ తెలుగు సినీ హాస్యనటులు కే బ్రహ్మానందం కి అందజేశారు. పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం నందు నిర్వహిస్తున్న బుల్లి ముంత శివరామకృష్ణ ఫౌండేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం చివరి రోజు ఆదివారం ప్రముఖ సినీ హాస్యనటుడు కన్నెగంటి బ్రహ్మానందం కి అందించారు. తెనాలి డబల్ హార్స్ గ్రూప్ అధినేత మునగాల మోహన శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా



ఈ పురస్కారాన్ని అందజేశారు. సభకు బొల్లిమంత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు చందు సాంబశివరావు అధ్యక్షత వహించారు.ఈ సభలో మైత్రి హాస్పిటల్స్ ఎండి డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, మరియు వీజీకే అండ్ వివిఎల్ ఫౌండేషన్ కార్యదర్శి తుమ్మల కిషోర్ బాబు చందు శ్రీనివాసరావు,అరవ రామకృష్ణ, బి శ్రీనివాసరావు, సింగరాయకొండ ఎంఈఓ బొల్లి ముంత అజయ్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత పట్టణంలోని వైకుంఠపురం లో ఉన్న శ్రీ లక్ష్మీ మ్మ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయాన్ని దర్శించుకున్న బ్రహ్మానందం ఆలయ పూజారులు కార్యనిర్వహణాధికారి అనుపమ పూర్ణకుంభ స్వాగతం పలికి,వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న బ్రహ్మానందం మాట్లాడుతూ వైకుంటపురంలోని శ్రీనివాసుని దర్శించుకోవడం చాలా ఆనందకరంగా ఉందని తెలిపారు. అనంతరం బొల్లి ముంత శివరామకృష్ణ జీవిత సాఫల్య పురస్కార ప్రధాన సభలో పాల్గొని ఉన్న బ్రహ్మానందం మాట్లాడుతూ బొల్లిమంత శివరామకృష్ణ తెలుగు భాషాభిమాని అని ఆయన రచనల్లో తెలుగు సాహిత్యం కొట్టొచ్చినట్లు కనబడుతుందని ఆయన రచనలు సమాజం పై ప్రభావం చూపాయని కమ్యూనిస్టు యోధునిగా తన జీవితాన్ని రచనల కోసం అంకితమిచ్చిన గొప్ప వ్యక్తిని పేర్కొన్నారు. ఇంకా ఈ సభలో పలువురు విశిష్ట అతిథులకు సత్కారం నిర్వహించారు. తెనాలి మండల తాసిల్దార్ కేవీ గోపాలకృష్ణ,సామాజిక కార్యకర్త చెరుకూరి రమేష్ బాబు,అంతర్జాతీయ శిల్పకళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు ఆయన తనయులు రవిచంద్ర,శ్రీహర్ష లకు బొల్లిమంత శివరామకృష్ణ ఫౌండేషన్ వారిచే సత్కారం చేశారుఈ కార్యక్రమంలో పట్టణంలోని సాహితీ అభిమానులు కళాకారులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న

## ముగ్గురు దొంగలు అరెస్ట్

### రూ. 21.2 లక్షల విలువ గల వాహనాలు స్వాధీనం

బాపట్ల,డిసెంబర్7,ప్రభాతవార్త: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను చేసి వారి వద్దనుంచి రూ.21.2లక్షల విలువకల్గిన 37ఎద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. స్దానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ద్విచక్రవాహనాలకు పాల్పడుతున్న దొంగల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్రవాహనాల దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గడిచిన వారం రోజుల్లో జిల్లా పోలీస్ యంత్రాంగం రూ. 40 లక్షల విలువ గల 60 బైకులను రికవరీ చేశారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలకు సేఫ్టీ లాక్‌లు, జిపిఎస్ పరికరాలు అమర్చుకోవాలన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి వాహనాలను కొనుగోలు చేసేవారు, వాహనాలు దొంగతనాలకు గురికాకుండా ఉండేందుకు సేఫ్టీ లాక్ లు, జిపిఎస్ ఏర్పాటు చేసుకోవడంలో నిర్లక్ష్యం



వహించవద్దన్నారు. బాపట్ల జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా చేధించి, దొంగతనాలకు పాల్పడుతున్న వారిని చాకచక్యంగా అరెస్ట్ చేశారన్నారు.బాపట్ల జిల్లాలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను సవాలుగా తీసుకొని, బాపట్ల సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐ ప్రేమయ్య , సిబ్బంది, జిల్లా పోలీస్ యంత్రాంగంతో కలిపి రెండు



ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, సీసీ కెమెరాల ఆధారంగా వరుస కేసులను చాకచక్యంగా ఛేదించి, దొంగతనాలకు పాల్పడుతున్న గుంటూరు మండలానికి చెందిన లారి డ్రైవర్ కగ్గ సాంబశివరావు,చీరాలకు చెందిన దాసరి గోపిరాజు,దాసరి దుర్గారావులను అరెస్ట్ చేశారన్నారు.కగ్గ సాంబశివరావు చెడు వ్యసనాలకు ,విలాసాకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు.అ దే విధంగా దాసరి గోపిరాజు,దాసరి దుర్గారావులు అన్నదమ్ములు చీపురుల వ్యాపారం చేస్తూ సంపాదన సరిపోకపోవడంతో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారి వద్ద నుంచి దొంగిలించబడిన రూ. 21.2 లక్షల విలువగల 37 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. ద్విచక్రవాహనాల దొంగతనం కేసులను సమర్ధవంతంగా చేధించి,ముద్దాయిలను అరెస్ట్ చేసి 37వాహనాలను సీచ్ చేసిన సిసిఎస్ డిఎస్పిపి.జగష్‌నాయక్,సిఐ ప్రేమయ్య,బాపట్ల పట్టణ సిఐ రాంబాబు,చీరాల 1టౌన్ సిఐ సుబ్బారావు,సిసిఎస్ ఎస్ఐ రాంబాబు,సిసిఎస్ కానిస్టేబుల్ కోటేశ్వరరెడ్డి,కృష్ణ,సురేష్,దాసు,చిరంజీవి,హోంగార్డు రవూఫ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సమావేశంలో సిసిఎస్ డిఎస్పి జగదీష్,సిసిఎస్ సిఐ ప్రేమయ్య,టౌన్ సిఐరాంబాబు,చీరాల వన్‌టౌన్ సిఐ సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## నేడు కార్పొరేషన్ లో స్థానిక సమస్యల పరిష్కారంపై ఫిర్యాదుల స్వీకరణ



**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త) :** నగరంలో ప్రజలు స్థానికంగా ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారం పై సోమవారం కార్పొరేషన్ లో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుంది కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0863 2224202 ల్యాండ్ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, అనంతరం ఒంటిగంట వరకు కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

### 200 మిల్లుల్లో నిరంతరం కల్తీకారం తయారీ!

# ఇతర రాష్ట్రాలకూ...రవాణా అయినా..! చర్యలేవీ?..

గుంటూరు మిర్చియార్డు, డిసెంబర్ 7, ప్రభాతవార్త: కల్తీకారం తయారీదారులు గుంటూరు బ్రాండ్ ను దెబ్బతీస్తున్నారు. కల్తీకారానికి కేరాఫ్ గా గుంటూరు మారడం దురదృష్టకరం. మిర్చి యార్డు పరిసరాల్లో నిత్యము 200 మిల్లుల్లో కల్తీకారం తయారవుతున్న నిఘావర్గాలు నిద్రపోవ డం వెనుక మామూళ్ల బాగోతం నడుస్తున్నట్లు వినికిడి. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డుకు నిత్యము వేలాది టిక్కీలు, సీజన్లో అయితే లక్షల్లో యార్డుకు దిగుమతి అవుతుంటాయి. అయితే నాణ్యమైన సరుకును వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిపోయిన తొడిమెలు తాలూకాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి హానికరమైన రంగులను కలిపి కల్తీకారం తయారు చేస్తున్నారు. ఈ కల్తీకారాన్ని అనేక బ్రాండ్లు పేరు పెట్టి వినియోగ దారులకు విక్రయిస్తున్నారు. కల్తీకారం గుంటూరు తో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా అవుతుంది. కోట్ల రూపాయల కల్తీకారం లావాదేవీలు జరుగుతున్న విజిలెన్స్, ఆహార నియంత్రణ శాఖ, రెవెన్యూ శాఖ తదితర నిఘా వర్గాలు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఆమ్యాలు నడుస్తున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. వినియోగ దారులు ప్రజల ఆరోగ్యముతో చెలగాటమాడుతున్న కల్తీకారం నిర్వా కం పై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. యార్డు పరిసరాల్లో నిత్యం 150 నుంచి 200 మిల్లులలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందని ఈ వ్యాపారంలో ఆరు తేరిన ఒక వ్యాపారి మరొకరితో చర్చించటం విశేషం. మేమంతా అధికారులకు నెలవారి మామూళ్ళు సమర్పించుకుంటాం.. మమ్మల్ని ఎవరు ఆపేది ..అంటూ ధీమా వ్యక్తం చేయడం వెనుక ఏ స్థాయిలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందో ఊహించవచ్చు. కల్తీకారం మిల్లుల వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడే విధంగా మాఫియా నడుపుతున్న కల్తీకారం మిల్లుల వ్యవహారంపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కల్తీకారం అడ్డగా గుంటూరులో 95 శాతం కల్తీకారం జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ విభాగం, విజిలెన్స్ నెల వారి మావుళ్ళతో కల్తీ కారాన్ని అరికట్టలేకపోతున్నారు... తడిచిన మిరపకాయలు, తాలు మిరపకాయలు,ఫంగస్ కాయలు మిర్చి యార్డుకు కర్నూలు, గద్వాల్ నుంచి కొత్త మిరపకాయలు వస్తున్నాయి. వీటిని కొత్త కారం అని చెడిపోయిన ( గర్భాలు పోయిన) మిరపకాయలు, తొడిములు, వరిపొట్టు మిక్సింగ్ చేసి కారం ఆడిస్తున్నారు. ప్రతి కారం మిల్లు యజమానులు ఏజెంట్లు మిల్లులకు తాళాలు వేసి కల్తీకారం అక్రమంగా తయారు చేస్తున్నారు. మిల్లులో ఉన్న గుమస్తాలు హమాలీలు మా యజమాని ఎవరు వచ్చినా తాళం తీయవద్దు అని చెబుతున్నారు. తాలు మిరపకాయలు కారం ఆడిస్తున్నాము అని బహిరంగంగానే పేర్కొంటున్నారు. కొందరు యజమానులపై 2016 2017 లో కల్తీ కారానికి పాల్పడ్డా యజమానులపై కేసులు నమోదు చేశారు, గుంటూరు, ఖమ్మం, ఎమ్మిగనూరు ప్రాంతాలలో కేసులు నమోదు చేశారు. డబ్బుతో అవినీతిని కేసులను మాఫీ చేసు కుంటున్నారు..... ఒక యజమాని తినడానికి తిండి లేక వేరే ప్రాంతం నుంచి గుంటూరు నగరానికి వలస వచ్చి

**-నిఘా వర్గాలకు కనిపించని కల్తీకారం మిల్లుల నిర్వాకం**
**కన్నెత్తి చూడని ఆహార నియంత్రణ శాఖ**



ఇక్కడ వెహికల్స్ రిపేర్ ( మోటారు సైకిల్స్ కి గాలి పెట్టడం,పంచర్లు) వేయడం స్టేజి నుంచి కల్తీ కారం కుంభకోణం లో భాగమై ఈరోజు కల్తీకారం అగ్రస్థానంలో ఉన్నాడు. మరికొందరు వేరే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి వంట మనిషిగా క్లీనింగ్ గా వచ్చి కల్తీకారం కుంభకోణంలో పాత్రులై తమ వంతు వచ్చిన ఆదాయాన్ని ఆస్తులు రూపంలో పన్నులు కట్టకుండా భారీగా ఆస్తులు చేకూర్చుకున్నారు. ఇది ఐటీ రంగా విభాగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి ( డాక్టర్) గా ఉండి కొందరు కారం మిల్లులను లీజుగా తీసుకొని కల్తీ కారం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కానీ అధికారులు ఈ కల్తీకారాన్ని నియంత్రించలేకపోతున్నారు. కనీసం రాష్ట్రస్థాయి ఫుడ్ కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం దీనిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 2015 2016 ఒక కేజీ రంపం పొడిని మూడు రూపాయలకు కొని దానిని కల్తీ కారంలో వాడి కేజీ ..200 కి విక్రయించిన బడా బాబులు. గతంలో కల్తీకారానికి పాల్పడ్డ కొందరు ఇప్పుడు విచ్చలవిడిగా కల్తీకారం తయారుకు పాల్పడుతున్నారు.

**అధికార యంత్రాంగానికి నెల మామూలు అవసరమైనంత**

>>8

## పదవుల నుంచి రిలీవ్‌కు ప్రొఫెసర్లు రెడీ!

### - కొత్త వీసి తొలగించక ముందే తప్పకోవాలనే ఆలోచన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు7, ప్రభాతవార్త: కొత్త వీసి రాక...పాత అధికారులు పోక అనే సామెత ప్రస్తుతం ఏఎన్‌యులో హాట్‌టాపిక్‌గా మారింది. విధుల నుంచి పోయే అధికారుల్లో ఒక ముఖ్యఅధికారి కూడా ఉన్నట్లు సమాచారం. 2024 జూలై నుంచి కొందరు, ఆగస్ట్ నుంచి మరికొందరు ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్, డైరెక్టర్‌లుగా అంటిల్ ఫర్‌ధర్ ఆర్డర్స్‌తో విధులు నిర్వహిస్తున్నారు. ఈ పదవులలో కొనసాగుతున్న కొందరు ప్రొఫెసర్‌లు తమను రిలీవ్ చేయాలని ఒ ముఖ్య అధికారి వద్ద విన్నవించినట్లు తెలిసింది. తాము ఇంకా ఈ పదవుల్లో కొనసాగలేమని కోరుతున్నారు. ఇప్పుడే తమ పదవుల్లో నుంచి తొలగిపోతే వచ్చే వీసి నుంచి కొత్త పదవులు పొందవచ్చుననే ఆలోచన కూడా చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వారిలో పదవుల వల్ల పరిశోధనలపై దృష్టిసారించలేకపోతున్నామని వాపోతున్నారు. పదవుల్లో అధిక సంఖ్యలో సైన్స్ విభాగాల ప్రొఫెసర్‌లు ఉండటం కూడా ఒక కారణంగా చెప్పుకుంటున్నారు. చాలా మంది వారికి అప్పగించిన పదవుల్లో శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నా సహచరుల ప్రోత్సాహం లేకపోవడం బాధగా ఉందని అలాగే తప్పులు జరుగకున్నా వ్యక్తిగత కారణాలతో వక్తిత్వ హననంకు పాల్పడుతుండటం జరుగుతుందని పలు సందర్భాల్లో అనుమాయుల వద్ద వారి వేదనను వ్యక్తపరుస్తున్నారు. మరికొందరు ఆశించిన స్థాయిలో ఫలితాలు తేకపోవడం, చేస్తున్న విధుల్లో పట్టు లేకపోవడం కారణాలుగా చూపిస్తున్నాయి.

కీలక అధికారి అండలో కొందరు...

ఇదిలాఉంటే పలువురు ప్రొఫెసర్‌లు ఒక ముఖ్య అధికారి అండలో నడుస్తున్నారని వర్సిటీలో చర్చ జరుగుతుంది. ఆయ పదవికే ముసలం ఉంటే ఆయనను ఎందుకు ఫాలో అవుతున్నారనే ప్రశ్నలు వస్తున్నా ఆయన ఏదో చేస్తారులే అంటూ కొనసాగుతున్నారు. ఆయన తన పదవిని కాపాడుకోలేక పోతున్నారని ఆయనను ఖచ్చితంగా తొలగిస్తారని వర్సిటీ మొత్తం కోడై కూస్తుండగా ఆ అధికారితో కలిసితిరగడం కూడా తమకు నష్టాన్ని చేకూరుస్తుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. ఆ అధికారి కింది స్థాయి ఉద్యోగులను నమ్ముకుని భారీ అంచనాలు పెట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొంటున్నారు. నచ్చినోడికి నచ్చిన పదవులు, అధికారులు వస్తున్నాయని, అయినవారికి ఆకుల్లో, కాని



వారికి కంచాల్లో వడ్డన అనే సామెతను ఇక్కడ గుర్తుచేసుకుంటున్నారు. కాగా ఆయన కూడ తనకు ఉద్యోగ విరమణ వయస్సు దగ్గర పడుతుందని ఇంకా కొనసాగితే రానున్న రోజుల్లో ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయననుంచి ఎంత ఎక్కువ దూరం జరిగితే అంత మంచిదని పేర్కొంటున్నారు.

**ఏడాది పొడిగింపు ఉత్తర్వులు జారీపై అభ్యంతరాలు..?**

వర్సిటీలోని ఇంజనీరింగ్ వసతిగృహాల వార్డెన్‌ల కొనసాగింపు కొత్త అభ్యంతరాలకు తావిస్తోంది. ఇన్‌చార్జ్ వీసి నుంచి ప్రతీ అధికారి అంటిల్ ఫర్‌ధర్ ఆర్డర్స్‌తో కొనసాగుతుండగా వార్డెన్‌లకు మాత్రం ఏడాదికాలం గడువుతో ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. వీరిలో కొందరికి అసిస్టెంట్ ప్రిన్సిపాల్ హోదా కూడా గడువు ముగియకముందే కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చారని తెలిసింది. ఈ ఉత్తర్వుల వెనుక కూడా ఆ అధికారి చక్రం తిప్పారని వర్సిటీలో చర్చించుకుంటున్నారు. ఏదేమైన కొత్త వీసి వచ్చాక ఆశావాహుల ఆశలు చిగురిస్తాయని పలువురు పేర్కొనడం గమనార్హం

## యూత్ ఫెస్టివల్‌కు వర్సిటీ ముస్తాబు

### - ఏర్పాట్లు పూర్తి

### - తొలిరోజు 13 ఈవెంట్లలో పోటీలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు7, ప్రభాతవార్త: యూత్ ఫెస్టివల్‌కు ఏఎన్‌యు ముస్తాబైంది. యువ కళలకు వేధికగా ఏఎన్‌యు నిలువనుంది. విద్యార్థులే కళాకారులుగా తమలోని కళానైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏఎన్‌యు ఒక డెస్టినేషన్‌గా మరింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మశీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారిలో దాగిఉన్న కళాత్మక అంశాలను నిరూపించుకునేందుకు యూత్ ఫెస్టివల్ చక్కటి అవకాశం కల్పిస్తుంది. యూత్ ఫెస్టివల్‌కు వర్సిటీలో విస్తృత ఏర్పాట్లు చేశారు. వికాస భవన్, స్టూడెంట్ సెంటర్, దక్షిణామూర్తి సెమినార్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్, బాలమోహన్‌దాస్ సెమినార్ హాల్‌ల వేధికలుగా 25ఈవెంట్లలో పోటీలు జరుగనున్నాయి. తొలిరోజు 13 ఈవెంట్లలో పోటీలు జరుగుతాయి.

**నేటి షెడ్యూల్:** ఉదయం 9.30 లకు రిజిస్ట్రేషన్ ప్రారంభమౌతుంది. 10.30కు యూత్ ఫెస్టివల్‌ను లాంచనంగా ప్రారంభిస్తారు. 12గం. నుంచి 5 వరకు వికాస భవన్‌లో మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ ఇన్‌స్ట్రూమెంట్ సోలో (పర్క్యూసన్, నాన్ పర్క్యూసన్, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్టన్ వోకల్ సోలో, గ్రూప్ సాంగ్



(వెస్టన్) జరుగుతాయి. విద్యార్థి కేంద్రంలో థియేటర్ విభాగంలో మిమిక్రీ, మైమ్‌లు నిర్వహిస్తారు. దక్షిణామూర్తి సెమినార్ హాల్లోఫైన్ ఆర్ట్స్ విభాగంలో 1.30నుంచి 3.30 వరకు స్పాట్ పెయింటింగ్, 3.30 నుంచి 5.30 వరకు పోస్టర్ మేకింగ్, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో డాన్స్ విభాగంలో 12గం. నుంచి 5 వరకు క్లాసికల్ డాన్స్, ఫోక్, ట్రైబల్‌డాన్స్, బాలమోహన్‌దాస్ సెమినార్ హాల్‌లో 2.30 నుంచి క్విజ్ పోటీలో ప్రిలిమినరీ రాత పరీక్ష, ఎలక్యూషన్ పోటీలు జరుగుతాయి.

**మ్యూజిక్ డైరెక్టర్ థమన్ రాక**

యూత్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్.థమన్ రానున్నారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ వీసి గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు పాల్గొంటారని యూత్ ఫెస్టివల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు.

## ఆరుగురు అరెస్ట్



**గుంటూరు క్రైమ్, ప్రభాతవార్త, డిసెంబర్ 7:** చెడు వ్యసనాలకు లోనై గంజాయి సేవిస్తూ వారి వద్ద నిల్వ ఉంచిన గంజాయి తో మరికొంతమందిని ఆకర్షితులను చేస్తున్న ఆరుగురు వ్యక్తులను నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్దనుంది 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయి అమ్మకాలు జరుపుతూ,సేవిస్తూన్నారని సమాచారంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వెస్ట్ డిఎస్పీ కె.అరవింద్ పరియవేక్షణ లో నగరంపాలెం సిఐ వై. సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి లాల్ పురం డొంక సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి గుడి సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న సంపత్ నగర్ కి చెందిన గొర్ల కోటేష్ అలియాస్ ఈశ్వర్,వసంతారాయ పురనికి చెందిన కాకర్ల శ్రీకాంత్, నల్లచెరువు కు చెందిన బిసెట్టి కిరణ్ అలియాస్ సాయి,పాతగుంటూరు వినోబాణగర్ కి చెందిన షేక్ నాగుల్ షరీఫ్,ఏ.టి అగ్రహానికి చెందిన అర్థల అశోక్,నల్లచెరువు కు చెందిన షేక్ అబ్దుల్ ఖయ్యూం లను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు.గతంలో వీరు కొన్ని కేసుల్లో పలు పోలీసుస్టేషన్లలో నిందితులు గా వున్నారు.వీరిని కోర్టులో హాజరు పరుస్తున్నట్టు డిఎస్పీ తెలిపారు.


**వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు**

ఆర్‌సి.నెం.221A /2025 తేది: 06-12-2025

**షార్టు టెండరు నోటీసు**

వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు మార్కెట్ యార్డు, గుంటూరు మార్కెట్ యార్డు, గుంటూరు నందు ఒక సంవత్సర కాలమునకు షోడా, కిళ్లీ బంకులు మరియు క్యాటీన్లు నిర్వహణ నిమిత్తము అర్హత కల్గిన సంస్థల వారి నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.

| | | |
|---|---|---|
| టెండరు షెడ్యూలు ఇచ్చు తేది | : | ది.08-12-2025 నుండి 09-12-2025 సాయంత్రం గం.5.00 వరకు |
| టెండరు దాఖలు తేది | : | ది.10-12-2025న ఉదయము గం.10.30 నుంచి మధ్యాహ్నము గం.1.00 వరకు |
| టెండరు తెరచు తేది | : | ది.10-12-2025 సాయంత్రం గం.4.00లకు |

ఇతర వివరములకు మరియు టెండరు షెడ్యూళ్లకు కార్యాలయపు పనిదినములు నందు పనివేళలలో సంప్రదించవలెను.

శ్రీ అసుతోష్ శ్రీవాత్సవ I.A.S., జాయింట్ కలెక్టరు మరియు పర్సన్- ఇన్-ఛార్జీ వ్యవసాయ మార్కెట్ కమిటి గుంటూరు

శ్రీమతి A. చంద్రిక, B,Tech, ఉన్నత శ్రేణి కార్యదర్శి వ్యవసాయ మార్కెట్ కమిటి, గుంటూరు

## పేదల ఆరోగానికే 'కూటమి' ప్రభుత్వం తొలి ప్రాధాన్యత : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: పేదల ఆరోగ్యరక్షణ కోసం అందించే ఉచిత వైద్యసేవలే తమకు, తమ ప్రభుత్వానికి ఎక్కువ సంతృప్తి నిస్తాయని, ప్రజారోగ్య రక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యతని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు పీ4 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ వైద్యుల సహాయ సహకారాలతో పేద, మధ్య, దిగువ తరగతి వర్గాలకు నాణ్యమైన వైద్యసేవల్ని ఉచితంగా





అందించడాన్ని ప్రత్తిపాటి ఫౌండేషన్ తమకు దక్కిన వరంగా భావిస్తోందన్నారు. కూటమిప్రభుత్వం త్వరలోనే సంజీవని పేరిట రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా వినూత్న ఆరోగ్యపథకం ప్రారంభించనుందన్నారు. రూ.20 లక్షల విలువైన వైద్యసేవల్ని ఉచితంగా పొందే అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ శ్రవణ్ సంస్థ సహకారంతో స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన 39 వ వైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి ఆదివారం ప్రారంభించారు. చెవిటి, మూగ సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన పరికరా లను కూడా ఉచితంగా అందించే సువర్ణావకాశాన్ని వినికిడి సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**త్వరలోనే క్యాన్సర్ వ్యాక్సినేషన్ శిబిరం,** రూ.5,200 విలువైన వ్యాక్సిన్ అందించనున్నామని తెలిపారు. వినికిడి రహిత చిలకలూరిపేట నియోజకవర్గమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈరోజు నిర్వహించిన వైద్య శిబిరంలో 1600 మంది రిజిస్టర్ చేయించుకున్నారని, శిబిరానికి వచ్చినవారికి రూ.1000 నుంచి రూ.20,000 విలువగల వినికిడి యంత్రాల్ని ఉచితంగానే అందచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యంగా చిన్నారులకు రూ.20వేల కంటే ఎక్కువ విలువైన పరికరాలు అవసరమైతే. సీఎం.ఆర్.ఎఫ్ ద్వారా అందించే వెసులుబాటు కల్పించామన్నారు. ఈ నెలలోనే త్వరలో క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. రూ.5,200 విలువైన వ్యాక్సిన్ ను క్యాన్సర్ బాధితులకు అందచేస్తామన్నారు. ఈ క్యాన్సర్ వ్యాక్సినేషన్ శిబిరాన్ని ప్రత్తిపాటి ఫౌండేషన్, ఇన్నర్ వేర్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.ఇకపై ప్రతినెలా నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, అలానే ప్రతి 2 నెలలకోసారి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణ వైద్య సేవల నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, నిర్వాహకులు రామాంజనేయులు, కంచర్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, షేక్ మస్తాన్ వలి, ముల్లా కరీముల్లా, కొత్త కోటేశ్వరరావు , మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల,మత,వర్గాలకు అతీతుడు పొట్టి శ్రీరాములు..

చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: కులమతాలు...వర్గాలు..ప్రాంతీయాభిమానానికి అతీతమైన మహోన్నతుడు శ్రీ పొట్టి శ్రీరాములని, ఆయన తెలుగుజాతికోసం చేసిన త్యాగాన్ని, సేవల్ని తెలుగుప్రజలు చిరకాలం గుర్తుంచుకో వాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రాజధానిలో



ఏర్పాటుచేయనున్న శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఏర్పాటుపై శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆదివారం నిర్వహించిన చర్చావేదికకు ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఆర్యవైశ్య ప్రముఖులు, కూటమినాయకులతో కలిసి ప్రత్తిపాటి అమరజీవి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రత్తిపాటి గారి చిత్రపటానికి ఆర్యవైశ్యులు పాలాభిషేకం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి, మనకంటూ ఒక గుర్తింపును ఇచ్చిన మహానుభావుడు, త్యాగధనుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారి 58 అడుగుల కాంస్య విగ్రహంతో పాటు, రాజధాని అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు స్మృతివనం, మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు చేయడం ప్రజలందరికీ గర్వకారణమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటులో రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల్ని భాగస్వాముల్ని చేయాలనే మంచి ఆలోచనతోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ మంచి కార్యక్రమం చేపట్టారని ప్రత్తిపాటి ప్రశంసించారు. ఆర్యవైశ్య నాయకులు అత్తులూరి సుబ్బు, ఐన వోలు సాంబశివరావు, కొత్త కోటేశ్వరరావు , రాచమల్లు సూర్యారావు, కనమర్లపూడి రమేష్, అమరా మణి కుమార్, గుర్రం సాంబశివరావు , చెవూరి కృష్ణమూర్తి, మమ్మీ డాడీ శ్రీను, రాచమల్లు బద్రి, కొత్తూరి ప్రదీప్, గుప్తా, మద్ది అప్పారావు, కొలిశెట్టి రంగా, అమరా రమాదేవి, కొత్త కుమారి, కనమర్లపూడి లక్ష్మీ తిరుమల, కూనల ప్రమీల, కాకరపర్తి రజనీ, ప్రముఖులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: 38వ వార్డుకు చెందిన గడిపూడి పూర్ణ చంద్రరావు, కటారి పెద్ద కొండమ్మ ఇటీవల మృతిచెందారు. ఆదివారం పోలిరెడ్డిపాలెం, మథర్ థెరిసా కాలనీ లోని వారి నివాసాల్లో సంస్మరణ కార్యక్రమాలకు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు.

## అయ్యప్పల ఇరుముడి కార్యక్రమంలో మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త:చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామవాస్తవ్యులు అయ్యప్ప స్వామి మాల స్వీకరించి 41 రోజులు కఠిన దీక్షను పూర్తిచేసుకుని నేడు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం దీక్ష విరమణ కోసం ఇరుముడి ఉత్సవం సందర్భంగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ హాజరయ్యారు. దీక్షాపరులు తమ యాత్రను విజయవంతంగా ముగించుకుని రావాలని కోరుకున్నారు. యడవల్లి గ్రామంలోని శివాలయంలో గురుస్వామిచే దీక్షాపరులు ఇరుముడిని కట్టించుకున్నారు గాయాల నాగయ్య, వెంగళశెట్టి పూర్ణచంద్రరావు, మహంకాళి వెంకయ్య, అవ్వారు శ్రీను, దొడ్డి సుబ్బారావు ఉన్నారు.వేజర్ల కోటేశ్వరరావు , తోట పుల్లయ్య, ఉయ్యాల వెంకటరావు , వెంగళశెట్టి కొండలు, వెంగళశెట్టి సుబ్బయ్య తదితరులున్నారు





## సుబ్బాయమ్మ మృతికి 'మర్రి' నివాళి

చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, నరసరావుపేటవాసి నార్ల మారుతి తల్లి సుబ్బాయమ్మ ఆదివారం ఉదయం మృతిచెందారు. నరసరా వుపేట పట్టణంలోని వారి స్వగృహంలో ఉంచిన పార్థివ దేహానికి మర్రి రాజశేఖర్ నివాళులర్పించారు.

## ఓవర్‌లోడ్ వాహనాలకు జరిమానా



చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల జంక్షన్ వద్ద రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనల తనిఖీలను ముమ్మరం చేశారు. రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ తమ సిబ్బందితో కలిసి ఈ తనిఖీలను పర్యవేక్షించారు.ముఖ్యంగా ఓవర్‌లోడ్ ఆటోలు మరియు సరైన డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు (ఆర్సి, ఇన్సూరెన్స్ వంటివి) లేకుండా వాహనాలను నడుపుతున్న వారిని ఎస్ఐ మరియు సిబ్బంది తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనదారులపై నిబంధనల ప్రకారం చలానాలు విధించారు.

## సెయింట్ చార్లెస్‌లో స్పోర్ట్స్ మీట్




చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: పట్టణంలోని పెదనందిపాడు రోడ్డు మార్గంలో వున్న సెయింట్ చార్లెస్ హైస్కూల్ లో ఆదివారం వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని హాజరయ్యారు. పట్టణ ఎస్సై చెన్నకేశవులు పాల్గొన్నారు. మదర్ సుపీరియర్ సిస్టర్ శాంతి, పాఠశాల ప్రిన్సిపాల్ యం.సుప్రియ తో పాటు సమాజ సేవకులు చుక్క విన్సెంట్ పాల్, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ బుడే విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

## మాజీ సర్పంచ్‌కు 'ప్రత్తిపాటి' నివాళి



చిలకలూరిపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: మార్టూరు మండలం, నాగరాజుపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మిన్నేకంటి ఆదియ్య ఇటీవల మృతిచెందారు. ఆదివారం నాగరాజుపల్లె లోని మృతుని స్వగృహం వద్ద పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించారు. జాష్టి రంగారావు (అసిస్ట్), కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్ ౧, తుపాకుల అప్పారావు, జాష్టి జయకృష్ణ (కిన్ను), గట్టినేని సాయి తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక: జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట, డిసెంబర్ 7 ప్రభాత వార్త ::పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్ అప్ లో పంపిస్తున్నామని తెలిపారు. ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదు తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం

### వైభవంగా జ్యోతి దర్శనం: అభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

నరసరావుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామి వారికి ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా జరుగుతున్న ఆరుద్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శిఖరంపై భక్తులు,




మాలధారులు జ్యోతి దర్శనం వీక్షించారు. తెల్ల వారు జామున స్వామివారికి జరిగిన మహా అభిషేక కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త రామకృష్ణ కొండలరావు బహుదూర్, ఆలయ ఈవో, సహాయ కమిషనర్ చంద్రశేఖర్లు పర్యవేక్షి ంచారు. చిన్నారులు, కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులు,విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శనలలో ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఆరుద్రోత్సవం అంటే కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, ఇది మానవ జీవితంలో ఆధ్యాత్మిక జాగృతికి, శివతత్త్వ బోధనకు ప్రతీకన్నారు.మార్గశిర మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున శివుడు నటరాజ స్వరూపుడిగా ఆనంద తాండవం చేసిన పవిత్ర దినం ఇది. ఈ రోజున స్వామివారికి అభిషేకం చేస్తే వెయ్యి కార్తీక మాసాలు అభిషేకం చేసినంత ఫలితం కలుగుతుందని విశ్వాసం.

## పట్టణంలో పారిశుద్ధ్యం తీరు అధ్వానం: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం చాలా అధ్వాన్నంగా ఉందని, పారిశుధ్య నిర్వహణలో మున్సిపల్ అధికారులు పాలకుల నిరక్ష ్యంల పరకాష్టకు చేరిందని జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు.




డా. గోపిరెడ్డి ఆదివారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా స్థానిక క్రిస్టియన్ పాలెం, శివ సంజీవ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని క్రిస్టియన్ పాలెం, శివసంజీవయ్య కాలనీలలో పారిశుధ్య చాలా దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఇక్కడ కాలువలు శుభ్రం చేసి దాదాపు 6 నెలల నుంచి సంవత్సరకాలం అవుతుందనీ ప్రజలు చెబుతున్నారని అన్నారు. కాలువలను క్లీన్ చేసే పరిస్థితి ఎక్కడా కనబడటం లేదన్నారు. రోడ్డు మీదకు మురుగునీరు వచ్చి రోడ్లు పాచి పట్టి, దోమలు విపరీతంగానే పెరిగిపోయి కనిపిస్తున్నాయని అన్నారు. పాములు యదేచ్ఛగా సంచరిస్తున్నాయని చెప్పారు. క్రిస్టమస్ పండగ దగ్గర పడుతుందని, కనీసం చర్చికి పోయే ప్రదేశంలో పండగ ముందు కూడా అధికారులు, పాలకులు శుభ్రం చేయించడం లేదని అన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు ఉడవటం తప్ప, వార్డులలో శుభ్రం చేయడం, కాలువలు తీసే పరిస్థితి లేదన్నారు. ఈ వార్డులో నెలకొన్న పారిశుధ్ధం గురించి ఎమ్మెల్యేకి ఎన్ని సార్లు చెప్పినా ఆయన చెవుల్లో శంఖం ఊదినట్లే ఉందే తప్ప ఎక్కడ పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్పారు. తాగునీటి పైప్లైన్లు కూడా కాలువల్లోనే ఉన్నాయని, ఏమాత్రం చిన్న లీకేజీ అయినా మురుగునీరు పైప్ లైన్ లోకి ప్రవేశించి ప్రజలకు డయేరియా లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి వెంటనే వీటన్నిటిని కూడా కాలువ లేని చోటికి పైపులు మార్చాలని కోరారు. క్రిస్మస్ పండగ ఉన్నందున తక్షణమే క్రిస్టియన్ పాలెం, శివ సంజీవ కాలనీలలి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 80 సంవత్సరాల వ్యక్తి కాలువ శుభ్రం చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇలాంటివి జరగకుండా ఏరియాలో తక్షణమే పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దేవస్థానంలో అన్నదానం



రొంపిచర్ల డిసెంబర్ 7 ప్రభాతవార్త : స్థానిక సత్తెనపల్లి రోడ్డులో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానములో అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 60 రోజులుగా అన్నదాన కార్యక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు నిర్వాహకులు. ఆదివారం సుమారు 850 మందికి అన్నదానం చేసినట్లు ఆలయ దేవస్థానం చైర్మన్ ప్రవళిక సత్యం ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఏడాది ఈ సేవా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సహకరిస్తున్న భక్తులకు,దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి గంధం వెంకట సూర్యనారాయణ, మైలవరపు ధనుంజయ, చేగు వెంకటేశ్వరరావు, బత్తుల మురళి, వీరయ్య, అన్నదానానికి సహకరించిన దాతలు, అయ్యప్పలు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో డాక్టర్స్ స్పోర్ట్స్ మీట్ 2025



నరసరావుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త : స్థానిక ఐఎంఏ భవనంలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ స్పోర్ట్స్ మీట్ 2025 ను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ నాగోతు ప్రకాష్,డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, క్రీడా ఉత్సవాన్ని ప్రారంభించారు. ఎంతో పని ఒత్తిడిలో ఉండే డాక్టర్స్ ఆటల పోటీల్లో పాల్గొనటం అభినందనీయమన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం వైద్యులకు ఎంతో ముఖ్యమని తెలియజేశారు. ప్రతి ఒక్క వైద్యుడు ఆటల పోటీల్లో పాల్గొనే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రతినిధిగా వైద్యులకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఐఎంఏ నిర్వహించే కార్యక్రమాలకు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.స్పోర్ట్స్ మీట్ లో పలువురు సీనియర్ వైద్యులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ మోహన్ శేషు, డాక్టర్ రామచంద్ర రెడ్డి, డాక్టర్ ఐలా శ్రీనివాస్, యువ డాక్టర్లు, మహిళా వైద్యులు ,ఐఎంఏ సభ్యులు ఈ క్రీడల్లో పాల్గొని, క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చదరంగం తదితర ఆటల్లో పోటీ పడ్డారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అవార్డులు, ధృవీకరణ పత్రాలు అందచేశారు.

## బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

వినుకొండ,డిసెంబర్7,ప్రభాతవార్త: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో రఘు మాస్టారు ఇంటి వద్ద మూడు నిరుపేద కుటుంబాలకు బియ్యం,నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు రఘు,అత్యుతన స్వామి,చింతలపూడి భద్రయ్య,సంఘ పెద్దలు ముటుకల శివ,బి.రవికుమార్,జి.వి మాధవరావు,భువనగిరి సుబ్రహ్మణ్యం, పి.నారాయణ ,బి.ప్రసాద్,డి.శ్రీనివాసాచార్యులు,దేవులపల్లి విశ్వనాధశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## వినుకొండకు చెందిన పర్వీజ్‌కు న్యాయశాస్త్రంలో పిహెచ్‌డి

వినుకొండ,డిసెంబర్7,ప్రభాతవార్త: వినుకొండ ప్రాంతానికి చెందిన ఎస్.కె.ఎండి అబుతాలిబ్ పర్వీజ్‌కు ఆచార్య నాగార్జున యూనివర్శిటి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసింది.



ఏఎన్‌యూ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ ఏ.గురువయ్య పర్యవేక్షణలో ఏ క్రిటికల్ అనాలసిస్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అండ్ అవేర్నెస్ ఇనిషియేటివ్స్ ఫర్ ది రూరల్ పూర్ త్రు ది ఇన్వాల్వ్మెంట్ ఆఫ్ పారా లీగల్ వాలంటీర్స్ అండ్ లా స్టూడెంట్స్ స్పెషల్ ఫోకస్ ఆన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పర్వీజ్ పరిశోధనలు పూర్తి చేశారని పరిశోదన విభాగం సమన్వయకర్త డాక్టర్ పి. సుధాకర్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం చేతుల మీదుగా పర్వీజ్‌కు పీహెచ్‌డి డిగ్రీ అవార్డు లేఖను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పుర ప్రముఖులు పర్వీజ్‌కు అభినందనలు తెలిపారు.

## పురుగు మందుల అక్రమ రవాణాపై పోలీసులకు ఫిర్యాదు

వినుకొండ,డిసెంబర్7,ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ఉన్న కార్గోపార్శిల్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. అక్రమంగా రవాణా జరుగుతున్న సుమారు రూ.3లక్షలు విలువ గల పురుగు




మందులను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఏడిఏ రవికుమార్.ఏవో వరలక్ష్మిలు ఫిర్యాదులు చేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ప్రసాద్‌కు ఘన సన్మానం



నూజెండ్ల, డిసెంబర్7, ప్రభాతవార్త: మండలంలోని సీతారామపురం గ్రామంలోని ఎస్.వి.ఎస్.సి హై స్కూల్‌లో పని చేస్తున్న క్రాఫ్ట్ మాస్టర్ పిఎస్ఆర్‌కె ప్రసాద్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు చంద్రజిత్‌యాదవ్,రామిరెడ్డి,వినుకొండ ఏరియా వి.ఆంజనేయులు,నూజెండ్ల మండల నాయకులు కె.బాలకృష్ణారావు,అంజిరెడ్డి,ఘంటా నాగేశ్వరరావు,ఎస్.కె యాసిన్,ఎస్.కె.సుభాని,స్కూల్ ప్రిన్సిపల్ శిష్ట్లా కామేశ్వరరావు శర్మ,ఉపాధ్యాయులు,సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా షేక్ బాజీ



నకరికల్లు,డిసెంబర్ 7 ప్రభాతవార్త ::వైఎస్ఆర్సిపి మైనారిటీ విభాగం పలనాడు జిల్లా కార్యదర్శిగా నకరికల్లు చెందిన షేక్ బాజీ ఎంపికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి లోని కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్రకటించిన జాబితాలో పార్టీ అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న నకరికల్లుకు చెందిన షేక్. బాజీ కి చోటు లభించింది. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన షేక్. బాజీ మాట్లాడుతూ తన నియామకం పట్ల సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు. బాజీకి పలువురు నాయకులు కార్యకర్తలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు

## సత్తెనపల్లిలో 'ప్రతి ఆదివారం ఇంటింటికీ' : అభివృద్ధి పనులకై వార్డు కమిటీ తీర్మానాలు

సత్తెనపల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం లోని 4వ వార్డు లో ప్రతి ఆదివారం ఇంటింటికి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాను సారంతో వార్డులోని అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన కార్యక్రమం జరిగింది. వార్డుకి కావాల్సిన అభివృద్ధి పరిశీలన చేయడం



జరిగినది వార్డు కమిటీ తీర్మానాలు చేయటం జరిగినది . వార్డ్ ప్రెసిడెంట్ ధూపగుంట్ల జానకి రామారావు , సెక్రటరీ జానీ, బూత్ కన్వీనర్ బాజీ కార్యదర్శి, సవ్వాని ఆంజనేయులు, వార్డు బిసి సెల్ ప్రెసిడెంట్ విప్పర్ల పాండు రంగారావు, వార్డు సెక్రటరీ విప్పర్ల నాగేశ్వరరావు తెలుగు మహిళా అధ్యక్షురాలు ముంతాజ్,వార్డు కార్యదర్శి ఆలీ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## వైభవంగా ఆరుద్రోత్సవం

సత్తెనపల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త: మార్గశిర మాసం ఆద్రా నక్షత్రం సందర్భంగా ఆదివారం శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం లోని మల్లిఖార్జున స్వామి వారికీ విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు ఝామున స్వామి వారికి పంచామృతాలతో నమక చమక సహితంగా మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం ట్రస్ట్ బాధ్యులు తెలిపారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


సత్తెనపల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడు మరియు లక్కరాజు గార్లపాడు గ్రామాలలో ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన శాఖ, పల్నాడు జిల్లా మరియు గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో నిర్వహించడం జరిగింది. కంపెనీ నుండి



వచ్చిన శాస్త్రవేత్త సుభాష్ సంజయ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ అంటే నూనె పంట మరియు మార్కెట్లో ఎప్పుడు డిమాండ్ ఉన్న పంట ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్లు ఖర్చుపెట్టి విదేశాల నుండి 150 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నారు, సత్తెనపల్లి ఉద్యాన అధికారి యన్. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఆయిల్ ఫామ్ మొక్కలు ఖరీదు పై 100 రాయితీ వస్తుందన్నారు. గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ శ్యామ్ సుందర్, పాకాలపాడు పి. ఎ. సి. స్. చైర్మన్ సత్య నారాయణ గారు, పాకాలపాడు గ్రామ నాయకులు కె. కోటి రెడ్డి, , కంపెనీ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్లు జి.వి. రమణ , కె. నానీ , ఐ.జగదీశ్ ,,యం.ఐ. ఎ. ఓ. నరేంద్ర ,, రైతు సేవా కేంద్రం సిబ్బంది కె. ప్రియాంక, జె. జెస్సీ, శివ సాయి గోపి, రామ కోటి రెడ్డి రైతులు పాల్గొనడం జరిగింది.

## వైద్యశిబిరం విజయవంతం

సత్తెనపల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త: ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం, సత్తెనపల్లి ఆద్వర్యంలో యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది.ఈ సందర్భంగా వైద్యబృందాన్ని బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు) అభినందించారు. మెయిన్ రోడ్డులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం




వరకు నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని,బి.పి,షుగర్ , ఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. మొత్తం వివిధ విభాగాల్లో 245 మంది వైద్య పరీక్షలు చేయించుకొని వైద్య నిపుణులు సలహాలు తీసుకొన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వంకాయలపాటి సూర్యప్రకాశరావు,డాక్టర్ పి.వెంకటస్వామి, డాక్టర్ కమిలి రాజశేఖర్, డాక్టర్ రాజా చల్లపల్లి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు) పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు,కనమర్లపూడి సుబ్బారావు,నోముల వెంకట రమణ,నారాయణ వెంకట శ్రీనివాసరావు,చిలకల శ్రీనివాసరావు,తోమంద్రు సత్యనారాయణ ,వనమా శివ నాగేశ్వరరావు,దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.చివరిలో వైద్య బృందాన్ని సత్కరించారు.

## పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

-తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్



పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. పిజిఆర్ఎస్‌లో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ నెల 8వ తేదీ సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో మండల, పట్టణ పరిధిలోని ప్రజలందరూ వారి సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేయాలన్నారు. అదేవిధంగా భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను కూడా నియమించడం జరిగిందన్నారు. భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

## మహిళలను భాగస్వాములను చేయడంలో ఆర్పీలదే కీలక పాత్ర- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాములను చేసే ప్రక్రియలో ఆర్పీలదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక పురపాలక సంఘంలో మెప్మా సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణంలో స్వయం సహాయక సంఘాలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, దీనికి కారకులైన వారిపై



చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. బినామీ పేర్లతో ఫేక్ గ్రూపులను ఏర్పాటు చేసి లోన్లు తీసుకున్నవారిపై చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా లోన్లు పొంది రికవరీ చేయని గ్రూపులను గుర్తించామని, ఆర్పీ గ్రూపుల నుండి లోన్లు రికవరీ చేయించాల్సిన బాధ్యత ఆర్పీలపై ఉందన్నారు. ఆర్పీలు తక్షణమే అలాంటి వారి నుండి లోన్లు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఆర్పీలు మీన మేషాలు లెక్కిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, సిటీమిషన్ మేనేజర్, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## పట్టణ వైకాపా వైద్యుల విభాగం అధ్యక్షుడిగా పల్లికల శ్యామ్



పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ వైద్యుల విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పల్లికల శ్యామ్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. శ్యామ్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తుండడంతో, ఆయన సేవలను ఉపయోగించుకునేందుకు వైద్యుల విభాగం అధ్యక్షుడిగా నియమించింది. దీంతో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్యామ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉన్న బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని చెప్పారు.

## రైతు సేవా కేంద్రం సిబ్బంది చురుగ్గా పనిచేయాలి

పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: రైతు సేవా కేంద్రం సిబ్బంది ధాన్యం కొనుగోలు విషయంలో వేగవంతంగా పనిచేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలును ఆయన ఆదివారం పరిశీలించారు. సిబ్బంది రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు, ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటిస్తున్నారా..?లేదా...? సమయపాలన పాటిస్తున్నారా..? లేదా...? అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రతిరైతు రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని ఆయన కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల్లో చైతన్యం తెచ్చి దళారీ వ్యవస్థ ధాన్యం కొనుగోలులో జోక్యం చేసుకోకుండా చూడాలన్నారు. రైతులు నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని కోరారు.



## మానవ సేవే మాధవ సేవ



పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తిని అనుసరించి ప్రతి ఒక్కరూ అనాథలను, అవసరార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ మారం శివకుమార్ అన్నారు. నిడుబ్రోలులోని శాంతోమ్ కరుణాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ13వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనాథల కోసం హెల్పింగ్ హ్యాండ్ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.ప్రతి ఒక్కరూ సంపాదించిన సొమ్ములో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వల్లా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు, అనాథలకు, వికలాంగులకు శాంతోమ్ కరుణాలయం చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.కీర్తి, హెల్పింగ్ హ్యాండ్ నిర్వాహకుడు దొప్పలపూడి రాజు, బాలకృష్ణారెడ్డి, అంబటి పూర్ణ,హేమంత్, సుధాకర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం

పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: క్రమం తప్పకుండా ప్రతి రోజు కొద్దిసేపు సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. పొన్నూరు సైక్లింగ్ క్లబ్బు సభ్యులు ప్రతి నిత్యం సైకిల్ తొక్కడం ద్వారా పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో....సైకిల్ తొక్కు బ్రో అనే నినాదంతో ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పల్లెటూళ్ళను కలుపుకొంటూ సైకిల్ మీద యాత్ర చేయడం వారిలోని ఉత్సాహాన్ని తెలియజేస్తుందన్నారు. ఆదివారం నిడుబ్రోలు నుండి బయలుదేరి జడవల్లి, కొమలి, మావడరం, చింతలపూడి మీదుగా తిరిగి పొన్నూరు వరకు 20కిలోమీటర్లు సైక్లింగ్ చేయడం, అందులో తాను కూడా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని రమేష్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని బాలకృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.




## రేషన్ షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించాలి

పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: రేషన్ షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించి కార్డుదారులకు రేషన్‌ను సకాలంలో పంపిణీ చేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలోని 24వ నెంబరు షాపును ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని స్టాకును పరిశీలించారు. ఈపాస్ మిషన్‌లో నమోదైన స్టాకు, షాపులోని స్టాకును సరిచూశారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డుపై నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం పాత రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసిందని, అయితే ఇంకా కొంత మంది కొన్ని కారణాల వల్ల స్మార్ట్‌కార్డులను తీసుకోలేదని, తీసుకోనటువంటి వారు తహశీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌ను సంప్రదించి కార్డులను పొందాలని సూచించారు.



## నియోజకవర్గ వైకాపా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అంబటి

పొన్నూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అంబటి వెంకటేశ్వరరావును నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. అంబటి వెంకటేశ్వరరావు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుండడం, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుండడంతో ఆయన సేవలను నియోజకవర్గాని ఉపయోగపడేవిధంగా నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డికి, సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి రానున్న కాలంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అంబటి తెలిపారు



# బాపట్ల జిల్లా వార్త



## రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు

చెరుకుపల్లి,డిసెంబర్ 7, (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన చెరుకుపల్లి అంబేద్కర్ సెంటర్లో జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఇద్దరు అన్న, చెల్లెలికి కాలు విరిగిపోయిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. మండలంలోని బడేవారిపాలెం గ్రామానికి చెందిన బడే గౌతమ్ జై కృష్ణ ఇతని సోదరి బడే ఆశ ఇరువురు బైక్ పై చెరుకుపల్లి నుండి గుల్లపల్లి వైపు వెళ్తున్నారు . ఇదే సమయంలో చెరుకుపల్లి అంబేద్కర్ బొమ్మ వద్ద వెనక ఉందండి వస్తున్న లారీ బైక్ను ఢీకొట్టడమే కాకుండా బైక్ పై నుండి లారీ చక్రాలు వెళ్లడంతో ఇరువురికి కాళ్లు విరిగిపోయాయి. ఇరువురికి తీవ్రమైన రక్త గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. అంబేద్కర్ సెంటర్లో తరచూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం ఇటువంటి ప్రమాదాలకు కారణమవుతుంది. అంతేకాకుండా జాతీయ రహదారిపై మూడు రోడ్ల జంక్షన్లో అంబేద్కర్








స్టాట్యూ ఉండటం కూడా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు, ప్రయాణికులు తరచూ వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై ఏ విధమైన స్టాట్యూలు ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ అధికారులు నిరక్ష్యం కారణంగా తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేస్తామని అధికారులు గతంలో చెప్పినప్పటికీ నేటికీ ఆచరణకు నోచుకోలేదని విద్యావంతులైన దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు ,స్థానికులు ప్రయాణికులు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తెనాలి నుండి చెరుకుపల్లి వచ్చిన ఆర్టీసీ బస్సులు, భారీ వంటి భారీ వాహనాలు సైతం ఈ విగ్రహం చుట్టూ తిరిగి రావాల్సి వచ్చినప్పుడు జాతీయ రహదారిపై వాహనాలకు ఆటంకం ఏర్పడి వాహనాలు సైతం స్తంభిస్తుండటం రోజువారి ఆటంకంగా మారింది. సమస్యను పరిష్కరించమని ప్రజలు ,ప్రయాణికులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ఈ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ లారీ ఏకంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఢీ కొట్టిన సంఘటన సైతం చోటు చేసుకోవడం పట్ల తీవ్ర ఆందోళన పరిస్థితి సైతం ఇక్కడ నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారా లేదా యధారాజా తథానట్టుగా వ్యవహరిస్తారో అని ప్రజానీకం వ్యక్తం చేస్తుంది.

## సమాజ సేవతోనే సంతృప్తి

రేపల్లె, డిసెంబరు 7, ప్రభాతవార్త:సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సంతృప్తి లభిస్తున్నదని ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవాధ్యక్షురాలు గౌరీ రామకుమారి అన్నారు.ఆదివారం నిజాంపట్నం రోడ్ ప్రాంతంలోని దయానంద బాలికల ఆశ్రమానికి నెల రోజులపాటు అవసరమైన అల్పాహార సరుకులను,ఒక ఫ్యాన్‌ను వితరణగా అందించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమాలకు ఆర్థికపరమైన చేయూతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఆకుల సత్యవతి,కార్యదర్శి కారుమూరి నాగలీల,కోశాధికారి మల్లేశ్వరి,పువ్వాడ సుందరి,పెడతాటి విజయ తదితరులు పాల్గొన్నారు.



## రూ.40 లక్షల ప్రింటింగ్ మిషనరీ దగ్ధం

రేపల్లె, డిసెంబరు 7, ప్రభాతవార్త:రేపల్లె పట్టణంలో ఆదివారం రాత్రి ఒక ఫ్లెక్సీ ప్రింటింగ్ సెంటర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా రూ.40 లక్షల విలువైన ప్రింటింగ్ ప్రెస్ మిషనరీ దగ్ధమైంది. బాధితునికి పూర్తి స్థాయిలో ఆర్థిక నష్టం జరిగినట్లు తెలుసుకున్న రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రాము సంఘటనా ప్రదేశానికి చేరుకుని పరామర్శించారు.ప్రమాదం జరిగిన తీరును బాధితుడి నుంచి తెలుసుకున్నారు.


## వేతన సవరణ కమిటీ ఛైర్మన్‌ను నియమించాలి

నిజాంపట్నం, డిసెంబరు 7, ప్రభాతవార్త:కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలమవుతున్నా నేటి వరకు వేతన సవరణ కమిటీకి ఛైర్మన్‌ను నియమించకపోవడం అప్రజాస్వామికమని ఉపాధ్యాయ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ అన్నారు.ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో నిజాంపట్నం మండల శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ఛైర్మన్‌ను నియమించాలని కోరారు.ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మండల శాఖ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా కె.వి.గోపాల్,అధ్యక్షుడుగా కుర్రా కిరణ్,ఉపాధ్యక్షులుగా ఎల్.శ్రీనివాసరావు,మోపిదేవి వంశీ,సిహెచ్.రజని,వి.మీరా సాహెబ్,ప్రధాన కార్యదర్శిగా కె.రాంబాబు,కార్యదర్శులుగా పులి శ్రీనివాసరావు,జి.రాజ్యలక్ష్మి,జి.రాజగోపాల్,జిల్లా కౌన్సిలర్లుగా పందరబోయిన వెంకటేశ్వరరావు,ఎం.డి. యాకూబ్,వై.సురేష్,మోర్ల సుబ్రహ్మణ్యం, కె.రామాంజనేయులు,బి.వెంకటరత్నం,ఆడిట్ కన్వీనర్‌గా ఆలపాటి శ్రావణ్‌కుమార్,సభ్యులుగా కరీముల్లా బేగ్,పి.ఎం.ఏడుకొండల రెడ్డి,ఎస్.నాగబాబు, ఎన్.ఉమామహేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి దోవా రవి ప్రకటించారు.ఎన్నికల పరిశీలకులుగా తేలప్రోలు శ్రీనివాసరావు,వై.నేతాంజనేయ ప్రసాద్ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ కార్యకర్తలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కొలకలూరు శివాలయంలో చోరీ

తెనాలి టౌన్, డిసెంబర్7(ప్రభాతవార్త): మండల గ్రామమైన కొలకలూరు లోని ప్రసిద్ధి చెందిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన అర్చకుడు,హుండీని పగలగొట్టి ఉండటం గమనించి ఆలయ ఈవోకి సమాచారం ఇచ్చాడు.దుండగుడు హుండీ ధ్వంసం చేయటానికి ఉపయోగించిన పలుగును ఆలయ ఆవరణలోనే వదిలి వెళ్ళాడు.గత ఆరు నెలల క్రితం ఇదేవిధంగా ఇదే శివాలయంలో చోరీ జరగడం, మరల నేడు కూడా హుండి పగలగొట్టి కానుకలు దొంగతనం చేయడం పట్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో దేవాలయాల్లో చోరీలు అధికమయ్యాయని ఒకే దేవాలయంలో ఐదు నెలల్లో రెండుసార్లు చోరీలు జరగడంపై గ్రామంలో చర్చనీయమైంది. ఈ సందర్భంగా ఆలయ ఈవో జరిగిన ఘటనపై తెనాలి రూరల్ పోలీసు వారికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రేపల్లె, డిసెంబరు 7, ప్రభాతవార్త:పట్టణంలోని శ్రీ భగవాన్ సత్యసాయి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించుకున్నారు.1979-80 సంవత్సరంలో 10వ తరగతి చదివి 45 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అనాటి జ్ఞాపకాలను పరస్పరం గుర్తు చేసుకున్నారు.జీవితంలో స్థిరపడిన వైనం గురించి నాటి విద్యార్థులు చెప్పుకున్నారు.అప్పటి గురువులైన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సాయినాథ్,సత్యనారాయణ,సుబ్బారావు,వెంకట్రావు,రాజ్యలక్ష్మి,కృష్ణకుమారి,లక్ష్మీకుమారి,వసుంధర,సిపెచ్.వెంకటేశ్వరరావు,సీతారామయ్య,ప్రసాద్,చల్లా శ్రీనివాస్,ఎండి గౌస్,బేబి సతీష్,ఎస్‌పిఎల్ అనూరాధ,మాజేటి ప్రభాకర్, మహేష్,శ్రీధర్,షేక్ ఖలీల్,భవానీ,ఎస్.పద్మజ,పవన్,రంగనాథ్





## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం

తెనాలి టౌన్ డిసెంబర్7(ప్రభాతవార్త): రోటరీక్లబ్ అఫ్ తెనాలి వైకుంఠపురం,రోటరీ చారిటబుల్ ట్రస్ట్ మరియు ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో,నల్లమోతు మృత్యుంజయప్రసాద్, సుచేత(యుఎస్ఏ)వారి సహకారంతో, ఆదివారం చుండూరు మండలం దుండిపాలెం పంచాయతీ కార్యాలయంవద్ద,ఉచిత నేత్ర వైద్య శిబిరము ఏర్పాటు చేశారు.క్లబ్బు అధ్యక్ష కార్యదర్శుల నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, పర్యవేక్షణలో గ్రామ అధ్యక్షుడు వెంకటరెడ్డి, రోటరీ 3150అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, జోనల్ సెక్రెటరీ గుత్తా వెంకటరత్నం,పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో డిస్టిక్ క్యాబినెట్ కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, మల్లాది అర్జున, బత్తుల వెంకటేశ్వరరావు, చుండూరు మండలం ఎంపీటీసీ నాగేందర్ రెడ్డి,ఎల్వి ప్రసాద్ సిబ్బంది వై వెంకట్, డి సరళ, వి. మాధవి, డి. జ్యోతి, ఎ. స్రవంతి, ఇంట్రాక్ క్లబ్ సభ్యులు అఖిల్, పార్థ వెంకట్, గోపికృష్ణ, యోసెస్ , చేతన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, ఈ కార్యక్రమానికి కళ్ళు పరీక్షలు అవసరమైన 130 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. 37 మందికి కళ్ళజోళ్ళు 20 మందికి శుక్లాం ఆపరేషన్ అవసరమైన ఉన్నది. శుక్లాలు ఆపరేషన్ అవసరమైన వారిని మంగళవారం ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్ గూడవల్లి తీసుకుని వెళ్లి కంటి శుక్లాలు ఆపరేషన్లు ఉచితముగా నిర్వహిస్తారని, నిర్వాహకులు తెలిపారు.



## ఆదిత్య హాస్పిటల్‌చే ఆర్ఎంపి వైద్యులకి శిక్షణా తరగతులు

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్7(ప్రభాతవార్త): ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ తెనాలి డివిజన్ స్థాయి గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని రాధా మాధవ్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఆదిత్య హాస్పటల్ కి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ పి.కృష్ణ శ్రవంత్(ఎంబిబిఎస్, డిఎన్బి, ఎంసిహెచ్), పాల్గొని ఎముకలు మరియు కీళ్లవ్యాధులకు ఆధునిక చికిత్స గురించి వివరించారు. తమ హాస్పటల్లో ఇప్పటివరకు సుమారు పదివేల మందికి పైగా కీళ్ల మార్పిడి ఆపరేషన్స్ నిర్వహించినట్లు,ఆధునిక టెక్నాలజీతో ఎప్పటికప్పుడు నూతన పరికరాలు అందుబాటులోకి తెచ్చి, రోగులకు తక్కువధరలలో వైద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ సిహెచ్.అమూల్య(ఎండి డిఎం) మాట్లాడుతూ,మెదడు మరియు నరాలకు సంబంధించిన వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.ముఖ్యంగా పక్షవాతం,ఫిట్స్ లాంటి వ్యాధుల గురించి, వివరించారు. న్యూరాలజీ విభాగంలో ఆధునిక పరికరములతో పేదవారికి కూడా అందుబాటులో వైద్యం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపి అసోసియేషన్ అధ్యక్షులు, డా నారాయణం వేణుగోపాల్, డా కె.పుల్లారావు,డా జి. రంగారావు,డాఅయోధ్య శ్రీనివాసరావు,డా గాదె సుబ్రహ్మణ్యం,డాడి. కోటేశ్వరరావు,తెనాలి పట్టణం మరియు డివిజన్ స్థాయిలోని ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.



## తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాల్లో,"మహానాట్య నీరాజనం"

తెనాలి మున్సిపాలిటీ, డిసెంబర్7 (ప్రభాతవార్త): బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకతసంస్కృతి సమితి సౌజన్యంతో పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం నందు గత రెండు రోజులుగా జరుగుతున్న తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం రెండవ రోజు ఆదివారం,పట్టణానికి చెందిన కూచిపూడి కళాకారులు 500 మందితో "మహానాట్య నీరాజనం "కార్యక్రమం నిర్వహించారు. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చందు సుబ్బారావు ఆధ్వర్యంలో, నిర్వహించబడిన మహానాట్య నీరాజనం కార్యక్రమం అనంతరం,ప్రముఖ నృత్య గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నృత్య గురువులు, జి.నిర్మలా రమేష్, ఏ.వెంకటలక్ష్మి కె.ఎల్. శ్రీరామచంద్రమూర్తి,సిహెచ్. యామిని,బి.రంగనాయకి, పి. వసంతదుర్గ,సిహెచ్.బాలా త్రిపురసుందరి లకు విశిష్ట సత్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన ప్రముఖులు, కళాకారులు,సాహితీవేత్తలు, బొల్లిముంత శివరామకృష్ణ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రేపల్లె రెవెన్యూ డివిజన్ కేంద్రంలో నెరవేరని ఉన్నత విద్యాభివృద్ధి

### -కేంద్రీయ,ట్రిపుల్ ఐటి,ఇంజనీరింగ్ విద్యకు డిమాండ్

రేపల్లె-ప్రభాతవార్త: ప్రభుత్వపరంగా తీరప్రాంత పట్టణ కేంద్రమైన రేపల్లెలో ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటు విద్యార్థుల చిరకాలవాంఛగా మిగిలిపోయింది.ప్రభుత్వ జూనియర్ కళాశాల,అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ,పిజి కళాశాల,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉన్నాయి.ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల శిధిలావస్థకు చేరటంతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మంజూరు చేయించిన రూ.25 లక్షల నిధులతో ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి.ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక వసతుల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తూనే ఉంది.అయితే విద్యార్థులు కోరుకునే ఉన్నత విద్య అందుబాటులో లేని కారణంగా దూర ప్రాంతాలలోని ప్రైవేటు విద్యా సంస్థలపై ఆధారపడాల్సి వస్తోంది. ట్రిపుల్ ఐటి, ఇంజనీరింగ్,కేంద్రీయ విద్య అవసరాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆ దిశలో అడుగులు పడకపోవడం విద్యార్థులను నిరుత్సాహపరుస్తోంది.కృష్ణా నదిపై నిర్మించిన పెనుమూడి-పులిగడ్డ వారధికి ఇటువైపు బాపట్ల జిల్లా,అటువైపు కృష్ణా జిల్లా తీర ప్రాంతాలు ఉన్నాయి.వీరికి రేపల్లె పట్టణం అందుబాటులో ఉంది.ఇప్పుడు రేపల్లె రెవెన్యూ డివిజన్ కేంద్రంగా రూపాంతరం చెందింది.విద్యార్థుల కోసం ఉన్నత విద్యావకాశాలను అందుబాటులోకి తేవాలని రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు,పలువురు ప్రముఖులు ఇటీవల రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి దృష్టికి తీసుకువెళ్ళారు.ఈ విషయంపై ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరారు.ఇంజనీరింగ్ కళాశాలలు లేని కారణంగా రేపల్లె ప్రాంతంలోని వందలాది మంది విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి నిత్యం చీరాల,బాపట్ల,చేబ్రోలు,తెనాలి,గుంటూరు,వడ్లమూడి తదితర దూర ప్రాంతాలకు వెళ్ళి తిరిగి రావాల్సి వస్తోంది.ప్రయాణ ఛార్జీలు,ప్రైవేటు కళాశాలల ఫీజుల భారం,గంటల కొద్దీ ప్రయాణం వంటి సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల బస్సులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. విద్యార్థులు గాయపడుతున్నారు.సామర్థ్యం లేని బస్సులపై రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ అధికారుల నిఘా కొరవడిందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచే వస్తున్నాయి. విద్యార్థి కాలేజీకి వెళ్ళాడంటే ఇంటికి తిరిగొచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళన తప్పడంలేదు.రేపల్లెలో ప్రభుత్వపరంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి ఆర్కిటెక్చర్,బయోటెక్నాలజీ,కెమికల్ ఇంజనీరింగ్,కెమికల్ పెట్రో ఇంజనీరింగ్,సివిల్ ఇంజనీరింగ్,సివిల్ మరియు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్,కంప్యూటర్ సైన్స్ మరియు సిస్టమ్స్ ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్,జియో ఇన్ఫర్మేటిక్స్,మెరైన్ ఇంజనీరింగ్,మెకానికల్ ఇంజనీరింగ్,మెటలర్జికల్ ఇంజనీరింగ్,నావల్ ఆర్కిటెక్చర్,ఫార్మాస్యూటికల్ సైన్సెస్,సిరామిక్ టెక్నాలజీ,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం,ఇజనీరింగ్ కెమిస్ట్రీ,ఇంజనీరింగ్ గణితం,ఇంజనీరింగ్ ఫిజిక్స్,హ్యూమానిటీస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగాలను అందుబాటులోకి తెస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇది జరిగితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,కంప్యూటర్ సైన్స్ కోర్సులను ఐఐఐటిలో పూర్తి చేసుకోవచ్చు.10వ తరగతి పూర్తి చేసిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ కోర్సు అందుబాటులోకి రావాలి.మొదటి 2 సంవత్సరాలు ఇంటర్మీడియట్ కోర్సుకు సమానమైన ప్రీ యూనివర్శిటీ కోర్సుతో పాటు మిగిలిన 4 సంవత్సరాలు బిటెక్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.ఈ కోర్సులే కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులు ప్రోగ్రామ్‌లో భాగంగా అందుబాటులోకి వస్తాయి.అత్యుత్తమ విద్యా ప్రమాణాల అవసరాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు.భారత కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే స్వయం ప్రతిపత్తి కలిగిన కేంద్రీయ విద్యాలయం రేపల్లెలో ఏర్పాటు చేయాలని ఏనాటి నుంచో ప్రజా సంఘాలు,విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.జిల్లాల విభజన జరగక ముందు కేంద్రీయ విద్యాలయం కోసం రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు ప్రయత్నించగా తెనాలి రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో ఒక కేంద్రీయ విద్యాలయం ఉన్నందున మరొకటి ఏర్పాటు చేయటం సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.ఇప్పుడా సమస్య లేదు.ఎలాగూ బాపట్ల జిల్లా ఏర్పడటం రేపల్లె పట్టణం రెవెన్యూ డివిజన్ కేంద్రమైనందున కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు సులువు కాగలదు. అయితే ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారుల సహకారం ఉంటేనే సాధ్యపడగలదు.





## హత్య కేసులో నిందితుల అరెస్ట్

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 7 ప్రభాతవార్త :: పట్టణ శివారులో గత నెల 24వ తేదీన జరిగిన షేక్ పెద్ద బాజీ హత్య కేసులో నిందితులు త్రోవ గుంట బాలసుబ్రమణ్య చారి, వాలి చర్ల రాంబాయమ్మ లను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఆదివారం స్టేషన్ లో జరిగిన



విలేకరుల సమావేశంలో సీఐ ఎం.వి సుబ్బారావు తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను వల్లపు చెరువు వద్ద ఆరో తేదీ అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. హత్య కావించబడిన షేక్ పెద్దబాజీ భార్యతో నిందితుడు బాలసుబ్రమణ్య చారి కి వివాహేతర సంబంధం ఉందన్నారు. దీనిపై వారి ఇరువురి మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే నిందితుడు బాజీని హత్య చేసేందుకు నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇందుకు నిందితుని అత్త రాంబాయమ్మ సహకారం అందించినట్లు తెలిపారు. 24వ తేదీన టీ స్టాల్ కి వెళుతున్న బాజీపై బాలసుబ్రమణ్య చారి కత్తితో దాడి చేశాడని, చనిపోయే వరకు పలుమార్లు శరీరంలో పొడిచాడని పోలీసులు తెలిపారు. మృతున్ని గట్టిగా పట్టుకొని రాంబాయమ్మ హత్యకు సహకారం అందించింది అన్నారు. బాజీ చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి నిందితులు పారిపోయారని పేర్కొన్నారు. మృతుని భార్య షేక్ జబీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తమ ఎస్సైలు కిషోర్, ఫాతిమాలు విచారణ చేయడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్సైలతో పాటు వారి సిబ్బంది విజయవంతమయ్యారని సిఐ సుబ్బారావు వారిని అభినందించారు.

## మారణాయుధాలతో దారుణహత్య

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 7 ప్రభాతవార్త :: నరసరావుపేట మండలంలోని ము లకలూరు గ్రామ శివారులో 55 సంవత్సరాల పర్వతాలు అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతముక్కల



అగ్రహారానికి చెందిన మృతునికి గ్రామంలోని కొందరితో కునేళ్లుగా వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాణభయంతో పర్వతాలు నకరికల్లు మండలం దేవవరం గ్రామానికి వలస వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ములకలూరు అగ్రహారం గ్రామల సమీపంలోని పొలాల్లో పర్వతాలు గడ్డిమోపు విషయానికి సంబంధించి ప్రత్యర్థి వర్గంతో వాగ్వాదానికి దిగాడు. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. కర్రలు, గడ్డపారులతో జరిగిన దాడి,ఘర్షణలో మృతుడు అక్కడికక్కడే కనుమూసాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని వారు విచారణ జరిపారు. మృతుని తరపు వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నరసరావుపేట,డిసెంబర్ 7 ప్రభాతవార్త ::రోటరీ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ ఎస్.వి. రాంప్రసాద్, నరసరావుపేట రోటరీ క్లబ్ అఫీషియల్ విజిట్ సందర్భంగా ఆదివారం చిరు వ్యాపారులకు సహాయ కార్యక్రమాలు జరిగాయి. చిరు వ్యాపారులకు గొడుగులు, మహిళలకు మూడు కుట్టుమిషన్లు అందించారు. కె.ఆర్. సీనియర్ సిటిజన్స్ హోమ్ లో ఉన్న వృద్ధులకు 20 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దిన్, సెక్రెటరీ భవనం మునీందర్ రెడ్డి, ట్రెజరర్ ఆంజనేయులు, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్లు కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, రోటరీ క్లబ్ డైరెక్టర్లు ఎస్.కె జిలాని మాలిక్, మేళ్లచెరువు సుమిత్ర కుమార్, కపిలవాయి రాజేంద్ర ప్రసాద్, కపిలవాయి రమేష్ చంద్ర దత్తు, కాకుమాను శ్రీనివాసరావు, పాశం



కృష్ణారావు, జమ్ముల రాధాకృష్ణ, సుబ్బారావు, తారా చాంద్, చేకూరి సాంబశివరావు, రాయల శ్రీనివాసరావు, దివ్వెల రమేష్ తదితరులు పాల్గొన్నారు. రోటరీ గవర్నర్ డా.ఎస్.వి.రామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలకు, కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ అనేక సేవలు చేస్తుందన్నా రు. రోటరీ సేవల్లో బాగంగా నరసరావుపేట రోటరీ క్లబ్ అనేక పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడం,చిరు వ్యాపారులకు చేయూత అందించడం జరిగిందన్నారు.విద్య, వైద్యం రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం,పట్టణంలో టవర్ క్లాక్ నిర్మాణం, పాఠశాల,కళాశాల విద్యార్థులకు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రోటరీ సేవలు అందించడం అభినందనీయమన్నారు.అలాగే రోటరీ లాంటి సేవా సంస్థల్లో యువత రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు

## రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

మాచర్ల, డిసెంబరు 7 ప్రభాతవార్త: స్థానిక శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 8వ విడత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవాసమితి అధ్యక్షులు



మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాల్లోని పిచ్చి చెట్లను, కంపచెట్లను తొలగించి శుభ్రపరిచారు. వచ్చే వారం ఆసుపత్రి ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు గోవిందరెడ్డి తెలిపారు. ఆసుపత్రి డాక్టర్ జి.దాక్షాయణి మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీసు స్టేషన్, స్కూల్స్, కాలేజీలు, స్మశాన వాటికల్లో స్వచ్ఛభారత్ నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు పి.హరిబాబు, సీహెచ్ రుక్మిణి, సుందరమ్మ, శ్రీను, వినయ్, అజయ్, ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో మెగా కంటి వైద్యశిబిరం

మాచర్ల, డిసెంబరు 7 ప్రభాతవార్త: మాచర్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా దుర్గిలోనిఇ జిలాన్ల పరిషత్ పాఠశాలలో మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దుర్గి చుట్టుపక్క గ్రామాల రోగులు భారీగా తరలివచ్చి



వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరికి డాక్టర్ జోష్న, చరితల వైద్యబృందం పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్ల ఆపరేషన్ అవసరమైన వారిని శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎలాంటి ఖర్చులు లేకుండా ఆపరేషన్ నిర్వహించి తిరిగి వారి స్వగ్రామాలకు చేర్చారు. ఆపరేషన్ జరగకముందు, జరిగిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా 3150 డిస్ట్రిక్ట్ డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ ఛైర్మన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, డాక్టర్ దశరథ్ చౌహాన్ వివరించారు. పఠాన్ నాగూర్‌వలి కన్వీనరుగా వ్యవహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ బహు మేధావి: ఏఐఎం జోనల్ ఇన్‌చార్జి మదిర శేషయ్య

గురజాల, డిసెంబరు 7 ప్రభాతవార్తః భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బహు మేధావి అని, ఆయన జీవిత చరిత్ర ప్రపంచంలోనే అరుదైన చరిత్ర అని ఏఐఎం జోనల్ ఇన్‌చార్జి



మదిర శేషయ్య అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి దాచేపల్లి పట్టణంలో ఏఐఎం జిల్లా అధ్యక్షుడు కొండవీటి కొండలవారు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యరావు, మదిర విల్సన్, పోతుల వెంకటేశ్వర్లు, వీరయ్య, కొండవీటి మస్తాన్‌రావు, ముండ్రా రామారావు, గోసు పెద్ద ఏడుకొండలు, కలుకూరి వెంకటేశ్వర్లు, గోసు శ్రీనివాసరావు, కొమ్మా కరుణాకర్, ముండ్రా శ్రీనివాసరావు, కోరె విజయశేఖర్, కండెల అంజి, ముండ్రా బాల వెంకటేశ్వర్లు, కలుకూరి పిలెన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవిద్యా హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

సత్తెనపల్లి టౌన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సత్తెనపల్లి పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ విద్యా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ కాట్రాజ్ చిరంజీవి మరియు డాక్టర్ తడవర్తి నాగ శ్రీవిద్య ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.విశేష స్పందన ఉచిత సేవలు ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈసీజీ , బిఎమ్‌డి , మరియు హెచ్‌బిఏ1సీ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేశారు. మందులను ఉచితంగా అందజేశారు.



# రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్

### రోడ్లపై మార్చ్ చేయించిన గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు ఈస్ట్ క్రైమ్, డిసెంబర్7, ప్రభాతవార్త: జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలను చేపడుతోంది. ఇందులో భాగంగా గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని లాలాపేట, ఓల్డ్ గుంటూరు, కొత్తపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సుమారు 150 మంది రౌడీ షీటర్లకు ప్రత్యేక



కౌన్సెలింగ్ నిర్వహించబడింది.అనంతరం, వారిలో చట్టబద్ధ జీవన విధానాన్ని అలవర్చేందుకు అవగాహన కల్పించేందుకు పోలీస్ పరేడ్ గ్రౌండ్-వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ -జిల్లా పోలీస్ కార్యాలయం ఎస్బీఐ బ్యాంక్ సెంటర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ మార్గంలో ప్రత్యేక మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం వలన ఎదురయ్యే చట్టపరమైన శిక్షలు, వ్యక్తిగత భవిష్యత్తుపై వచ్చే ప్రతికూల ప్రభావాలు, కుటుంబాలపై



ఏర్పడే మానసిక-ఆర్థిక భారం గురించి వివరించారు.శాంతి భద్రతలను కాపాడడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని, సమాజ అభివృద్ధికి ప్రతి పౌరుడు చట్టబద్ధతను అనుసరించడం అవసరమని సూచించారు. రౌడీ షీటర్లు జీవితాల్లో మార్పుకు అవకాశాన్ని ఉపయోగించుకుని, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఉపాధి అవకాశాలను అన్వేషించి స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రజల సహకారంతో నేరాలను అరికట్టి శాంతి వాతావరణం నెలకొల్పడమే పోలీస్ శాఖ ధ్యేయమని తెలిపారు. లాలాపేట సీఐ శివ ప్రసాద్ మాట్లాడుతూ నేర చరిత్ర చివరికి వ్యక్తిని నాశనానికి నెడుతుందని పేర్కొన్నారు. సమాజంలో గౌరవం పొందాలంటే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఇకపై నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై పీడీ చట్టం సహా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓల్డ్ గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ రౌడీ షీటర్లపై నిత్య పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రవర్తనలో మార్పులు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.చట్ట ఉల్లంఘనపై సున్నా సహనం జీరో టొలిరాన్స విధానాన్ని కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు .ఓల్డ్ గుంటూరు ఎస్సై రెహమాన్ కౌన్సెలింగ్ కి హాజరైన రౌడీ షీటర్లతో నేర ప్రవర్తనకు దూరంగా ఉండటం, సత్ప్రవర్తన పాటించడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈస్ట్ డిఎస్పీ తో పాటు లాలాపేట సీఐ శివ ప్రసాద్ గారు, ఓల్డ్ గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ , కొత్తపేట ఎస్సైలు రమేష్ , సుబ్బారావు లు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న క్విట్ ఇండియా వక్తృత్వ పోటీలు

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 7,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరసా ్వమి దేవాలయం శ్రీ పద్మావతి కళ్యాణమండపం వేదికగా సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు బృందం ఆధ్వర్యంలో భరతమాత పూజాదినోత్సవ వేడుకలు కొనసాగుతున్న క్రమంలో సాంప్రదాయ







కళల పోటీల్లో ఆదివారం ఉదయం 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు క్విట్ ఇండియా ఉద్యమం పై క్విజ్,వక్తృత్వ పోటీలు,రామాయణంలోని లక్ష్మణుడి పాత్ర పై అవగాహనా పోటీలు,కళాశాల విద్యార్థులకు,ఉపాధ్యాయులకు వక్తృత్వ పోటీలు జరిగాయి.పిడుగురాళ్ళ,కొండవీడు మరియు పలు ప్రాంతాలనుంచి పోటీల్లో పాల్గొన్నారు.సంస్థ వారు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాలు అందించారు.తొలుత జరిగిన సభలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి సలహాలను అందించారు.

## శ్రీ వెంకటేశ్వర విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య డిసెంబరు 7 ప్రభాతవార్త : విశ్వం ఎడుటెక్ వారి ఆధ్వర్యంలో ఏటి అగ్రహారంలో గల సెంట్రల్ పబ్లిక్ స్కూల్ నందు గుంటూరు జోనల్ స్థాయి అబాకస్ కాంపిటీషన్లో జరిగాయి.



ఈ కాంపిటేషన్కు జిల్లావ్యాప్తంగా సుమారుగా 45 స్కూల్స్ నుంచి 950 మందికి పైగా విద్యార్థులు హాజరవ్వడం జరిగినది. ఈ కాంపిటీషన్లోరాజీవ్ గాంధీ నగర్ ఆరో లైన్ లో గల శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్ కి చెందినటువంటి విద్యార్థినిలు జూనియర్ లెవెల్ గుంటూరు జోనల్ కాంపిటీషన్లో ధనావత్. నాగ వెంకట లాస్య భాయ్ కి ప్రథమ స్థానం లభించిందనీ శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బత్తిన మల్లికార్జునరావు తెలిపారు సీనియర్ లెవెల్ కాంపిటీషన్లో విజువలైజేషన్ లో గుంటూరు జోనల్ స్థాయిలో ద్వితీయ ర్యాంకు చల్లా నందిని సాధించి రాష్ట్రస్థాయికి అర్హత పొందారని స్కూల్ డైరెక్టర్ బత్తిన మల్లికార్జున రావు తెలియజేశారు. వీరి ఇరువురికి ఎనిమిదో తేదీ సోమవారం స్కూల్లో విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అందరి ముందు అభినందన కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా టీవీ రామిరెడ్డి

గుంటూరు విద్య డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మరియు గుంటూరు జిల్లా ఇన్చార్జి శ్రీ నాగ సాయి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ఇటీవల జిల్లా అధ్యక్ష పదవికి సయ్యద్ చాంద్ బాషా చేసిన రాజీనామాను ఆమోదించడం జరిగింది. నూతన జిల్లా అధ్యక్షులుగా టీవీ రామిరెడ్డి (వ్యవసాయ శాఖ),జిల్లా కార్యదర్శిగా వై నాగేశ్వరరావు (వైద్య ఆరోగ్య శాఖ), గుంటూరు



నగర శాఖ అధ్యక్షులుగా షేక్ కరీముల్లా షా ఖాదరి (వైద్య ఆరోగ్యశాఖ) , నగర శాఖ కార్యదర్శిగా బి.కోటేశ్వరరావు (కార్మిక శాఖ), జిల్లా ఉపాధ్యక్షులుగా వి.పెద్ద రత్తయ్య (వైద్య ఆరోగ్యశాఖ) లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడతామని ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికైన సభ్యులకు సమావేశానికి హాజరైన సభ్యులందరూ అభినందనలు తెలియజేశారు.

## సర్కిల్ కార్యాలయం, క్రోసూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

క్రోసూరు(డిసెంబర్ 7 ప్రభాతవార్తఫ సత్తెనపల్లి డివిజన్ పోలీసు అధికారి మేదరమెట్ల హనుమంతురావు ఆదివారం క్రోసూరు పోలీసులు స్టేషన్, పెదకూరపాడు సర్కిల్ కార్యాలయాలను సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ (యు.ఐ.) కేసులు, వివిధ రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, స్టేషన్ పరిసరాల శుభ్రత, భద్రతా చర్యలు, సిబ్బంది వసతులు వంటి అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.




అలాగే సర్కిల్ కార్యాలయంలో పరిపాలనా విధులు, రికార్డు సంకలన విధానం, సిబ్బంది కార్యనిర్వహణను డీఎస్పీ సమీక్షి ంచారు. పెండింగ్‌లో ఉన్న యు.ఐ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, స్టేషన్ రికార్డులను ఆలస్యం లేకుండా అప్డేట్ చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని ఇన్‌స్పెక్టర్ పి. సురేష్ ,ఎస్ ఐ పి.రవి బాబు లకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నేర నియంత్రణ, ప్రజా భద్రతను బలోపేతం చేయడం, బాధితులకు వేగవంతమైన న్యాయం అందేలా దర్యాప్తులను త్వరితగతిన పూర్తిచేయాలని డీఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.తనిఖీల అనంతరం క్రోసూరు పోలీస్ స్టేషన్, పెదకూరపాడు సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, పనితీరు, వసతులు సంతృప్తికరంగా ఉన్నట్లు డీఎస్పీ హనుమంతురావు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 10 నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

పెదకూరపాడు ,డిసెంబర్ 7, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా మాణిక్యాలను రాష్ట్రస్థాయి,కబడ్డీ,వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చి ప్రోత్స హించి వారికి ఆర్థికంగా ఊతమిచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న పెదకూరపాడు జి ఆర్ సి ఆర్ కె శ్రీచైతన్య పాఠశాల మరోమారు రాష్ట్ర స్థాయి పోటీలకు సంసిద్ధమయ్యింది. రాష్ట్ర శాప్ ఛైర్పర్సన్ రవినాయుడు పర్యవేక్షణలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో ఈనెల 10వ తేదీ నుండి 12వరకు నియోజకవర్గ





కేంద్రం పెదకూరపాడు జి ఆర్ సి ఆర్ కే శ్రీచైతన్య పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్20 క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుత్తా కవిత, రాము ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పురుషుల విభాగంలో మందడి శివరామ కాళిబాబు మెమోరియల్ వారి సహకారంతో డై నైట్ పోటీలు నిర్వహిస్తున్నామని అండర్20 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాయపూడి పాపయ్యవెంకటసుబ్బమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు పురుష, మహిళల విభాగం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల యువత తమ గట్లతో పేర్లు ఇచ్చి పాల్గొనాలని కోరారు.

## ఇతర రాష్ట్రాలకూ...రవాణా

5వ పేజీ తరువాయి

**కోట్లల్లో ఇవ్వడానికైనా సిద్ధం అంటున్న కల్తీ కారం కేటుగాళ్లు !**

2016 -2017 నుంచి ఇప్పటివరకు, విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ విభాగం వారు ఇంత దారుణంగా కల్తీకారం జరుగుతున్న చూసిచూన్నట్టు పోతున్నారు. కల్తీ కాలం వల్ల క్యాన్సర్ పేగు పూత అరుదుగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగంకల్తీ కారం పై వారు తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ప్రజల వాపోతున్నారు. కల్తీ కారం మిల్లులయజమానులపై ఐటి దాడులు తక్షణమే జరిపించాలని మరి కొందరు అభిప్రాన్నాయ పడుతున్నారు. ఇంత దారుణం చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా గేరా మోహనరావు

గుంటూరు విద్య డిసెంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిలర్ గా నకరికల్లు మండల పరిధిలోని చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గేరా మోహనరావు ను ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గా ఈరోజు ఎస్ ఎస్ ఎన్ కళాశాల ఆడిటోరియం, నరసరావుపేట నందు నిర్వహించిన ఎస్టీయూ పల్నాడు జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నందు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎస్ టి యు నకరికల్లు మండల అధ్యక్షులు సిహెచ్ వి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. గేరా మోహనరావు 1998 నుండి గత 27 సంవత్సరాలుగా ఎస్టియు సంఘంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించారని, గతంలో గుంటూరు జిల్లా అధ్యక్షులుగా పనిచేశారని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. గేరా మోహనరావు రాష్ట్ర కౌన్సిలర్ గా ఎంపిక చేయడం పట్ల నకరికల్లు మండల ఎస్టియు నాయకులు సుబ్బారావు, పరమేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేజర్ల ఉపాధ్యాయులు పి ప్రసాద్, వై సుబ్బారావు, షేక్ గౌస్, బి వెంకటరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



# ఘనంగా హిందూ సమ్మేళనం

గుంటూరు విద్య డిసెంబర్ 7 ప్రభాతవార్త : స్థానిక ఎన్జీవో కాలనీలోని మెట్టు అంజిరెడ్డి కళ్యాణ మండపంలో హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 1050 మంది హిందూ బంధువులు హాజరయ్యారు. ప్రముఖ వక్తలుగా శ్రీ స్వామీజీ మెళ్ళ చెరువు సుబ్రమణ్య శర్మ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు యామిని శర్మ, ఆర్.ఎస్.ఎస్ ఆంధ్రప్రదేశ్ మీడియా విభాగ ఇంచార్జ్ అవ్వరు శ్రీనివాస్, మరియు విభాగ్ భౌద్ధిక ప్రముఖ కలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్వామీజీ శర్మ హిందూ సమాజ ఐక్యత అవసరాన్ని ఉద్ఘాటించారు. యామిని శర్మ సమాజంలో వివక్షతలను తొలగించి సమానత, సమరసతతో జీవించాలన్నారు. కుటుంబ విలువలను పిల్లలకు అందించడంలో



మహిళల భూమిక ముఖ్యమని చెప్పారు.ఆర్.ఎస్.ఎస్ నేత శ్రీనివాస్ కులవృత్తుల్లోకి ప్రవేశిస్తున్న బయటివారి కారణంగా హిందూ జీవన విధానంపై వస్తున్న ప్రభావాలను వివరించారు. లవ్ జిహాద్ వంటి ప్రమాదాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆడకా శ్రీను, మహేశ్వరానంద, బాలస్వామి, శైలజమ్మ, చావల కోటేశ్వరరావు, అడప శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. దేవాలయాలలో మర్యాదపూర్వక దుస్తులు, శీలవంతమైన నడవడిక పాటించాల్సిన అవసరాన్ని వారు రేకెత్తించారు.చివరిగా కలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 100 ఏళ్లుగా హిందూ రక్షణలో చేస్తున్న సేవలను వివరించారు. దేశంలోనూ, విదేశాల్లోనూ సంఘ విస్తరణ హిందూ సమాజ శక్తివంతతకు సూచిక అని పేర్కొన్నారు. శాఖలు బలంగా ఉన్న చోట హిందువులు రక్షి తంగా ఉన్నారని, శాఖలు లేని ప్రాంతాల్లో సమస్యలు తీవ్రమని చెప్పారు. కార్యక్రమంలో క్విజ్, సాంస్కృతిక ప్రదర్శనలు, ఏకపాత్రాభినయం, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. చివరిలో సత్కారాలు, ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది. వేదిక నిర్వహణ డాక్టర్ రాధాకృష్ణ అంకరాజు, నాగేశ్వరరావు, ఏ.వి. రమణమూర్తి నిర్వహించగా, ప్రచార బాధ్యతలు అంకయ్య, సమన్వయం నిరంజన్ చేపట్టారు.

## పిటిఎల్‌పియు ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్లకు, లెక్చరర్‌లకు అవగాహన సదస్సు

గుంటూరు విద్య డిసెంబర్ 7 ప్రభాతవార్త : ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్ యూనియన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కె .బాబ్జి ఆధ్వర్యంలో ప్రైవేటు టీచర్లకు లెక్చరర్లకు పిఎఫ్, ఈఎస్ఐ లబ్ధి అంశాలకు సంబంధించి అవగాహన సదస్సు జరిగింది. ఈఎస్ఐ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ చెన్నకేశవరెడ్డి ఈఎస్ఐ కి సంబంధించినటువంటి పూర్తి విషయాలను అవగాహనపరిచారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ , అపుస్మ రాష్ట్ర అధ్యక్షులు కే తులసి విష్ణు ప్రసాదు, అప్స డెమోక్రటిక్ స్టేట్ ట్రెజరర్ ఎస్. శ్రీనివాసరావు, అపూస్ మా డెమొక్రటిక్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పి మస్తాన్ రావు, అపూస్మా స్టేట్ డిస్సిప్లినరి కమిటీ ఛైర్మన్ పోతిరెడ్డి ,అపూస్మ అనంతపురం సభ్యులు సంజీవరెడ్డి తదితరులు సదస్సుకు హాజరై ప్రవేట్ టీచర్లను లెక్చరర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ప్రైవేటు టీచర్, లెక్చరర్ ప్రతినెలా తప్పకుండా పిఎఫ్, ఈఎస్ఐ చందా చెల్లించుకుని తగిన లబ్ధి పొందాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో అప్స డెమొక్రటిక్ గుంటూరు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ కె జయ కుమార్, హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, పి టి ఎల్ పి యు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ టి నరహరి, సెంట్రల్ జోన్ జనరల్ సెక్రెటరీ టి శివయ్య, స్టేట్ వర్కింగ్ జనరల్ సెక్రెటరీ స్కూల్ వింగ్ ఎస్ ఎస్ కే మధు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ కే సులేమాన్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ కె నాగేశ్వరరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె కరీముల్లా, స్టేట్ జాయింట్ సెక్రెటరీ కె కోటిరెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ భాష ,స్టేట్ గౌరవ సలహాదారులు చిరంజీవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ‘వందేమాతరా’నికి 150యేళ్లు

## నేడు లోక్‌సభలో ప్రత్యేక చర్చ, పాల్గొననున్న ప్రధాని మోడీ
## రేపు రాజ్యసభలో చర్చించనున్న సభ్యులు
## ‘సర్‌’పై కూడా రేపు దిగువ సభలో విస్తృత చర్చ



బంకిం చంద్ర చటర్జీ రాసిన ‘వందేమాతరం’ గీతం 1875 నవంబరు 7న సాహిత్య పత్రిక బంగదర్శన్‌లో మొదటగా ప్రచురించబడింది.

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ‘వందేమాతరం’ 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగనుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ చర్చను ప్రారంభించనున్నారు. దేశభక్తి గీతానాకి సంబంధించిన అనేక అంశాలను మోడీ ప్రస్తావించనున్నారు. ఇది స్వాతంత్ర్య పోరాటానికి చేసిన కృషి, దాని చారిత్రక ప్రాముఖ్యత, ప్రస్తుత ఔచిత్యాన్ని కూడా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించనున్నారు. రాజ్యసభలో వందేమాతరంపై చర్చను మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశముంది. వందేమాతరం చర్చకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం లోక్‌సభలో మొత్తం 10 గంటలపాటు ఎన్‌డిఏ సభ్యులకు మూడు గంటలు కేటాయించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందుకు రాజ్యసభ సెక్రటేరియట్ పార్లమెంటు లోపల ‘వందేమాతరం’, జైహింద్ వంటి వ్యక్తీకరణలను ఉపయోగించకుండా ఉండాలన్న నోట్‌పై అధికార, విపక్ష సభ్యుల మధ్య రాజకీయ ఘర్షణ చోటుచేసుకుంది. అలాగే ఇటీవల ప్రధాని మోడీ, వందేమాతరం గీతానికి సంబంధించిన కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. ప్రధానంగా 1937లో ఫైజాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ అసలు పాట నుండి ముఖ్యమైన చరణాలను తొలగించిందని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ నిర్ణయం విభజనకు బీజాలు నాటిందని, జాతీయ గీతాన్ని ముక్కలుగా చేసిందని ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, ఈ నిర్ణయం రవీంద్రనాథ్ ఠాగూర్ సలహా మేరకు జరిగిందని, ఇతర వర్గాలు, విశ్వాసాల సభ్యుల భావాలను కాంగ్రెస్ గౌరవించింది, గౌరవిస్తోందని ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీ ఆరోపణలు తిప్పికొట్టారు. ఈ నేపథ్యంలో ‘వందేమాతరం’పై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**లేహ్, డిసెంబరు 7:** ‘సరిహద్దు రహదారులు.. జాతీయ జీవనాధారాలు’ అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. అత్యవసర సమయాల్లో సత్వరం స్పందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో రూ. 5,000 కోట్లతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పడానికి ఈ ప్రాజెక్టులే ఉదాహరణలని అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూ, కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరంలలో వ్యూహాత్మకంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులను బిఆర్ఒ నిర్మించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. మన సైనికుల శౌర్యం,ధైర్యం మనందికీ స్ఫూర్తి అని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని అన్నారు. రోడ్డు నెట్‌వర్క్, రియల్‌టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా వంటి సౌకర్యాలు మన సైనికులు మరింత వేగంగా, సమర్థంగా పని చేసేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికను వినియోగించి, సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేసినందుకు ‘బిఆర్ఒ’ను రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. సాయుధ బలగాలతోపాటు బిఆర్ఒ సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారని కితాబిచ్చారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లద్దాఖ్‌లోని దర్బుక్-శ్యోక్-దౌలత్ బేగ్ ఓల్డీ మధ్య 920మీటర్ల పొడవున నిర్మించిన సొరంగం గురించి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని కొనియాడారు. వాతావరణపరంగా ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా దీనిని నిర్మించినట్లు చెప్పారు. అంతేకాకుండా హిమపాతాల సమయంలోనూ సైన్యం ఆయుధాలు రవాణా చేసేందుకు ఇదివ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు.



# బాబ్రీ తరహా మసీదు నిర్మాణానికి బెంగాల్‌లో శంకుస్థాపన

**ముర్షిదాబాద్,డిసెంబరు 7:** టీఎంసీనుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో కట్టడం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెంగాల్‌లో బాబ్రీ మసీదు శంకుస్థాపన వ్యవహారంపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పోలరైజేషన్‌కు పాల్పడుతోందని, బాబర్ పేరుతో ఎలాంటి కట్టడాన్నయినా భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. అయితే బీజేపీ వాదనను హుమయూన్ కబీర్ తోసిపుచ్చారు. మసీదు నిర్మాణం తన హక్కు అని, తాము రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని చెప్పారు. ఎవరైనా మందిరం, చర్చి నిర్మించుకోవచ్చుని, తాను మసీదు నిర్మిస్తున్నానని చెప్పారు. రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణం చేపడతామని, అందులో ఒక ఆసుపత్రి, గెస్ట్ హౌస్, మీటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా బాబ్రీ మసీదు రెప్లికాను నిర్మిస్తామని అందులో పలు సంక్షేమసంస్థలు కూడా ఉంటాయని ముస్లిం సంస్థ ఒకటి ప్రకటించింది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా నిర్మింస్తామన్న వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని సంస్థప్రతినిధి తెలిపారు.

# పనివేళలు ముగిసాక.. ఆఫీస్ కాల్స్ స్పందించకుండా ఉండేందుకు ప్రైవేటు బిల్లు

## లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎన్సీపీ పవార్ ఎంపి సుప్రీయా సూలే



**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, వారికి మెరుగైన జీవితాన్ని అందించే లక్ష్యంతో లోక్‌సభలో ఒక కొత్త ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో వచ్చే ఆఫీస్ ఫోన్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించకుండా ఉండే హక్కును ఉద్యోగులకు చట్టబద్ధంగా కల్పించాలనేది ఈ బిల్లు ప్రతిపాదన. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభలో రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు, 2025ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా ఒక ఉద్యోగుల సంక్షేమ అథారిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న పని ఒత్తిడిని తగ్గించి, ఉద్యోగులకు మెరుగైన పనిజీవిత సమతుల్యతను కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని సుప్రియా సూలే తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఇదే తరహాలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి మరో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. భారతదేశంలో 51 శాతం మంది ఉద్యోగులు వారానికి 49 గంటలకు పైగా పనిచేస్తున్నారని, 78 శాతం మంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పరిమితం చేయడం, మానసిక ఆరోగ్యానికి మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించాలని ఆయన తన బిల్లు ద్వారా కోరారు. అయితే, ఈ బిల్లులు ప్రైవేట్ మెంబర్ బిల్లులు కావడం గమనార్హం. మంత్రులు కాకుండా ఇతర ఎంపీలు ప్రవేశపెట్టే బిల్లులను ప్రైవేట్ మెంబర్ బిల్లులు అంటారు. సాధారణంగా పార్లమెంటులో ఇలాంటి బిల్లులు చట్టరూపం దాల్చడం చాలా అరుదు. ప్రభుత్వం ఇచ్చే సమాధానం తర్వాత చాలావరకు వీటిని ఉపసంహరించుకుంటారు.

# కోల్‌కతాలో సామూహిక గీతా పారాయణం: లక్షలాది మంది హాజరు



**కోల్‌కతా, డిసెంబరు 7:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆదివారం శ్రీకృష్ణ నామస్మరణ, శంఖ నాదాలతో మార్మోగింది. చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సామూహిక గీతా పారాయణానికి లక్షలాది మంది హాజరయ్యారు. ‘సనాతన సంస్కృతి సంసద్’ అనే సంస్థ ‘ఐదు లక్షల స్వరాలతో గీతా పారాయణం’ పేరిట ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. బెంగాల్‌తో పాటు పరిసర రాష్ట్రాల ప్రజలు, వివిధ మఠాలకు చెందిన సాధువులు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చారు. దేశంలోనే ఇది అతిపెద్ద సామూహిక గీతా పారాయణమని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్, కేంద్రమంత్రి సుకాంత మజుందార్ తదితరులు పాల్గొని భగవద్గీత శ్లోకాలు పఠించారు. తర్వాత శాంతి, అహింసల గురించి మాట్లాడారు. రాష్ట్ర ఆధ్యాత్మిక వారసత్వాన్ని మరోసారి గుర్తు చేసేందుకు, పవిత్ర గ్రంథాల ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రద్దీ నిర్వహణ, భద్రత, అత్యవసర వైద్యసేవల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి 6.5 లక్షల మందికిపైగా హాజరైనట్లు బిజెపి ప్రతినిధి అమిత్ మాలవీయ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు.

# మొసాద్‌కు కొత్తచీఫ్ రోమన్ గోఫ్‌మాన్



**జెరూసలెం, డిసెంబరు 7:** ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన నిఘా సంస్థ ఇజ్రాయెల్ మొసాద్‌కు కొత్తచీఫ్ వచ్చారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గతనెల 4న తన సైనిక కార్యదర్శిని ఆదేశ నిఘా సంస్థ మొసద్ తదుపరి అధిపతిగా ఎంపికచేసారు. ఈ కొత్త అధిపతి ఎప్పుడూ నిఘా విబాగంలో లేరు. ఆయనకు ఎలాంటి నిఘా నేపథ్యంకూడా లేదు. ఈ అధిపతిపేరు మేజర్‌జనరల్ రోమన్ గోఫ్‌మాన్. గూఢచారిసంస్థ మొస్సాద్ అధిపతిగా గోఫ్‌మన్‌ను నియమించాలనే నిర్ణయాన్ని ఇజ్రాయెల్ పిఎంఒ ప్రకటించింది. ప్రస్తుత మొసాద్‌చీఫ్ డేవిడ్ బార్నియా స్థానంలో ఆయనను నియమిస్తారని వెల్లడించారు. డేవిడ్ బార్నియా ఐదేళ్ల ఎదవీకాలం జూన్ 2026లో ముగుస్తుంది. మొసాద్‌చీఫ్‌గా గోఫ్‌మన్‌పేరు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్‌సైన్యం దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లా ఆయుధనిల్వ స్థావరాలపైదాడులుచేసింది. బెలారస్‌లో 1976 లో జన్మించిన గోఫ్‌మన్ 14 ఏళ్ల వయసలో ఇజ్రాయెల్ వచ్చాడు. తర్వాత 1995లో ఇజ్రాయెల్‌సైన్యం ఆర్మర్డ్ కార్ప్స్‌లో చేరి సుదీర్ఘ కాలంగా సైనిక జీవితం కొనసాగిస్తున్నారు. 2023 అక్టోబరు ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్‌దాడి షురు చేసినపుడు గోఫ్‌మన్ ఇజ్రాయెల్ జాతీయ పదాతిదళ శిక్షణాకేంద్రం కమాండర్‌గా ఉన్నారు. గాజా సరిహద్దుకు సమీపంలోని దక్షిణ ఇజ్రాయెల్‌నగరమైన స్డెరోట్‌లో హమాస్ ఉగ్రవాదులతోజరిగిన ఘర్షణలో తీవ్రగాయాలపాలయ్యారు. తర్వాత ఏప్రిల్ 2024లో నెతన్యాహు మంత్రివర్గంలో చేరారు. ఇజ్రాయెల్‌మజత జియోనిస్ట్ ఉద్యమ సభ్యుడు డేవిడ్‌ను దేశీయభద్రతా సంస్థకు అధిపతిగా నియమించారు. నెతన్యాహు మరో సారి జాతీయవాద అభిప్రాయాలకు దగ్గరగా ఉండే వ్యక్తినే ఇజ్రాయెల్ యొక్క అతిపెద్ద నిఘా సంస్థకు అధిపతిగా నియమించుకున్నారు.

# మళ్లీ బద్దలయిన కిలవేయ అగ్నిపర్వతం



**హవాయి, డిసెంబరు 7:** అగ్రరాజ్యం అమెరికాకు చెందిన హవాయి ద్వీపంలో అత్యంత క్రియాశీల అగ్నిపర్వతాల్లో ఒకటైన కిలవేయ మరోసారి విస్ఫోటనం చెందింది. అగ్నిపర్వతం నుంచి పెద్ద ఎత్తున లావా ఉబికివస్తోంది. వెయ్యి అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతోంది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్టు అధికారులు తెలిపారు. హవాయి జాతీయ ఉద్యానవనం లోపల ఉన్న కాల్డెరాలోనే లావా నిలిచిపోయిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కిలవేయ అగ్నిపర్వతం 38 సార్లు విస్ఫోటనం చెందింది.

# గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం

## 25కు చేరిన మృతుల సంఖ్య
## రాష్ట్రపతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
## ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా
## ప్రమాదం కాదు మర్డర్: రాహుల్‌గాంధీ





**పనాజీ, డిసెంబరు 7:** గోవాలో ఓ నైట్‌క్లబ్‌లో చెలరేగిన అగ్నికీలల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బందితో సహా 25 మంది మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. గోవా రాజధాని పనాజీకి 25కిలోమీటర్ల దూరంలోని అర్పోరా గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. ఉదయం ఘటనా స్థలాన్ని సందర్శించిన బాధితులను పరామర్శించారు. నైట్‌క్లబ్ మేనేజర్‌ను అరెస్టు చేశారని, యజమానిపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని, ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించినట్లు సిఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. గవర్నర్ పి.అశోక్ గజపతిరాజు ఆదివారం ఉదయం ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం, మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సిఎం ప్రమోద్ సావంత్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేసి, ఘటనపై ఆరా తీశారు.
గోవా నైట్‌క్లబ్ ప్రమాదంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. దీనిని ‘భద్రతా పరంగా నేరపూరిత వైఫల్యం’ అని అభివర్ణించారు. ఈ విషాద ఘటన ‘ప్రమాదం కాదు, హత్య’ అని నొక్కిచెప్పారు. సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.



# జనవరిలో భారత్‌కు జెలెన్‌స్కీ

## ఆయన న్యూఢిల్లీ పర్యటనపై ప్రపంచ దేశాల ఆసక్తి

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ జనవరిలో భారత్ పర్యటనకు వస్తున్నారు. అయితే, తేదీలపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల కావలసి ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4-5తేదీల్లో న్యూఢిల్లీ పర్యటనను ముగించుకొని వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి నెలకొంది. భారత విదేశాంగ అధికారుల కథనం ప్రకారం, రాబోయే జనవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ భారత్ సందర్శనను షెడ్యూల్ చేయడానికి చర్యలు తీసుకుంటోంది. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చి వెళ్లినందున, ఉక్రెయిన్ అధ్యక్షుడి పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారుపై భారత విదేశాంగ శాఖ జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికార వర్గాలు వివరించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన నేపథ్యంలో ఇరుదేశాల అధినేతలు భారత్ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి కనబరచడం విశేషం.


# సంక్షిప్తంగా..

## రూ.8వేల చిరుద్యోగికి రూ.13 కోట్ల జిఎస్టీ బకాయి నోటీసులు



**చెన్నై, డిసెంబరు 7:** నెలకు రూ.8వేల జీతానికి పనిచేసే ఓమహిళకు రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు రావడం తమిళనాడులో కలకలంరేపింది.చిరుద్యోగినైన తనకు జీఎస్టీ నోటీసులు రావడం. అది కూడా ఏకంగా 13కోట్లు కట్టాలని అందులో పేర్కొనడంతో సదరు మహిళ నివ్వెరపోయింది. జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు ఈ విషయం బయటపడింది. తమిళనాడులోని వెల్లూర్‌జిల్లాలో చోటుచేసుకుంది ఘటన. వెల్లూర్ జిల్లాలోని గుడియతమ్ ఏరియాలోని నగల్ ప్రాంతానికి చెందిన మహాలింగం కార్ డ్రైవర్ ఆయన భార్య యశోద ప్రైవేట్ షూ కంపెనీలో పనిచేస్తోంది. షూ కంపెనీనుంచి నెలకు రూ.8వేలు జీతంగా అందుకుంటోంది. ఇటీవల జీతం డబ్బులు డ్రాచేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా ఆమె ఖాతాఫ్రీజ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఏం జరిగిందని ఆరా తీయగా యశోద జీఎస్టీ బకాయిపడిందని తేలింది.

## చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి



**కోయంబత్తూరు, డిసెంబరు 7:** తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తోట కార్మికులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటి తర్వాత తోట లోపలి భాగంలో సైఫుల్ మృతదేహాన్ని గుర్తించారు. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.

## మైనర్‌పై అత్యాచారం కేసు: న్యూజిలాండ్‌లో భారతీయుడికి ఏడేళ్ల జైలు



**వెల్లింగ్టన్, డిసెంబరు 7:** న్యూజిలాండ్‌లో భారత సంతతికి చెందిన సత్వీందర్ సింగ్ అనే క్యాబ్ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలుశిక్ష పడింది. ఇతడు 2023లో ఓ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు రుజువు కావడంతో అధికారులు నిందితుడికి జైలుశిక్ష విధించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం సత్వీందర్‌సింగ్ అనే క్యాబ్ డ్రైవర్ 11 సంవత్సరాలుగా న్యూజిలాండ్‌లో ఉంటూ క్యాబ్ నడుపుతున్నాడు. 2023లో ఒకరోజు రాత్రి మైనర్ ప్రయాణికురాలు క్యాబ్‌ను బుక్ చేసుకుంది. ఈ క్రమంలో సత్వీందర్‌సింగ్ జిపిఎస్‌ను ఆఫ్ చేసి.. కారును దారి మళ్లించాడు. అక్కడ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాధితురాలిని ఆమె స్నేహితుల ఇంటి దగ్గరవదిలేశాడు. సిసికెమెరాల ఆధారాంగా సత్వీందర్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై తాజాగా అక్కడి న్యాయస్థానం విచారణ జరిపి ఏడేళ్లకుపైగా జైలుశిక్ష విధించింది.

# ఇండియా భర్తపై పాకిస్థాన్ భార్య ప్రధాని మోడీకి ఫిర్యాదు



**ఇస్లామాబాద్, డిసెంబరు 7:** తన భర్త తనను పాకిస్థాన్‌లో వదిలేసి, రహస్యంగా ఢిల్లీలో మరో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఓ పాకిస్థానీ మహిళ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. కరాచీకి చెందిన నికితా నాగ్‌దేవ్ అనే మహిళ, తన భర్త విక్రమ్ నాగ్‌దేవ్‌పై ఈ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇండోర్‌లో దీర్ఘకాలిక వీసాపై నివసిస్తున్న పాకిస్థాన్ మూలాలున్న విక్రమ్ నాగ్‌దేవ్‌తో ఆమెకు 2020 జనవరి 26న కరాచీలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. పెళ్లైన నెల తర్వాత, ఫిబ్రవరి 26న ఆమెను భారత్‌కు తీసుకొచ్చారు. అయితే, కొన్ని నెలలకే వీసాలో సాంకేతిక సమస్య ఉందని చెప్పి, 2020 జూలై 9న అటారీ సరిహద్దు వద్ద తనను బలవంతంగా పాకిస్థాన్‌కు పంపించేశాడని ఆమె ఆరోపించారు. అప్పటి నుంచి తనను తిరిగి భారత్‌కు పిలిపించుకోవడానికి విక్రమ్ నిరాకరిస్తున్నాడని ఆమె వాపోయారు. పెళ్లై అత్తారింటికి వచ్చిన కొద్ది రోజులకే వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందని నికిత తెలిపారు. తన భర్తకు తన బంధువుల్లో ఒకరితో వివాహేతర సంబంధం ఉందని తెలిసిందని, ఈ విషయం మామగారికి చెబితే, అబ్బాయిలకు ఇలాంటివి సహజం, ఏమీ చేయలేం అని అన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఈ రోజు నాకు న్యాయం జరగకపోతే, న్యాయవ్యవస్థపై మహిళలకు నమ్మకం పోతుంది. దయచేసి నాకు అండగా నిలవండని ఆమె కరాచీ నుంచి విడుదల చేసిన వీడియోలో వేడుకున్నారు. తన భర్త ఢిల్లీకి చెందిన మరో మహిళను పెళ్లి చేసుకోబోతున్నాడని తెలియడంతో నికిత 2025 జనవరి 27న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసు మధ్యప్రదేశ్ హైకోర్టుచే అధికారం పొందిన సింధీ పంచ్ మధ్యవర్తిత్వ, న్యాయ సలహా కేంద్రం ముందుకు వచ్చింది. విచారణ అనంతరం మధ్యవర్తిత్వం విఫలమైంది. భార్యాభర్తలిద్దరూ భారత పౌరులు కానందున, ఈ కేసు పాకిస్థాన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, విక్రమ్‌ను పాకిస్థాన్‌కు బహిష్కరించాలని ఆ కేంద్రం 2025 ఏప్రిల్ 30న సిఫార్సు చేసింది. గతంలో 2025 మే నెలలో ఇండోర్ సోషల్ పంచాయితీ కూడా విక్రమ్‌ను దేశం విడిచి పంపాలని సిఫార్సు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ ఈ విషయంపై విచారణకు ఆదేశించినట్లు ధృవీకరించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



# సిఎం అభ్యర్థిగా ప్రకటిస్తే క్రియాశీల రాజకీయాల్లోకి సిద్ధూ

**చండీఘడ్, డిసెంబరు 7:** మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ తిరిగి రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్ కాంగ్రెస్ ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని సిద్ధూ సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. ఏ పార్టీకి చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని నవ్‌జోత్ కౌర్ వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. మేం ఎప్పుడూ పంజాబ్, పంజాబియత్ కోసం గళం విప్పుతామని, ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవడానికి రూ.500 కోట్లు చెల్లించే స్తోమత లేదని వ్యాఖ్యానించారు.

## డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచిన మెర్సిడిస్



**బుచారెస్ట్, డిసెంబరు 7:** కారులో వేగంగా వెళుతుండగా డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో డివైడర్ ను ఢీ కొట్టి కారు గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న బస్సు, కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. సినిమా సన్నివేశాన్ని తలపించే ఈ సంఘటన రొమేనియాలో చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డు కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రొమేనియాలోని ఒరాడియా సిటీలో 55 ఏళ్ల వ్యక్తి తన మెర్సిడస్ కారులో వెళుతుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. మధుమేహంతో బాధపడుతుండడంతో సడెన్ గా స్పృహ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి రాంగ్ రూట్ లోకి వెళ్లింది. డివైడర్ ను ఢీ కొట్టి గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న ఓ బస్సు, దాని వెనకే ఉన్న రెండు కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ ను ఎమర్జెన్సీ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

## తేజ్‌ప్రతాప్ యాదవ్ విద్యుత్ బకాయిలు రూ.3 లక్షలు



**పాట్నా, డిసెంబరు 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కుటుంబ కలహాల నేపథ్యంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. తేజ్ ప్రతాప్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు రూ.3.6 లక్షలు దాటిందని కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జూలైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3.61 లక్షలకు చేరింది.

# పూరీ జగన్నాథుడికి 60వేల ఎకరాల సొంత భూమి



**పూరి, డిసెంబరు 7:** ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథ ఆలయానికి రాష్ట్రంలో 60,426 ఎకరాల భూమి ఉండగా, మరో ఆరు రాష్ట్రాల్లో దాదాపు 400 ఎకరాల భూమి ఉందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం శాసనసభలో వెల్లడించారు. బీజేడీ ఎమ్మెల్యే సుదర్శన్ హరిపాల్ శాసనసభలో అడిగిన ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధా నంగా మంత్రి ఈ వివరాలు తెలియజేశారు. పూరిలోని ఈ 12వ శతాబ్దపు ఆలయాన్ని శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1956 ప్రకారం న్యాయశాఖ నిర్వహిస్తుంది. ఒడిశాలోని 24 జిల్లాల్లో జగన్నాథుని పేరు మీద 60,426.94 ఎకరాల భూమి ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 322.93 ఎకరాలు, మహారాష్ట్ర లో28.21 ఎకరాలు, మధ్యప్రదేశ్‌లో 25.11 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ 17.02 ఎకరాలు, ఛత్తీస్‌గఢ్ 1.7 ఎకరాలు, బీహార్‌లో 0.27 ఎకరాలతో కలుపు కుని ఇతర ఆర రాష్ట్రాలలో మరో 395.25 ఎకరాల ఆలయ భూమి ఉందని ఆయన పేర్కొ న్నారు. ప్రస్తుతం 38,061.792 ఎకరాలకు సంబంధించిన సవరించిన భూమి రికార్డులు పూరిలోని శ్రీ జగన్నాథ ఆలయ అధికారుల వద్ద ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆలయ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నట్లు అనేక కేసులు వెలుగులోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆక్రమణలో ఉన్న 169 ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు శ్రీ జగన్నాథ ఆలయ చట్టం కింద మొత్తం 974 కేసులు నమోదు చేసినట్లు ఆయన సభకు తెలియజేశారు.

8-12Pg6exHMNWJQE 10_8-12Pg6exHMNWJQE.qxd 07/Dec/25 10:55 PM Page 1



# మానవత్వానికి ప్రతిరూపం విపిఆర్ ఫౌండేషన్

**● నెల్లూరు జిల్లాలో దివ్యాంగులకు మొత్తం 1050 ట్రై సైకిళ్లు అందజేశాం ● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త-వైద్యం: వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి తమ సేవలు మరింత ఎక్కువ మందికి చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే తాము రాజకీయాలలోకి వచ్చామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ట్రై సైకిళ్ళు పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి వీపీఆర్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ హోదాలో ఆమె పాల్గొన్నారు. నెల్లూరు సిటీ పరిధిలోని 90 మందికి మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఆమె దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే రాజకీయాలలోకి వచ్చారన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ సేవలను మంత్రి నారాయణ కొనియాడారు. అనంతరం జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాలలో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవలను ప్రశంసించారు. నిస్వార్థ సేవల ద్వారా రాజకీయాలలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన వేమిరెడ్డి దంపతులు ఆదర్శప్రాయులన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 1,050 మందికి ట్రైసైకిళ్ళు అందజేశామని తెలిపారు. కంటి చూపు లేక ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన కంటి చూపు అందివ్వడం పడుతున్న వారికి మెరుగైన కంటి చూపు అందివ్వడం కోసం వీపీఆర్ నేత్ర అనే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెల్లడించారు. వీపీఆర్ నేత్ర ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకానికి పోటెత్తిన అయ్యప్ప భక్తులు

**● పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట**



కాణిపాకం, డిసెంబరు 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం అయ్యప్ప భక్తుల రద్దీతో శబరిమలను తలపిస్తోంది. కాణిపాకం ఆలయంతో పాటు పరసరాలన్ని అయ్యప్ప భక్తులతో కిటకిటలాడాయి. దేవస్థానం వాహన పార్కింగ్ స్థలాలన్ని అయ్యప్ప భక్తుల వాహనాలతో కిటకిటలాడాయి. కార్తీకమాసం సందర్భంగా శబరిమల ఆలయంలో స్వామివారి దర్శనాలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్ష భక్తులు శబరిమల దర్శనం కోసం పెద్దఎత్తున తరలివెళుతున్నారు. శబరిమల దర్శనంకు వెళ్ళే అయ్యప్పభక్తులు ముందుగా విఘ్ననాయకుడైన కాణిపాకం వినాయకునికి దర్శించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా అయ్యప్ప భక్తులు కాణిపాకం స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. అలాగే సాధారణ భక్తులు కూడా ఆదివారం సెలవు రోజు కావడం వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో విపరీతమైన రద్దీ నెలకొంది. అలాగే దేవస్థానంలో ఆలయ పాలక మండలి ఆత్మీయ అభినందన సభ జరగడంతో పాలకమండలి సభ్యుల బంధు మిత్రులు పెద్దఎత్తున కాణిపాకం తరలివచ్చారు. అయ్యప్ప భక్తులు వేకువజామున నుండి స్వామి దర్శనంకోసం క్యూలైన్లలో బారులు తీరి నిలబడ్డారు. ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు పూర్తిగా నిండిపోవడంతో ఆలయం వెలుపల భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో గంటల తరబడి వేచివుండడం గమనార్హం. అలాగే అయ్యప్పభక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పార్కింగ్ స్థలాలు, పరిసరాలన్ని నిండిపోయాయి. అంచనాలకు మించి భక్తులు ఆలయ దర్శనార్థం తరలిరావడంతో వారికి త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించడం దేవస్థానం అధికారులకు తలకుమించిన భారంగా తయారైంది. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలుస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భక్తులందరికి త్వరితగిన స్వామి దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

# మతమార్పిడులపై దర్యాప్తు జరిపించండి

**- ప్రభుత్వానికి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి**

**- డబ్బు ఆశ చూపి పాల్పడుతున్నారని ఆరోపణ**



విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: హిందు మతంపై కుట్రలు జరుగుతున్నాయని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేసారు. గత రెండు దశాబ్దాల జరుగుతున్న మత మార్పిడులపై విచారణ చేయాలన్నారు. ధర్మం కోసం హిందువులంతా ఐక్యంగా ఉండాలని పిలుపును ఇచ్చారు. దేశం కోసం ధర్మం కోసం హిందువుల్లో ఉన్న అన్ని సామాజిక వర్గాలు ఒక్కటవ్వాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేసారు. అదే భారతదేశానికి రక్ష .. శ్రీరామ రక్ష అని తెలిపారు. ఈ మేరకు ఆదివారం విజయసాయిరెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా హిందూ మతంపై ఈ వ్యాఖ్యలు చేశారు. హిందూ మతంపై కుట్రలు జరుగుతున్నాయన్నారు, వాటిని సహించేది లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డబ్బు ఆశ చూపించి మతమార్పిడులకు పాల్పడే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో, రాష్ట్రం జరుగుతున్న మతమార్పిడులపై ప్రభుత్వం ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రలోభాలకు గురిచేసి మతాలను మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సాయిరెడ్డి తాజా ట్వీట్‌పై రాజకీయవర్గాల్లో చర్చకు తెర తీసింది. ఏదో ఒక పార్టీలో చేరే ఉద్దేశ్యంతోనే మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.



# పొర్లుకట్ట వాసుల కోరిక నెరవేర్చిన పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త-వైద్యం: 48వ డివిజన్ ప్రజల చిరకాల కోరికను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెరవేర్చారు. డివిజన్లో పర్యటించినప్పుడు స్థానిక ప్రజలు 40 ఏళ్లుగా ప్రహరిగోడ, డ్రైన్ సమస్యగా ఉందని మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి నారాయణ ప్రహరి గోడతో పాటు, డ్రైన్ నిర్మాణం చేపడతామని శనివారం హామీ ఇచ్చారు. 24 గంటలు తిరక్కముందే నిధులు మంజూరు చేసి ఆదివారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను శరవేగంగా చేపట్టాలని నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు మంత్రి సూచించారు. తమ చిరకాల కోరిక నెరవేరబోతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్లు తహసీన్, రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు పాల్గొన్నారు.

# నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలి

**- ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్**

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని.. వారిపై పనిభారం తగ్గించాలని ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు.

ఆదివారం ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని గాంధీనగర్ ఏపీ ఎన్జీవో హోమ్‌లో జరిగింది. కార్యక్రమానికి ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీవో అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటూ చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. వారికి న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు, వేతన సవరణలపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.ఎస్.సాయిరాం, అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. ఇక ఆల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా వి.ఎస్.సాయిరాం (ఎన్‌టిఆర్), అధ్యక్షుడుగా ఎన్.చంద్రశేఖర్ (విశాఖ), సహాధ్యకుడుగా వి.శ్రీనివాసరావు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా సిహెచ్.వీర వెంకయ్య (ఏలూరు), జి.శ్రీనివాసరావు (అనకాపల్లి), జి.నాగేశ్వరరావు (నెల్లూరు), కె.బాబూరావు (మన్యం), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.బాలరాజు (కృష్ణా), ప్రచార కార్యదర్శిగా జి.గౌరి నాయుడు (పార్వతీపురం), సంయుక్త కార్యదర్సులుగా కె.శ్రీనివాసరావు (గుంటూరు), ఎం.బాలస్వామి (కర్నూలు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డిఎస్ఎన్ రెడ్డి ప్రకటించారు సహాయ ఎన్నికల అధికారిగా డి.రమేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జానకి, ఎన్‌టిఆర్ జిల్లా సహాధ్యక్షులు వివి ప్రసాద్, కోశాధికారి బి.సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, వివిధ జిల్లాల నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# రామగుండం థర్మల్ మూసివేత

హైదరాబాద్, నవంబరు 7 ప్రభాతవార్త: దాదాపు ఐదు దశాబ్దాలుగా తెలంగాణకు సేవలందించిన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ మూసివేశారు. రాష్ట్రంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండం థర్మల్ స్టేషన్‌ను అధికారులు పూర్తిగా మూసివేశారు. 1971 అక్టోబర్‌లో యుఎస్ఎఐడి సహకారంతో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ ప్లాంట్ మొత్తం 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన ఈ ప్లాంట్ జీవితకాలం ముగిసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు ప్రభావిత జిల్లాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా సేవలు అందించిన ఈ థర్మల్ స్టేషన్ తాజాగా మూతపడటంతో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

# స్క్రబ్ టైఫస్ కలకలం కృష్ణా జిల్లాలో ఒకరు మృతి

**● 6,678 మంది అనుమానిత కేసులకు పరీక్షలు... 1317మందికి పాజిటివ్**

**● అంటువ్యాధి కాదు, అప్రమత్తంగా ఉంటే చాలు: వైద్యులు**

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ మహమ్మారి కలకలం రేపుతోంది. ఈ వ్యాధి శోకి ఏడుగురు మరణించినట్లు సమాచారం. ఇది అంటువ్యాధి కాదని, సకాలంలో గమనిస్తే సాధారణ వైద్యంతో నయమవుతుందని వైద్యులు అంటున్నారు. ఈ స్క్రబ్ టైఫస్ వ్యాధిని కలిగించే కీటకం ఎక్కువగా గ్రామీణ పరిసర ప్రాంతాల్లో ఉంటుంది. ఇది కుట్టిన ప్రాంతంలో చిన్న మచ్చలాగా ఏర్పడి దురద పెడుతుంది. ఆ తర్వాత జ్వరం వస్తుంది. ఈ లక్షణాలను గుర్తించి వెంటనే చికిత్స తీసుకుంటే నయం అవుతుంది. ఇది ప్రాణాంతకమైనది కాదు. మా దగ్గర ఈ వ్యాధికి సంబంధించిన పరీక్షలు అన్నీ చేసి చికిత్స అందిస్తున్నాం. ఇది నల్లిని పోలిన చిన్న కీటకమే స్క్రబ్ టైఫస్ రికెట్సియా కుటుంబానికి చెందిన ఓరియంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ అనే కీటకం వస్తుంది.

గత 15 రోజుల్లో శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు కేసులు బయటపడ్డాయి. దీని బారిన పడి మృత్యువు ఒడిలోకి చేరినవారు ఎంతోమంది ఉన్నారు. స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనుషుల నుంచి మనుషులకు ఈ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా, కీటకం కాటుకు గురైన వ్యక్తి అస్వస్థతకు గురవుతారు. అందుకే తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తడి నేలలు, పొలాలు, తోటలు, పొదలు, పశువుల పాకలు, వ్యర్థాలు పోగుచేసే ప్రాంతాల్లో పని చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి చేతులు ఉన్న చొక్కా, ప్యాంట్లు, కాలికి సాక్సులు, బూట్లు తప్పనిసరిగా ధరించాలి. ఇళ్లలో పాత మంచాలు, పరుపులు, దిండ్లలోకి ఈ కీటకాలు చొరబడే అవకాశం ఉన్నందున వాటిని ఎప్పటికప్పుడూ మార్చాలి. లేదంటే శుభ్రం చేసిన తర్వాతే వాడితే మంచిది. పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున, కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. వారి పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరుబయట ఆటలాడే సమయంలోను కూడా అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ తీవ్రత జనవరి 1 నుంచి నవంబర్ 26 వరకు 6,678 మంది అనుమానిత కేసులకు పరీక్షలు చేశారు. వీరిలో 1,317 మందిని పాజిటివ్ కేసులుగా గుర్తించారు. తాజాగా కృష్ణా జిల్లాలో ఓ వ్యక్తి మరణించాడు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకర్ రాజు జ్వరం, వాంతులు రావటంతో మచిలీపట్నం, విజయవాడలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. అప్పటికి ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేకపోవడంతో అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్లారు. ఆ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు తీసుకుంటూ ఈ నెల నాలుగో తేదీన మృతి చెందారు. అయితే హెచ్ఐపి పోర్టల్‌లో శివశంకర్ రాజు స్క్రబ్ టైపస్ వ్యాధి ఉన్నట్లు శనివారం నమోదు చేశారు. కానీ ఇతను కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందినట్లు కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి పి.యుగంధర్ తెలిపారు.




# నేటి విజయ వీచిక... భవిష్యత్తుకు కరదీపిక

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: చరిత్ర గతానికి అద్దం.. వర్తమానానికి పాఠం! మనం ఎంత చేసినా.. మరింత అభివృద్ధికి ఎప్పుడూ చోటు ఉంటూనే ఉంటుందని.. అందుకే దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని వినూత్నంగా ఎదుర్కొంటూ విజయ తీరాలకు చేరిన తీరు, సూచనల సమాహారంతో విజయ వీచిక పేరుతో డాక్యుమెంటును రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ఈవో వీకే శీనా నాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి వీసీ హాల్‌లో విజయ వీచిక.. అభ్యాస దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... శాఖల మధ్య పటిష్ట సమన్వయం, 36 ప్రత్యేక సెక్టార్లు, సాంకేతికతతో అనుసంధానం, గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా దసరా ఉత్సవాలను విజయవంతం చేయగలిగామని.. ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్నామని పేర్కొన్నారు. ఈ అనుభవం భవిష్యత్తు ఉత్సవాలకు రిఫరెన్స్‌గా ఉండాలనే ఉద్దేశంతోనే సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో విజయ వీచిక పేరుతో పుస్తకాన్ని వెలువరించినట్లు కలెక్టర్ లక్ష్మీ శ వివరించారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. విజయ వీచిక పుస్తకం భవిష్యత్తులో జరిగే ఉత్సవాలకు భద్రతతో పాటు వివిధ ఏర్పాట్లకు సంబంధించి సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగపడుతుందన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ మాట్లాడుతూ... భవిష్యత్తు ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఈ విజయ వీచిక పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏపీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ డీసీ డా. జె.సుమన్, కలిమిశ్రీ గ్రాఫిక్స్ అధినేత, మల్లెతీగ కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో జాప్యం

**టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా పట్టుకోవడంలో ఆలస్యం?**

**కాజులూరు సర్కిల్ పోలీసులపై ఆరోపణలు**



ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబరు 7 (ప్రభాతవార్త): దర్జాగా ఇంట్లోకి దొంగలు జొరబడి విలువైన వస్తువులు చోరీ చేసి వెళ్ళిపోయారు. రోజులు గడుస్తున్నా సరే పోలీసులు కేసును దర్యాప్తు చేయడంలో జాప్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం పెద్ద వీధిలో ఉన్న నేతి భగవాన్ ఇంట్లో గత నెల 29న శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం పగలగొట్టి ఇంటి లోపలి ప్రవేశించి ల్యాప్ టాప్, హుందాయ్ వెన్యూ ఏపీ 39 కేబి 3736 నెంబర్ గల నీలి రంగు కారును దొంగిలించుకు పోయారు.

నాడు అందిన ఫిర్యాదు మేరకు దొంగిలించుకు పోయినట్లు వచ్చిన ఫిర్యాదు పై గొల్లపాలెం పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 144/2025 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా రూరల్ సీఐ చైతన్య కృష్ణ పర్యవేక్షణలో క్లూ టీం సీఐ పి.శ్రీనివాస్ బృందం నేర స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లుగా ఎస్సై మోహన్ కుమార్ అప్పట్లో తెలిపారు. కాగా రోజులు గడుస్తున్నా నేటికీ ఎలాంటి చర్యలు పోలీసులు చేపట్టినట్లు లేదని ఆరోపణలు ఉన్నాయి. టెక్నికల్‌గా లాప్‌టాప్ కూడా దొంగల చేతిలో ఉన్నా... లొకేషన్ లేదా ఇతరత్రా పద్ధతుల ద్వారా చోరీ సొత్తును కనుగొనడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అంటున్నారు. పైగా కారు కూడా చోరీకి గురికాబడింది. ఇన్ని టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా సరే... పోలీసులు కేసు దర్యాప్తు జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

# కురబల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**● శ్రీకనకదాస జయంతి వేడుకల్లో రాష్ట్ర బిసి సంక్షేమ మంత్రి సవిత**



వి.కోట, డిసెంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న కురబ కులస్తుల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం వి.కోటలో కురబ కులస్తుల ఆరాధ్యదైవం శ్రీ కనకదాస జయంతి కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన త ండ్రి కాలం నుంచి నేటి వరకు సుమారు పద్నాలుగు మంత్రి పదవులను తెదేపా ప్రభుత్వం కురబలకు అంది ంచడం గర్వకారణమన్నారు. ప్రతి కురబ కులస్తులు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మెరుగైన స్థానాలకు చేరుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కురబ కులస్తులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిసిల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కురబకులస్తులు నమ్మకానికి ప్రతీక అని కురబలు తెదేపా అభ్యున్నతికి దోహదపడుతున్నారన్నారు. కురబలకు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవి సైతం నియోజకవర్గంలో కేటాయించామన్నారు. కర్ణాటక మాజీ మంత్రి వర్తూర్ ప్రకాష్ మాట్లాడుతూ కురబలు ఐకమత్యంతో ముందుకుసాగాలని సూచించారు. అనంతరం కురబకులస్తులు సంప్రదాయ రీతిలో తలలపైటెంకాయలు పగలగొట్టుకునే కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఈసందర్భంగా వి.కోటలో పెద్ద ఎత్తున పాల కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కురబ సంఘ అధ్యక్షుడు ఎంసి కృష్ణప్ప, ప్రధాన కార్యదర్శి అమర్ గౌడ్, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్‌గౌడ్, ధీరజ్, పెద్ద ఎత్తున కురబ సంఘ నేతలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలు


తిరుపతి, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో భగవద్గీత కంఠస్థ పోటీలు ఆదివారం ఉదయం నుండి జరిగాయి. టిటిడి విద్యాసంస్థలతోపాటు తిరుపతిలోని విద్యాసంస్థల విద్యార్థినీవిద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భగవద్గీత 14వ అధ్యాయం 6నుండి 9వ తరగతి విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులకు 16వ అధ్యాయం దైవాసురసంపద్విభాగయోగంపై పోటీలు చేపట్టారు. 18-45 ఏళ్ల వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణ అంశంపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సనాతన హిందూ ధర్మంపై మరింతగా చైతన్యం కలిగించుకునేలా దోహదపడింది.



11_8-12P g7exHMNWJQE.qxd 08/Dec/25 12:23 AM Page 1



## ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు తాపీ ధర్మారావు పురస్కారం



విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు తాపీ ధర్మారావు నాయుడు పురస్కారం లభించింది. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం గుంటూరు బ్రాడీపేటలోని కొరటాల సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి పుప్పాల శ్రీరామ్ సభకు అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు బండికల్లు జమదగ్ని, ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు నాయుడు పేరిట ఏర్పాటు చేసిన స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు అందజేశారు. తాపీ ధర్మారావు సాహిత్య ప్రతిభను సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు వివరించారు. పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు సాహిత్య ప్రస్థానాన్ని సాహితీ వేత్త ఎస్.ఎమ్. సుభానీ సభకు తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి పొందిన కథలను విశిష్ట అతిథి శిరంశెట్టి కాంతారావు విశ్లేషించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ, విశాఖ సంస్కృతి పత్రిక సంపాదకులు శిరేల సన్యాసి రావు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం కథల పోటీ విజేతలు నందిరాజు పద్మలతా జయరాం, వాడపల్లి పూర్ణ కామేశ్వరి, కైకాల సుమలతలను నగదు పురస్కారాలతో జమదగ్ని కుటుంబ సభ్యులు సత్కరించారు. వివిధ రంగాలలో సేవలందించిన వడ్రాణం హరిబాబు, డాక్టర్ గాజుల రామకృష్ణ, డాక్టర్ నెల్లూరి బ్రహ్మయ్య, నారదాసు శ్రీహరిరావు, బండ్లమూడి గాంధీ, బిళ్ళా అశోక్, మిరియాల గోపీ కుమార్, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, ఉప్పు వెంకట రత్తయ్యలను స్ఫూర్తి పురస్కారాలతో సత్కరించారు. సభా ప్రారంభంలో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. నగరానికి చెందిన కవులూ, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శి, ధర్మ స్థాపనకు దిక్సూచి

- ఎపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఉడిపి పుట్టిగే మఠంలో పవన్ కళ్యాణ్‌కు 'అభినవ కృష్ణ దేవరాయ' బిరుదు
- పీఠాధిపతి సుగుణేంద్ర స్వామీజీ చేతుల మీదుగా సత్కారం
- ఐన్‌స్టీన్ నుంచి ఓపెన్‌హైమర్ వరకు ఎందరో ప్రపంచ మేధావుల ఆలోచనలను గీత శతాబ్దాలుగా ప్రభావితం చేస్తోంది
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే 21 స్థానాల్లో పోటీ చేశానన్న పవన్ వ్యాఖ్య

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: భగవద్గీత సందేశం మన చర్యలకు మార్గనిర్దేశం చేసి, సమాజాన్ని బలోపేతం చేసి, జాతీయ స్ఫూర్తిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కన్నడ నాట ఆయనకు అరుదైన గౌరవం లభించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉడిపిలో ఆయనకు అభినవ కృష్ణ దేవరాయ అనే బిరుదును ప్రదానం చేశారు. కర్ణాటకలోని ఉడిపి పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బృహత్ గీతోత్సవ కార్యక్రమంలో మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీ ఈ బిరుదును పవన్ కల్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, భగవద్గీత ప్రాముఖ్యత, ధర్మం, తన రాజకీయ ప్రయాణం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి తాను ఉప ముఖ్యమంత్రిగానో, ప్రజాసేవకుడిగానో రాలేదని, ధర్మాన్ని అన్వేషించే ఒక వినయపూర్వక సాధకుడిగా మాత్రమే వచ్చానని పవన్ స్పష్టం చేశారు. సరైన పాలన, సేవ, బాధ్యతలతో కూడిన ప్రతి చర్యే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తాను కూడా అర్జునుడిలాంటి సందిగ్ధతను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే రాష్ట్ర సమగ్ర శ్రేయస్సే ముఖ్యమని, ధర్మాన్ని అనుసరించే కేవలం 21 స్థానాలకే పరిమితమయ్యానని వివరించారు. భగవద్గీత అనేది కేవలం ఒకసారి చదివి, ఎర్ర వస్త్రంలో చుట్టి పూజాగదిలో పెట్టే గ్రంథం కాదని పవన్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి నిర్ణయంలో, ప్రతి గందరగోళంలో, ప్రతి అంతర్గత పోరాటంలో గీత మనతోనే నడుస్తుందని, మన కురుక్షేత్రాల్లో స్థిరమైన తోడుగా నిలుస్తుందని తెలిపారు. నేటి తరం యువత నిరంతరం సమాచార వెల్లువ, కెరీర్ ఒత్తిడి, గుర్తింపు సంక్షోభం, వైఫల్య భయాలు వంటి ఆధునిక కురుక్షేత్రాలను ఎదుర్కొంటోందని, వారికి అత్యంత అవసరమైన మానసిక బలం, భావోద్వేగ నిలకడను గీత అందిస్తుందని అభిప్రాయపడ్డారు. మన కర్మభూమి ఎన్నో దండయాత్రలను తట్టుకుని నిలబడింది ఆయుధాలు లేదా సంపదతో కాదని, ధర్మాన్ని సజీవంగా ఉంచిన గ్రంథాలు, సంప్రదాయాలు, సాధువులు, పవిత్ర సంస్థల వల్లేనని పవన్ ఉద్ఘాటించారు.

ఐన్‌స్టీన్ నుంచి ఓపెన్‌హైమర్ వరకు ఎందరో ప్రపంచ మేధావుల ఆలోచనలను గీత శతాబ్దాలుగా ప్రభావితం చేస్తోందని గుర్తు చేశారు. ఉడిపి వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు సమావేశమైనప్పుడు వసుధైక కుటుంబం అనే ప్రాచీన భారతీయ దార్శనికతకు జీవం పోస్తారని, ఇదే నేడు ప్రపంచానికి భారత్ అందిస్తున్న సందేశమని వివరించారు. జగద్గురు మధ్వాచార్యుల శాశ్వత వారసత్వం ద్వారా మన ఆధ్యాత్మిక సంపదను కాపాడిన వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

శ్రీకృష్ణుడు కొలువైన, ముఖ్యప్రాణ హనుమంతుడు శాశ్వత సంరక్షకుడిగా నిలిచిన, జగద్గురు మధ్వాచార్యులు తన జ్ఞానంతో ఎందరినో చైతన్యపరిచిన పవిత్ర భూమి ఉడిపి. మన నాగరికతకు ఆత్మలాంటి భగవద్గీత సందేశాన్ని జరుపుకునేందుకు భక్తులతో కలవడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.

సుగుణేంద్ర తీర్థ స్వామీజీ దార్శనిక మార్గదర్శకత్వంలో ఈ పవిత్ర భూమి చారిత్రక ఆధ్యాత్మిక ఉద్యమాలకు సాక్షి గా నిలుస్తోందని పవన్ ప్రశంసించారు. కోటి భగవద్గీత చేతిరాత ప్రాజెక్టు నుంచి లక్ష కంఠ పారాయణం వరకు చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. ఈ పవిత్ర భూమి భారతదేశపు ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని ఆయన అభివర్ణించారు. శ్రీకృష్ణుడు నిత్యం కొలువై ఉండే ఈ నేలపై అడుగుపెట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. బృహత్ గీతోత్సవం శుభ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు కోరుకోవడానికి ఇక్కడికి వచ్చానని తెలిపారు.



భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇఒ

## త్వరితంగా భవానీ దీక్షల ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 7 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 15 వరకు జరగబోయే శ్రీ భవానీ దీక్షల విరమణల కోసం త్వరితంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇఒ వికె శీనానాయక్ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఇఒ ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరుముడి పాయింట్లు, క్యూలయిను ,, కేశఖండన శాల, తదితర ఏర్పాట్లను పరిశీలించిన తరువాత పలు సూచనలు చేశారు.

## అర్బన్ ప్రాంతాల సదుపాయాలతో 359 రూర్బన్ పంచాయతీలు!

### రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం

- క్లస్టర్ విధానం రద్దు... మూడు కేటగిరీలుగా పంచాయతీల విభజన
- రూర్బన్ పంచాయతీల కార్యదర్శులుగా ఎంపిడిఓలు




విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో అర్బన్(పట్టణ) ప్రాంతాల తరహా సదుపాయాలతో 359 రూర్బన్ పంచాయతీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పది వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షికాదాయం కలిగిన పంచాయతీలను రూర్బన్‌లుగా మార్చాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. వచ్చే నెలలో దీనికి మార్గదర్శకాలు వెలువడనున్నాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో రూర్బన్ పంచాయతీల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా క్లస్టర్ విధానం రద్దు చేసి ఒక స్పెషల్‌తోపాటు మరో మూడు కేటగిరీలుగా పంచాయతీలను విభజించారు. దీని ప్రకారం స్పెషల్ పంచాయతీలే రూర్బన్‌గా మారనున్నాయి. డిప్యూటీ ఎంపీడీవోలు పలువురిని రూర్బన్ పంచాయతీల్లో కార్యదర్శులుగా నియమించనున్నారు. నిబద్ధత, నిజాయతీ గల 359 మందిని ఎంపిక చేయనున్నారు. పంచాయతీలు అంటే అక్రమ వసూళ్లకు, అడ్డగోలు పనులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి వార్షిక ఆదాయం ఎక్కువ ఉన్న పంచాయతీల్లో ఇలాంటివి ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. దాంతో డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేస్తున్న అదేవిధంగా పదోన్నతులను పొందిన వారిలో నుంచి రూర్బన్ పంచాయతీలకు కార్యదర్శులుగా ఎంపిక చేయనున్నారు. రూర్బన్ పంచాయతీలపై పర్యవేక్షణకు ప్రాంతీయ అధికారులను నియమించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మూడు, నాలుగు ఉమ్మడి జిల్లాలకు ఒక అధికారిని నియమించనున్నారు. జెడ్పీ సీఈవో క్యాడర్ స్థాయి అధికారులను ప్రాంతీయ పర్యవేక్షణాధికారులుగా నియమించే అవకాశం ఉంది. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురంలో ప్రాంతీయ కార్యాలయాలు ఉంటాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు ప్రాంతీయ అధికారులు జవాబుదారీగా సైతం ఉంటారు. ప్రజల సేవలకు రూర్బన్ పంచాయతీల్లో పురపాలికల తరహాలో కొత్తగా నాలుగు విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ప్రజారోగ్య విభాగం ద్వారా శానిటేషన్ పనులకుగాను దాదాపు 1025 మంది కార్మికుల సేవలను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా వీరితో ఇళ్ల నుంచి చెత్త సేకరణతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయించనున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ నుంచి సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ వరకు ప్రజారోగ్య విభాగానిదే బాధ్యతగా ఉంటుంది ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. పాడైన రహదారులకు మరమ్మతులు, కొత్తవి నిర్మాణం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో పనులను నిర్వహిస్తారు. మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ బాధ్యత కూడా ఇంజినీరింగ్ విభాగానికే ఉంటుంది. గ్రామీణ ప్రణాళికా విభాగం ద్వారా కొత్త నిర్మాణాలకు అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాల నియంత్రణ వంటివి ప్లానింగ్ కార్యదర్శి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. రూర్బన్ పంచాయతీలకు ప్రత్యేకంగా బృహత్తర ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్) రూపొందించనున్నారు. ప్రణాళికా బద్ధంగా పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. రెవెన్యూ విభాగం ద్వారా ప్రజల నుంచి ఆస్తి పన్నుల వసూలు, అదే విధంగా కొత్త నిర్మాణాలకు విధిగా పన్నును విధించనున్నారు. పన్నేతర ఆదాయపు వసూళ్లు సక్రమంగా చేపట్టడం, దీంతో పాటు ఆదాయం పెరిగేలా చూడటం ఈ విభాగ ప్రధాన ఉద్దేశం. పన్నుల వసూళ్లలోనూ పారదర్శకత కోసం ఆన్‌లైన్ చెల్లింపులు చేయనున్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లను కూడా జారీ చేయనున్నారు.



## మా పెళ్లి రద్దు చేసుకున్నాం!

### స్మృతిమంథాన, పలాశ్‌మచ్చల్ ఇన్‌స్టాలో వెల్లడి

ముంబయి, డిసెంబరు 7: భారత స్టార్ మహిళాక్రికెటర్ స్మృతి మంధాన వివాహం రద్దయింది. ఆమే ఈ సమాచారం స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌స్టోరీలోప్రకటించారు. వివాహ సందర్భంగా జరిగిన ముందస్తు వేడుకల్లో స్మృతి త్రండి అస్వస్థతకు గురికావడం ఆపై రకరకాల పుకార్లు వ్యాపించడంతో పెళ్లిని తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లుప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్‌ముచ్చల్‌తో నవంబరు 23న జరగాల్సిన పెళ్లి అనుకోని కారణాలవల్ల వాయిదాపడింది. అయితే పెళ్లిపూర్తిగా రద్దయిందని తాజాగా ఆదివారం ఆమె తెలిపారు. మరోవైపు ఆమెను వివాహమాడాల్సిన పలాశ్ మచ్చల్‌కూడా తన పెళ్లిరద్దుగురించి ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించారు. గత కొన్ని వారాలుగా నా జీవితంచుట్టూ చాలా ఊహాగానాలుసాగాయని, ఇలాంటి సమయంలో మాట్లాడటం ఎంతో అవసరమని, నాగురించి అన్న గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తినని కానీ వివాహం రద్దయిందని స్పష్టంచేయాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారరు. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని అభ్యర్థించారు. దేశాన్ని అత్యున్నతస్థాయిలో ఉంచేందుకు ముందుకు సాగు తానన్నారు. భారత్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడిట్రోఫీలు గెలుస్తానని తనకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలని స్మృతి తన ఇన్‌స్టా స్టోరీలో చెప్పారు. అలాగే పలాశ్‌కూడా తన జీవితంలో ముందుకువెళ్లాలని నిశ్చయించుకున్నానని, వ్యక్తిగత సంబంధంనుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆధారాలేన్ని వదంతులు సులువుగా నమ్మేవాళ్లనిచూసి తట్టుకోవడంకష్టంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. నాప్రతిష్టకు భంగం కలిగించే తప్పుడు సమాచారం వ్యాప్తిచేసినవారిపై మా లీగల్‌టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్టసమయంలో నాపక్షాన నిలిచినవారికి ధన్యవాదాలని పలాశ్ తన స్టోరీలో చెప్పుకొచ్చారు.



## ఫార్మా, ఐటీకి హబ్‌గా ఎపి

### రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఫార్మా, ఐటీకి.. హబ్‌గా ఏపీ మారబోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి కార్యక్రమాల కోఆర్డినేషన్‌కు ఒక వార్ రూమ్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో మాధవ్ పర్యటించారు. అనంతరం మీడియాతో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాలకు మొదటి రోజున మధ్యప్రదేశ్ సీఎం మోహన్ సింగ్, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించామని తెలిపారు. వాజ్‌పేయి స్మృతివనం నిర్మిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి పాలనకు వాజ్‌పేయి ఒక నిదర్శనంగా ఉంటారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధికి వాజ్‌పేయి ఆద్యుడని వ్యాఖ్యానించారు. ఏపీ పురోగతి చెందడానికి, దేశంలోనే ప్రథమ స్థానానికి రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. రాయలసీమను ఒక పవర్ హౌస్‌గా అభివృద్ధి చేయనున్నారని చెప్పుకొచ్చారు. టెలికాం అత్యంత చౌకగా ఉండటానికి కారణం వాజ్‌పేయి అని తెలిపారు. ఈ నెల 11వ తేదీన ధర్మవరంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## డివైడర్ ఢీకొని ఇద్దరు మృతి

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేందుకు కారులో బయలుదేరిన నలుగురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన శ్రీపతి వెంకటరెడ్డి కుమారుడు అశ్రిత్‌రెడ్డి (22), చెంగిచెర్లకు చెందిన సురేష్ కుమారుడు బాలాజీ మణికంఠ శివసాయిపటేల్ (22), శ్రీకాంత్, రాహుల్ స్నేహితులు. నలుగురు కలిసి కారులో మల్కాజ్‌గిరి నుంచి ఉప్పల్ వైపు క్రికెట్ ఆడేందుకు క్రికెట్ కిట్లతో కలిసి తెల్లవారుజామున వెళుతున్నారు. ఈ క్రమంలో లాలాపేట్ మౌలాలి ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే పొగమంచు కారణంగా కారు నడుపుతున్న యువకుడికి ఏమి కనిపించలేదు. దీంతో డివైడర్‌ను వేగంగా ఢీకొట్టాడు. కారు నుజ్జునుజ్జు కాగా అశ్రిత్‌రెడ్డి, శివసాయిపటేల్ మృతి చెందారు.



## యధేచ్ఛగా కారం కల్తీ

## 200 మిల్లుల్లో తయారీ

### ప్రజల ఆరోగ్యంతో కల్తీరాయుళ్ల చెలగాటం



- నిఘా వర్గాలకు కనిపించని మిల్లుల నిర్వాకం
- కన్నెత్తి చూడని ఆహార నియంత్రణ శాఖ
- తొడిమలు, నాసిరకం కాయలు వినియోగం
- ఆపై హానికరం రంగులు పులిమి వాడకం
- రూ.కోట్లలో పన్నుల ఎగవేస్తున్న వైనం

గుంటూరు మిర్చియార్డు, డిసెంబరు 7 ప్రభాతవార్త: కల్తీకారం తయారీదారులు గుంటూరు బ్రాండ్ ను దెబ్బతీస్తున్నారు. కల్తీకారానికి కేరాఫ్‌గా గుంటూరు మారడం దురదృష్టకరం. మిర్చి యార్డు పరిసరాల్లో నిత్యము 200 మిల్లుల్లో కల్తీకారం తయారవుతున్న నిఘావర్గాలు నిద్రపోవడం వెనుక మామూళ్ల బాగోతం నడుస్తున్నట్లు వినికిడి. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డుకు నిత్యము వేలాది టిక్కీలు, సీజన్లో అయితే లక్షల్లో యార్డుకు దిగుమతి అవుతుంటాయి. అయితే నాణ్యమైన సరుకును వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిపోయిన తొడిమెలు తాలూకాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి హానికరమైన రంగులను కలిపి కల్తీకారం తయారు చేస్తున్నారు.

ఈ కల్తీకారాన్ని అనేక బ్రాండ్లు పేరు పెట్టి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కల్తీకారం గుంటూరు తో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా అవుతుంది. కోట్ల రూపాయల కల్తీకారం లావాదేవీలు జరుగుతున్న విజిలెన్స్, ఆహార నియంత్రణ శాఖ, రెవెన్యూ శాఖ తదితర నిఘా వర్గాలు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఆమ్యాలు నడుస్తున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. వినియోగదారులు ప్రజల ఆరోగ్యముతో చెలగాటమాడుతున్న కల్తీకారం నిర్వాకం పై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. యార్డు పరిసరాల్లో నిత్యం 150 నుంచి 200 మిల్లులలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందని ఈ వ్యాపారంలో ఆరు తేరిన ఒక వ్యాపారి మరొకరితో చర్చించటం విశేషం. మేమంతా అధికారులకు నెలవారి మామూళ్ళు సమర్పించుకుంటాం.. మమ్మల్ని ఎవరు ఆపేది .. అంటూ ధీమా వ్యక్తం చేయడం వెనుక ఏ స్థాయిలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందో ఊహించవచ్చు. కల్తీకారం మిల్లుల వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడే విధంగా మాఫియా నడుపుతున్న కల్తీకారం మిల్లుల వ్యవహారంపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కల్తీకారం అడ్డగా గుంటూరులో 95శాతం కల్తీకారం జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ విభాగం, విజిలెన్స్ నెల వారి మావుళ్ళతో కల్తీ కారాన్ని అరికట్టలేకపోతున్నారు. తడిచిన మిరపకాయలు, తాలు మిరపకాయలు, ఫంగస్ కాయలు మిర్చి యార్డుకు కర్నూలు, గద్వాల్ నుంచి కొత్త మిరపకాయలు వస్తున్నాయి. వీటిని కొత్త కారం అని చెడిపోయిన ( గర్భాలు పోయిన) మిరపకాయలు, తొడిములు, వరిపొట్టు మిక్సింగ్ చేసి కారం ఆడిస్తున్నారు. ప్రతి కారం మిల్లు యజమానులు ఏజెంట్లు మిల్లులకు తాళాలు వేసి కల్తీకారం అక్రమంగా తయారు చేస్తున్నారు. మిల్లులో ఉన్న గుమస్తాలు హమాలీలు మా యజమాని ఎవరు వచ్చినా తాళం తీయవద్దు అని చెబుతున్నారు. తాలు మిరపకాయలు కారం ఆడిస్తున్నాము అని బహిరంగంగానే పేర్కొంటున్నారు. కొందరు యజమానులపై 2016-17లో కల్తీ కారానికి పాల్పడ్డ యజమానులపై కేసులు నమోదు చేశారు, గుంటూరు, ఖమ్మం, ఎమ్మిగనూరు ప్రాంతాలలో కేసులు నమోదు చేశారు.

### డబ్బుతో అవినీతిని కేసులను మాఫీ చేసుకుంటున్నారు

ఒక యజమాని తినడానికి తిండి లేక వేరే ప్రాంతం నుంచి గుంటూరు నగరానికి వలస వచ్చి ఇక్కడ వెహికల్స్ రిపేర్ (మోటారు సైకిల్స్‌కి గాలి పెట్టడం,పంచర్లు) వేయడం స్టేజి నుంచి కల్తీ కారం కుంభకోణంలో భాగమై ఈరోజు కల్తీకారం అగ్రస్థానంలో ఉన్నాడు. మరికొందరు వేరే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి వంట మనిషిగా క్లీనింగ్ గా వచ్చి కల్తీకారం కుంభకోణంలో పాత్రులై తమ వంతు వచ్చిన ఆదాయాన్ని ఆస్తులు రూపంలో పన్నులు కట్టకుండా భారీగా ఆస్తులు చేకూర్చుకున్నారు. ఇది ఐటీరంగ విభాగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి (డాక్టర్)గా ఉండి కొందరు కారం మిల్లులను లీజుగా తీసుకొని కల్తీ కారం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కానీ అధికారులు ఈ కల్తీకారాన్ని నియంత్రించలేకపోతున్నారు. కనీసం రాష్ట్రస్థాయి ఫుడ్ కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం దీనిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 2015 2016 ఒక కేజీ రంపం పొడిని మూడు రూపాయలకు కొని దానిని కల్తీ కారంలో వాడి కేజీ 200కి విక్రయించిన బడా బాబులు. గతంలో కల్తీకారానికి పాల్పడ్డ కొందరు ఇప్పుడు విచ్చలవిడిగా కల్తీకారం తయారుకు పాల్పడుతున్నారు.

అధికార యంత్రాంగానికి నెల మామూలు అవసరమైనంత కోట్లల్లో ఇవ్వడానికైనా సిద్ధం అంటున్న కల్తీ కారం కేటుగాళ్లు 2016 -2017 నుంచి ఇప్పటివరకు, విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ విభాగం వారు ఇంత దారుణంగా కల్తీకారం జరుగుతున్న చూసిచూనట్టు పోతున్నారు. కల్తీ కాలం వల్ల క్యాన్సర్ పేగు పూత అరుదుగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగంకల్తీ కారం పై వారు తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ప్రజల వాపోతున్నారు. కల్తీ కారం మిల్లులయజమానులపై ఐటి దాడులు తక్షణమే జరిపించాలని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఇంత దారుణం చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

# టైటిల్ పోరుకు హైదరాబాద్



**న్యూఢిల్లీ:** క్వాలిఫయర్ 1లో చెన్నై సూపర్ వారియర్స్‌ను 4-2 తేడాతో ఓడించి హైదరాబాద్ రాయల్స్ అద్భుతమైన పునరాగమనం చేసింది. ముంబై స్మాషర్స్ ఎలిమినేటర్‌లో లక్నో లియోపార్డ్స్‌ను ఓడించి, క్వాలిఫయర్ చెన్నైని ఓడించి 2025 ఇండియన్ పికిల్‌బాల్ లీగ్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. గ్రాండ్ ర్యాలీలు 25 వరకు ఆడగా, ముంబై స్మాషర్స్ తొలి మ్యాచ్‌లో 25-24 తేడాతో క్యాపిటల్ వారియర్స్ గుర్గావ్‌ను ఓడించింది. ఆపై బెంగళూరు బ్లాస్టర్స్‌పై 25-22 తేడాతో సునాయాసంగా విజయం సాధించి ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకుంది. ప్లేస్‌మెంట్ ర్యాలీలో బెంగళూరు 25-21 తేడాతో గుర్గావ్‌ను ఓడించి ఐదవ స్థానంలో నిలిచింది. క్వాలిఫైయర్ 1లో, గ్రాండ్ ఫినాలేకు నేరుగా టికెట్ కోసం చెన్నై సూపర్ వారియర్స్ హైదరాబాద్ రాయల్స్‌తో తలపడింది. పురుషుల సింగిల్స్‌ను 15-11తో గెలుచుకుని, ఆపై హర్ష్ మెహతాతో జతకట్టి 2-0 ఆధిక్యంలో నిలిచి, అదే స్కోరును పునరావృతం చేస్తూ, మిచ్ హార్గ్రీవ్స్ చెన్నైకి ఆదర్శవంతమైన ఆరంభాన్ని అందించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో రూస్ వాన్ రీక్ ‌, మేగాన్ ఫడ్జ్ అజేయంగా నిలిచింది. కిచెన్ లైన్‌ను ఆధిపత్యం చేసి 15-13 తేడాతో ఓటమిని అందించింది. వాన్ రీక్ లీగ్‌లో ఏకైక సింగిల్స్ ఓటమి. హైదరాబాద్ ఆ జోరును మహిళల డబుల్స్‌లోకి తీసుకెళ్లింది. అక్కడ ఫడ్జ్, శ్రేయ చక్రవర్తి చెన్నై జోడీ చివరి ప్రయత్నంగా 15-13తో గెలిచి టైను సమం చేశారు. గ్రాండ్ ర్యాలీలో హైదరాబాద్ జట్టు 21-17 తేడాతో చెన్నై ఆధిక్యాన్ని తారుమారు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

## బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో..

# రివాన్ టాప్ 10 ప్రదర్శన



**న్యూఢిల్లీ:** బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ముగిసిన అత్యంత పోటీతత్వ రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్‌లో భారతదేశానికి చెందిన రివాన్ దేవ్ ప్రీతమ్ రెండు టాప్10 ప్రదర్శనలను అందించాడు. ఇటీవలే హ్యాట్రిక్ జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను పూర్తి చేసిన చెన్నైకి చెందిన 12 ఏళ్ల రివాన్, ప్రీఫైనల్‌లో ఘనమైన డ్రైవ్‌తో ముందుకు వచ్చి పి12 నుండి ప్రారంభించిన తర్వాత ఆరవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో, 72 మంది డ్రైవర్లతో కూడిన రేసులో రివాన్ తొమ్మిదవ స్థానంలో నిలిచాడు. ఈ ప్రక్రియలో, రివాన్ తన ప్రతిభను మాత్రమే కాకుండా, మిడ్‌గ్రిడ్ స్థానాల నుండి ప్రారంభించిన తర్వాత మైదానంలో పోరాడాలనే తన దృఢ సంకల్పాన్ని కూడా ప్రదర్శించాడు. మరో రెండు భారతీయ ఎంట్రీలు, సీనియర్ విభాగంలో బెంగళూరుకు చెందిన ఇషాన్ మాదేష్, జూనియర్ విభాగంలో చెన్నైకి చెందిన ఎషాంత్ వెంగటేసన్ ముందుకు వచ్చినప్పటికీ ఇద్దరూ ఫైనల్స్‌కు అర్హత సాధించలేదు. కాగా రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్ ప్రపంచ కార్టింగ్ పోటీలో అత్యంత ఉత్తమమైనదిగా గుర్తింపు పొందింది. బహ్రెయిన్ ఈవెంట్ కోసం, 60 దేశాల నుండి 394 మంది డ్రైవర్లు అర్హత సాధించారు. గత నెలలో ముగిసిన నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో తమ తమ విభాగాలలో ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న తర్వాత మూడు భారతీయ ఎంట్రీలు ఇషాన్ మాదేష్, ఎషాంత్ వెంగటేశన్, రివాన్ దేవ్ ప్రీతం గ్రాండ్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

ఆట

# గౌహతి మాస్టర్స్.. ఛాంపియన్‌గా సంస్కర్

**న్యూఢిల్లీ:** గౌహతి మాస్టర్స్ 2025, పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా సంస్కర్ సరస్వత్ నిలిచాడు. ఇదే సమయంలో మహిళల విభాగంలో తన్వీ శర్మ ఓడిపోయింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌ను గెలుచుకుని సంస్కార్ తన తొలి వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 384వ స్థానంలో ఉన్న సరస్వత్ 21-11, 17-21, 21-13తో కఠినమైన మూడు గేమ్‌ల ఫైనల్‌లో అనుభవజ్ఞుడైన మిథున్ మజునాథ్‌ను ఓడించాడు. ఆట అంతటా తన ఆధిక్యాన్ని కోల్పోకుండా తన సీనియర్ స్వదేశీయుడిపై ఆధిపత్యం చెలాయించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో 8-2 ఆధిక్యంలో ఉన్న తర్వాత వరుస గేమ్ విజయం సాధించాడు. కాగా టీనేజర్ తన్వి శర్మ, మరోసారి టైటిల్‌కు ఒక విజయం దూరంలో నిలిచింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. చైనీస్ తైపీకి చెందిన తుంగ్ సియోటాంగ్ చేతిలో రెండు గేమ్‌లను కోల్పోయి, రన్నరప్‌గా నిలిచింది. 2024 ఒడిశా మాస్టర్స్ సూపర్ 100, 2025 యుఎస్ ఓపెన్ సూపర్ 300 తర్వాత ప్రస్తుత జూనియర్ ప్రపంచ ఫైనలిస్ట్‌కు ఇది మూడవ రన్నరప్ స్థానం. మరోవైపు యువ పురుషుల డబుల్స్ జోడీ పృథ్వీ రాయ్-సాయి ప్రతీక్ కూడా మలేషియా జంట తాయ్ / కాంగ్ చేతిలో 13-21, 18-21 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచారు.






# మినీ వేలంలో ముగ్గురు స్టార్స్‌పైనే ఫోకస్

## భారీ బిడ్లకు ఫ్రాంచైజీలు సిద్ధం

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో ముగుస్తుంది. అయితే ఈసారి ముగ్గురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. మినీ వేలం కోసం 1,355 మంది ఆటగాళ్లు నమోదు చేసుకోగా, మొత్తం 77 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 31 విదేశీ ఆటగాళ్లకు అందుబాటులో ఉన్నాయి. ఐపీఎల్ మినీ వేలంలో అత్యధిక బేస్ ధర రూ. 2 కోట్లు కాగా ఈ విభాగంలో 45 మంది ప్లేయర్లు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో ఇద్దరు భారతీయ ఆటగాళ్లు, ఒక విదేశీ ప్లేయర్ ఉన్నారు. ఆ ఆటగాళ్లు ఎవరంటే ఆల్ రౌండర్ వెంకటేష్ అయ్యర్, స్పిన్నర్ రవి బిష్ణోయ్ మరియు ఆస్ట్రేలియా ప్లేయర్ కామెరాన్ గ్రీన్. గత సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ అత్యంత ఖరీదైన ప్లేయర్లలో మూడవ స్థానంలో ఉన్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అతన్ని రూ.24 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఐపీఎల్ 2025లో అయ్యర్ ప్రదర్శన సాధారణంగా ఉండటంతో ఈసారి వేలానికి ముందే అతన్ని రిలీజ్ చేసింది. దీంతో ఇప్పుడు చాలా జట్లు వెంకటేష్‌ను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య అయ్యర్ కోసం పోటీ తీవ్రంగా ఉండబోతుంది. రవి బిష్ణోయ్ ఐపీఎల్ 2022 నుంచి లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతూ వచ్చాడు. కానీ 2025 ఐపీఎల్‌లో అతని ప్రదర్శన అంచనాలను అందుకోకపోవడంతో రిలీజ్ చేసింది. ఇప్పటివరకు అతను మొత్తం 77 మ్యాచ్‌లు ఆడి 72 వికెట్లు తీసిన యంగ్ లెగ్ స్పిన్నర్. ఇప్పుడు వేలంలో అన్ని జట్లలోనూ రవిపై ఆసక్తి ఉంది. కానీ ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని తప్పకుండా దక్కించుకోవాలని చూస్తోంది. చెన్నైకి మంచి భారత స్పెషలిస్ట్ లెగ్ స్పిన్నర్ అవసరం ఉంది. కాబట్టి రవి బిష్ణోయ్‌ను తమ జట్టులో చేర్చుకోవాలని సీఎస్‌కే బలంగా ప్రయత్నం చేస్తుందని తెలుస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా మినీ వేలంలోకి రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ఆటగాడిని ఆర్సీబీ ముంబై ఇండియన్స్ నుండి రూ.17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. గత సీజన్‌లో అతను గాయం కారణంగా ఆడలేకపోయాడు, కానీ ఈసారి తిరిగి వస్తున్నాడు. గ్రీన్ ఆస్ట్రేలియా ఫ్రంట్‌లైన్ ఆటగాడు, అతని ప్రస్తుత ఫామ్ అద్భుతంగా ఉంది. ఈ క్రమంలో ఇతడిపై రూ.25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చెన్నై, కోల్‌కతా మధ్య ఈ ఆటగాడి కోసం గట్టి పోటీ కనిపించవచ్చు.

## రెండో టెస్టులో..

# ఇంగ్లండ్ ఓటమి

## 2-0తో ఆధిక్యంలో ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** టెస్టులో ఇంగ్లాండ్‌ను ఓడించి, ఆస్ట్రేలియా సిరీస్ ఆధిక్యంలో ఉంది. ఆదివారం జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి 2025-26 యాషెస్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. బ్రిస్బేన్‌లో జరిగిన మ్యాచ్‌లో మైఖేల్ నేసర్ తొలి టెస్ట్‌లో ఐదు వికెట్లు పడగొట్టడంతో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో ఆస్ట్రేలియా 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించింది. ట్రావిస్ హెడ్ మరియు జేక్ వెదర్‌ల్యాండ్ తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించే ప్రయత్నం చేసినా కానీ



డిన్నర్ తర్వాత గస్ అట్కిన్సన్ ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేశాడు. అట్కిన్సన్ తన తదుపరి ఓవర్లో మార్నస్ లాబుస్చాగ్నేను అవుట్ చేశాడు, కానీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తన జట్టును లైన్ దాటించేలా చేశాడు, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ ఓవర్‌లో సిక్స్ కొట్టాడు. 4వ రోజు ప్రారంభంలో, బెన్ స్టోక్స్ మరియు విల్ జాక్స్ విరిగిన ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను స్థిరీకరించారు. ఏడవ వికెట్‌కు 96 పరుగులు జోడించారు. కానీ 35 ఏళ్ల నేజర్, తన మూడవ టెస్ట్ మాత్రమే ఆడుతూ, వరుస ఓవర్లలో రెండు సెట బ్యాటర్లను వెనక్కి పంపి, ఊపును తిరిగి పొందాడు. ఇంగ్లాండ్ చివరి నాలుగు వికెట్లను 17 పరుగులకే కోల్పోయింది, మరియు ఆస్ట్రేలియా వెంటనే విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## టాప్ ఐదు కార్పొరేట్లలో రూ.72,285 కోట్ల

# ఎంక్యాప్ పెరుగుదల




**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** దేశంలో టాప్ పది బిజినెస్ దిగ్గజ కంపెనీల్లో ఐదుసంస్థల మార్కెట్ విలువలు అంటే టర్నోవర్ రూ.72,285 కోట్లు పెరిగాయి. టిసిఎస్, ఇన్ఫోసిస్ కంపెనీలు అతిపెద్ద లాభపడిన సంస్థలుగా నిలిచాయి. భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ సంస్థలులాభాల్లో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ, ఎల్అండ్‌టి, ఎల్‌ఐసిలు కొంత కోతకు గురయ్యాయి. గతవారంలో బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ స్వల్పంగా 5.7పాయింట్లు లాభపడితే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 16.5 పాయింట్లు దిగజారింది. టిసిఎస్ 35,909.52 పాయింట్లు లాభపడి మార్కెట్ విలువలు రూ.11,71,862.37కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ మార్కెట్‌విలువలు 23,404.55కోట్లుపెరిగి మొత్తం రూ.6,71, 366.53 కోట్లకు చేరింది. ఇక బజాజ్‌ఫైనాన్స్‌పరంగా రూ.6720.28 కోట్లు పెరిగి రూ.6,52,396.39 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.37891.9 కోట్లు పెరిగి రూ.12,01, 832.74 కోట్లకు చేరింది. ఇక ఐసిఐసిఐ బ్యాంకు పరంగా రూ.2458.49 కోట్లు పెరిగి రూ.9,95,184.46 కోట్లకు చేరుకుంది. రిలయన్స్ విలువలు మాత్రం రూ.35,116.76 కోట్లు క్షీణించి రూ.20,85,218.71 కోట్లకు చేరింది. ఎల్‌ఐసి విలువలు కూడా రూ.15,559.49 కోట్లు క్షీణించి 5,50,021.80 కోట్లకు చేరినట్లు తేలింది. ఇక ఎస్‌బిఐ విలువలు కూడా ఈ వారంలో రూ.7522.96 కోట్లు క్షీణించి రూ,8.96,662.19 కోట్లకు చేరితే హెచ్‌డిఎఫ్‌ఎసి బ్యాంకు రూ.5724.03 కోట్లు క్షీణించి రూ.15,43,019.64 కోట్లకు చేరింది.ఇక ఎల్అండ్‌టి మార్కెట్‌విలువలుకూడా రూ.4185.39కోట్లు క్షీణించి రూ.55,55, 459.56 కోట్లకు చేరింది. మార్కెట్ విలువలు క్షీణించినా రిలయన్స్ టాప్‌వన్‌గానే నిలిచింది. తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టి, ఎల్‌ఐసిలు నిలిచాయి.

# ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లపైనే ఇన్వెస్టర్ల ఫోకస్!




**ముంబయి, డిసెంబరు7:** అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలు ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తాయని అంచనా. ఫెడ్‌రిజర్వు పాలకవర్గ కమిటీ ఫెడరల్ ఓపెన్‌మార్కెట్ కమిటీసమావేశం నిర్ణయాలపై ట్రేడర్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఈ ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితంచేయగలదు. అలాగే గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలు వంటివి సెంటిమెంట్‌పై ప్రభావం చూపిస్తాయని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. గత వారంలో స్టాక్ మార్కెట్లు అంత ఆశాజనకంగా కొనసాగలేదు. సెన్సెక్స్,నిఫ్టీలు దాదాపుగా ఫ్లాట్‌గానే ముగిసాయి. ఈ వారం మార్కెట్లు ఈనెల 12న విడుదలచేసే సిపిఐ గణాంకాలను చూస్తారు. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లనిర్ణయం కూడా కీలకం అవుతుందని రెలిగేర్‌బ్రోకింగ్ ఎస్‌విపి అజిత్‌మిశ్రా వెల్లడించారు. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90 దాటిన క్రమంలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసే ఛాన్స్‌లు కూడా ఎక్కువగానే ఉంటాయి.

ఈనెల 9,10 తేదీల్లో జరిగే ఎఫ్‌ఒఎంసి సమావేశాలే ఇన్వెస్టర్లు ఎక్కువ ఆసక్తితో గమనిస్తారని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సీనియర్ టెక్నికల్ అనలిస్టు ప్రవేశ్ గౌర్ తెలిపారు. అలాగే అమెరికా ఆర్థిక గణాంకాలు కూడా ట్రేడర్ల రాడార్‌లో ఉంటుంది. 9వ తేదీ అమెరికా ఉపాధి గణాంకాలు విడుదలచేస్తుంది. అలాగే అమెరికా డాలర్ ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా కీలకం అవుతాయి.వీటితోపాటు భారత్ ఆర్థికవృద్ధిగణాంకాలు రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణలను పరిగణనలోనికి తీసుకుని ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

# మూడు కంపెనీల నుంచి వేక్‌ఫిట్ రూ.186 కోట్లు సమీకరణ



**ముంబయి, డిసెంబరు 7:** హోమ్ అండ్ ఫర్నిషింగ్స్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ రూ.186 కోట్లను ముగ్గురు ఇన్వెస్టర్లనుంచి సమీకరించింది. సీడ్‌వ్యూ క్యాపిటల్, వైట్‌ఓక్ క్యాపిటల్, ఇన్ఫోఎడ్జ్, టీమ్‌సెక్ అధీనంలోని క్యాపిటల్2బిలనుంచి నిధులుసేకరించింది. పబ్లిక్ ఆఫర్‌కు ముందుగానే కొంత మొత్తం సేకరించుకోగలిగింది. స్టీడ్‌వ్యూ క్యాపిటల్ మారిషస్, వైట్‌ఓక్‌క్యాపిటల్, క్యాపిటల్ 2బిలు సమిష్టింగా 95.57 లక్షల ఈక్విటీ వాటా లను రూ.195 ధర చొప్పున కొనుగోలు చేసాయి. స్టీడ్ వ్యూక్యాపిటల్ రూ.101 కోట్ల విలువైన షేర్లు కొంటే వైట్‌ఓక్ రూ.72 కోట్లు పెట్టుబడులు పెట్టింది. అలాగే క్యాపిటల్2బి కూడా రూ.13కోట్లు వేక్‌ఫిట్‌లో పెట్టుబడులుపెట్టాయి. కంపెనీలో ఉన్న పీక్ ఫిఫ్టీన్ పార్టనర్స్, రెడ్‌వుడ్‌ట్రస్ట్, వెర్లిన్‌వెస్ట్ ఎస్ఎ కంపెనీలనుంచి వీరు కొనుగోలుచేస్తున్నారు. సెకండరీ షేర్ బాలాయింపులు ఈనెల 3,4 తేదీల్లో బదలాయించారు. వేక్‌ఫిట్ ఈనెల ఐదో తేదీనే రూ.580 కోట్లు యాంకర్ ఇన్వెస్టర్లనుంచి సేకరించింది. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్, ప్రుడెన్షియల్ హాంకాంగ్, 360వన్, స్టీవ్యూ క్యాపి టల్, అముంది ఫండ్స్ న్యూసిల్క్‌రోడ్, హెచ్‌డి ఎఫ్‌సి మ్యూచువల్‌ఫండ్; యాక్సిస్ మూచువల్ ఫండ్స్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి.




## దేశ ఆర్థికవ్యవస్థకు

# ఈ ఐదు రాష్ట్రాలే కీలకం

## జిడిపిలో వీటి వాటా 48శాతం!

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** భారత్ ఆర్థికవ్యవస్థ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతోంది. దేశ స్థూల జిడిపి సుమారు 4.125 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అంటే రూ.343 లక్షలకోట్లు అని అర్థం. దీనికితోడు ఆర్‌బిఐనుంచి ఆర్థికరంగ నిపుణులు కూడా 6.6శాతం వృద్ధితో ఉన్నారు. జిడిపి 2025-26లో 8.2శాతానికి విస్తరిస్తుందన్న అంచనాలు కూడా లేకపోలేదు. కేవలం ఐదు రాష్ట్రాలు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్; ఉత్తరప్రదేశ్‌లనుంచి మాత్రమే ఎక్కువ వాటా అందుతోంది. ఈ ఐదు రాష్ట్రాలనుంచే 48శాతం దేశ జిడిపికి అందుతున్నట్లు అంచనా.ఆర్థికవృద్ధికి ఊతంగా ఎక్కువగా ఐటి, ఉత్పత్తిరంగం, సేవలరంగాలే కీలకం. జాతీయ సగటు 6.5శాతం కంటే మరింతగా వృద్ధినమోదుచేసాయి. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక వృద్ధి, మహారాష్ట్ర ఆర్థిక ఆధిపత్యం వంటివి భారత్ వృద్ధి స్టోరీకి కీలకంగా ఉన్నాయి. 2028-29 నాటికి దేశం ఐదులక్షలకోట్లడాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశంగా మారుతోందని కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించింది. మహారాష్ట్ర జిఎస్‌డిపి రూ.49.39 లక్షలకోట్లుగా ఉంది. భారత జిడిపిలో 13.5శాతం వాటాతో ఉంది. 2028కల్లా ఈరాష్ట్ర జిడిపి 55 లక్షలకోట్లకు చేరుతుందని అంచనా. అలాగే తమిళనాడు జిఎస్‌డిపి కూడా 35.68 లక్షలకోట్లుగా ఉంది. దేశ జిడిపికి 9శాతం వాటాతో ఉంది. సేవలరంగంనుంచే అత్యధికంగా వెళుతోంది. కర్ణాటక సిలికాన్ వ్యాలీగా ఉన్న కర్ణాటక కూడా దేశ జిడిపిలో 8.2శాతం వాటాతో ఉంది. ఉత్తరప్రదేశ్‌పరంగాచూస్తే రూ.30.70లక్షలకోట్లతో దేశ జిడిపికి 8.2శాతం వాటాను అందిస్తున్నట్లు తేలింది. ఈ ఐదు రాష్ట్రాలే దేశ ఆర్థికవృద్ధికి గ్రోత్ ఇంజిన్లు, పవర్‌హౌస్‌లుగా ఉన్నట్లు ఆర్థిక నిపుణుల అంచనా.

## స్విస్‌బ్యాంకులో 10వేల

# ఉద్యోగాలకోత!



**బెర్న్, డిసెంబరు 7:** స్విట్జర్లాండ్‌లో అతిపెద్ద బ్యాంకు అయిన యుబిఎస్ రానున్న మూడేళ్లలో పదివేల ఉద్యోగాలను తొలగించే ప్రణాళికనున పరిశీలిస్తోందని స్విస్‌పత్రిక సోన్‌టాగ్స్ బ్లిక్ వెల్లడించింది. 2023లో క్రెడిట్ స్యూసీ విలీనం తర్వాత ఈభారీ పునర్నిర్మాణప్రక్రియ జరుగుతున్నదని వెల్లడించింది. పాలనావ్యవహారాలను క్రమబద్ధీకరించడంకోసం ఈ కొలువుల కోతలు, విలీనప్రక్రియకు ఎంతో మేలుచేస్తాయని అధికారులు చెపుతు న్నారు. యుబిఎస్ ప్రతినిధులు ఈ పదివేల సంఖ్యను మాత్రం ధృవీకరించడంలేదు. క్రెడిట్‌స్యూయిస్ కొనుగోలు తర్వాత యుబిఎస్ తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియలోభాగంగా వీలైనంత తక్కువగా ఉద్యోగ కోతలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు యుబిఎస్ అధికారులు తెలిపారు. 2024 చివరినాటికి యుబిఎస్‌లో సుమారు 1.10 లక్షలమంది ఉద్యోగులు ఉండగా 10వేలమందిని కుదించిన తర్వాత సుమారు 9శాతం తగ్గించింది. ఇప్పటికే సెప్టెంబరు చివరినాటికి ఉద్యోగుల సంఖ్యను బ్యాంకు 1,04,427కి తగ్గించింది. ఈ విలీనం ప్రభావంతో ఇదివరకే సుమారు 15వేల ఉద్యోగాలు తొలగించినట్లు తెలుస్తోంది.

## ఒక్కవారంలోనే

# రూ.11,820కోట్లు విత్‌డ్రా!




**ముంబయి, డిసెంబరు 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈనెల మొదటివారంలో మార్కెట్ల నుంచి రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు గణాంకాలు చెపుతున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు క్షీణించినకారణంగా భారీ ఎత్తున ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గచూపించారు. నవంబరులో కూడా 3765 కోట్లు విత్‌డ్రాచేసారు. అయితే అక్టోబరులో మాత్రం ఎఫ్‌పిఐలు 14,610 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మూడునెలలు నిరంతరాయంగా విత్‌డ్రాచేసిన తర్వాత అక్టోబరులో పెట్టుబడులు పెంచారు. సెప్టెంబరులో 23,885కోట్లు, ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు విత్‌డ్రాచేసినట్లు డిపాజిటరీ డేటా చెపుతోంది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈ నెలలోని మొదటివారంలోనే రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు ఎన్‌ఎస్‌డిఎల్ వెల్లడించింది.

దీనితో మొత్తం పెట్టుబడులు విత్‌డ్రా ఈ ఏడాదిలో రూ.17.7 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1.55 లక్షలకోట్లుగా ఉంది. కేవలం కరెన్సీ క్షీణత కారణంగానే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు నిపుణులు అంచనా. రూపాయి ఈ ఏడాది ఐదుశాతంవరకూ క్షీణించింది. ఈకాలంలోనే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ తెలిపారు. ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసినా దేశీయ ఇన్వెస్టర్లు మార్కెట్లకు ఊతం ఇస్తున్నారు. దీనికితోడు యుఎస్ భారత్‌ట్రేడ్‌డీల్ ఖరారులో జాప్యంకూడా గ్లోబల్ సెంటిమెంట్‌పై భారం పడుతోంది. దేశీయ ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.19,783కోట్లు పెట్టుబడులుపెట్టారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14